www.peoplesnews.in

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 242 బుధవారం, మే 27, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad




# శివరాజ్ సింగ్ అప్నాపన్ పుస్తకావిష్కరణ

**ఆవిష్కరించిన మాజీ ప్రధాని దేవేగౌడ**


**వెంకయ్య తదితర ప్రముఖుల హాజరు**



**న్యూఢిల్లీ,మే 26 :** కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రచించిన 'అప్నా పన్: మై ఎక్స్‌పీరియన్స్ విత్ నరేంద్ర మోదీ' పుస్తకా విష్కరణ కార్యక్రమం దేశ రాజధాని మిగతా2లో...

# దేశంలో అసహజ జనాభా మార్పు

**- ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు: హోంమంత్రి అమిత్ షా వెల్లడి**



**న్యూఢిల్లీ,మే 26 :** అక్రమ వలసలు, ఇతర కారణాలతో దేశంలో చోటుచేసుకుంటున్న 'అసహజ జనాభా మార్పు'పై ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్టు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ 2025 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చేసిన ప్రకటనకు అనుగుణంగా ఈ కమిటీని ఏర్పాటు చేసినట్టు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. ఈ కమిటీకి రిటైర్డ్ జడ్జి ప్రకాష్ ప్రభాకర్ నావోలేకర్ అధ్యక్షత వహిస్తారని, మాజీ ఐఏఎస్ అధికారి దుర్గా శంకర్ మిశ్రా, మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, ఆర్థికవేత్త డాక్టర్ షమికా రవి సభ్యులుగా మిగతా2లో...



# ప్రొఫెసర్ నాగేశ్వర్ అంటే నాకిష్టం.. అరెస్ట్ చేయొద్దని చెప్పాను..!

**అమరావతి,మే26 :** ఆంధ్రప్రదేశ్ పోలీసులు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్‌ను అరెస్టు చేస్తారనే వదంతులకు చెక్ పడింది. నాగేశ్వర్‌ను అరెస్ట్ చేయొద్దని తానే స్వయంగా పోలీసులకు చెప్పానని ఏపీ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. ఈ విషయంపై మరోసారి స్పందిస్తూ .. 'ఇవాళ కూడా అరెస్ట్ చేసేందుకు పోలీసులు వెళ్తున్నారని తెలిసింది. నాగేశ్వర్‌ను అరెస్ట్ చేయడం వంటివి వద్దని వారికి చెప్పాను. పాపం ఆయనంటే నాకిష్టం. పొరపాటున అలా అన్నారేమో వదిలేయమని చెప్పా' అని రాజమండ్రి పార్టీ సమావేశంలో పవన్ కల్యాణ్ అన్నారు. మిగతా2లో...

# ఇంటింటి సర్వేతో 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా'

● సర్వే పూర్తయిన ఇళ్లకు ప్రత్యేక లోగో స్టిక్కర్లు ● భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయం



**హైదరాబాద్,మే 26 :** రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా ప్రణాళిక కార్యక్రమం విజయవంతం కావడంతో, దాని ముగింపు వేడుకలను పురస్కరించుకుని జూన్ 2 నుండి 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించాలని కెబినెట్ సబ్ కమిటి అధికారులను ఆదేశించింది. మంగళవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటి సమావేశం జరిగింది. ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం లో మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డిలు పాల్గొన్నారు. గ్రామ సభ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో మిగతా2లో...



# ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

**- కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శలు**

**కరీంనగర్,మే 26 :** రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల విషయంలో పూర్తిగా విఫలం అయ్యిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర విమర్శలు చేశారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన నిధులు కేంద్ర ప్రభుత్వానివా, రాష్ట్ర ప్రభుత్వానివా అన్న విషయంపై సమాధానం చెప్పాలన్నారు. ధాన్యం రవాణా ఖర్చులను కూడా పూర్తిగా మిగతా2లో...

# వాహనదారులపై మళ్లీ పిడుగు

● సిఎన్‌జి ధరలు పెంచిన కేంద్రం ● వరుసగా నాలుగోసారి పెరిగిన ధరలు




**న్యూఢిల్లీ,మే 26 :** కేంద్రం మళ్లీ షాకిచ్చింది. సీఎన్‌జీ ధరలను మరోసారి పెంచింది. కిలో సీఎన్‌జీపై రూ.2 పెంచింది. పెరిగిన ధరలు మంగళవారం నుంచే అమలులోకి వచ్చాయి. తాజా పెంపుతో ఢిల్లీలో సీఎన్‌జీ ధర రూ.81.09 నుంచి రూ.83.09కి చేరింది. సీఎన్‌జీ ధరలను పెంచడం మే 15వ తేదీ నుంచి ఇది నాలుగోసారి కావడం గమనార్హం. మే 15వ తేదీన మొదట కిలోకు రూ.2 పెంచగా.. అనంతరం మిగతా2లో...


2లో

# తెలంగాణలో అవినీతి రాజ్యం

అడ్డంగా దోచుకుంటున్న కాంగ్రెస్

శంషాబాద్‌లో 180 ఎకరాలు హాంఫట్

సింగరేణిలో కోట్ల రూపాయాల బొగ్గు మాయం

కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీష్ రావు సంచలన ఆరోపణలు

# కర్నాటకంపై కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి

● డికెకు పగ్గాలు అప్పగించేందుకు రంగం సిద్ధం

● సిద్ధరామయ్యను రాజ్యసభకు పంపే యత్నం?



**న్యూఢిల్లీ,మే 26 :** కర్ణాటకలో నాయకత్వ పోరుకు తెరపడనున్న ట్టు కాంగ్రెస్ పార్టీ వర్గాల సమాచారం. సిఎం మార్పు లేదని బయటకు చెబుతున్నా, డికె శివకుమార్‌కు పగ్గాలు అందించేందుకు కాంగ్రెస్ రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. సిద్ధరామయ్య ప్రభుత్వం ఇటీవల మూడేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో మిగతా2లో...

# అర్హులంతా ఓటరు జాబితాలో ఉండాల్సిందే

**అనర్హుల పేర్లను మాత్రమే తొలగించాలి**


**సర్ ప్రక్రియపై ఎన్నికల అధికారి ఆదేశాలు**


2లో

# మజ్లిస్ ఒత్తిడితోనే జిహెచ్ఎంసి విభజన

నగరంలో మంచినీటి సమస్యను పట్టించుకోని ప్రభుత్వం

తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపణ


2లో

# మహిళల భద్రత, గౌరవానికి ప్రాధాన్యం

● సంపద సృష్టించే శక్తిగా మహిళలకు ప్రోత్సాహం ● సఖి నివాస్ వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ప్రారంభించిన సీతక్క


2లో

# ఇంటింటి సర్వేతో 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా'

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటివరకు నిర్వహించిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాల ప్రగతిని సమీక్షించిన కేబినెట్ సబ్ కమిటి రాబోయే రోజుల్లో ప్రజా భాగస్వామ్యంతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. ఇందులో భాగంగా జూన్ 2 నుండి 12 వరకు నిర్వాహించాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ముఖ్యంగా 'పర్యావరణ వారోత్సవం', రోడ్డు భద్రత, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారం, మహిళా-శిశు రక్షణ, గృహ నిర్మాణం, పర్యాటక ప్రోత్సాహం, పట్టణాభివృద్ధి, పునర్వినియోగ శక్తి (గ్రీన్ ఎనర్జీ) ప్రాజెక్టుల అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను నిర్వహించాలని నిర్దేశర చేశారు. ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా, అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని మంత్రులు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకం అమలుపై కేబినెట్ సబ్ కమిటీ సుదీర్ఘంగా చర్చించింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తింపజేయాలన్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రులు పునరుద్ఘాటించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇల్లు కవర్ అయ్యేలా సమగ్ర గృహ స్థాయి డేటా సేకరణ జరపాలి. ఒకవేళ ఎవరైనా మిగిలిపోతే వారి కోసం ప్రత్యేక శిబిరాలు (స్పెషల్ క్యాంపులు) ఏర్పాటు చేయాలి. పథకం ప్రయోజనాలు ప్రజల్లోకి తీసుకెళ్లేలా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఈ బీమా పథకానికి ఒక విశిష్టమైన 'లోగో'ను రూపకల్పన చేయనున్నారు. సర్వే పూర్తయిన ప్రతి ఇంటికి ఈ లోగోతో కూడిన స్టిక్కర్లను అతికించనున్నారు.

మేరకు అన్ని శాఖలు తమ సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణ రావు అధికారులను ఆదేశించారు. డిజిపి సి.వి ఆనంద్, స్పెషల్ చీఫ్ సెక్రటరీలు జయేష్ రంజన్, వికాస్ రాజు, నవీన్ మిత్తల్, వాణి ప్రసాద్, దాన కిషోర్, ప్రిన్సిపల్ సెక్రటరీలు సందీప్ కుమార్ సుల్తానీయా, గౌరవ్ ఉప్పల్, తదితర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వమే భరిస్తోందని బండి సంజయ్ పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం కేవలం మధ్యవర్తిగా మాత్రమే వ్యవహరిస్తోందన్నారు. అయినప్పటికీ ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ఇకనైనా బేషజాలకు పోకుండా యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలని కోరారు. అలాగే అన్ని రకాల వడ్లకు బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడమే లక్ష్యంగా 'రైతు గోస - బీజేపీ భరోసా' పేరుతో యాత్రలు నిర్వహిస్తున్నామని బండి సంజయ్ తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి బీజేపీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

# కర్నాటకంపై కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

మరోసారి నాయకత్వ సమస్య తెరపైకి వచ్చింది. పార్టీ అధిష్ఠానం సిద్ధరామయ్య, డీకేలను న్యూఢిల్లీకి పిలవడంతో ఎట్టకేలకు సమస్య కొలిక్కి వచ్చినట్టు చెబుతున్నారు. ముఖ్యమంత్రి పదవిని ఆశిస్తున్న ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు అధిష్ఠానం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందని, ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు రాజ్యసభ సీటును ఆఫర్ చేసి కేంద్రంలో కీలక పాత్ర పోషించాల్సిందిగా కోరిందని తెలుస్తోంది. తగిన సమయం తీసుకుని నిర్ణయం చెప్పాల్సిందిగా ఆయనకు సూచించినట్టు చెబుతున్నారు.

దీంతో సిద్ధరామయ్య రెండు, మూడు రోజుల్లో రాజీనామా చేసే అవకాశాలున్నాయని అంటున్నారు. కర్ణాటక నుంచి రాజ్యసభ, ఎమ్మెల్సీ ఎన్నికలపైనే ఢిల్లీ సమావేశంలో చర్చించినట్టు కాంగ్రెస్ అధిష్ఠానం చెబుతున్నప్పటికీ ఈ సమావేశంలో రాష్ట్రంలో నాయకత్వ మార్పిడిపై ప్రధానంగా చర్చ జరిగినట్టు చెబుతున్నారు. డీకే శివకుమార్‌కు అధికారాన్ని (సీఎం) బదిలీ చేసేందుకు అధిష్ఠానం ఏకగ్రీవంగా మద్దతు పలికిందని పార్టీ వర్గాలు తెలిపాయి. సుమారు 6 గంటల సేపు జరిగిన ఈ సమావేశంలో సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌తో పాటు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, రణ్‌దీప్ సూర్జేవాలా పాల్గొన్నారు. కర్ణాటకలో జరిగిన 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘనవిజయం సాధించింది. సీఎం పదవిని సిద్ధరామయ్య చేపట్టారు.

అయితే డీకే శివకుమార్‌తో రెండున్నరేళ్లు చొప్పున పదవీకాలం పంచుకునేందుకు అప్పట్లో నిర్ణయం జరగిందని ఆయన వర్గం చెబుతోంది. ఈ వాదనను సిద్ధరామయ్య తోసిపుచ్చారు. ఐదేళ్లూ తానే సీఎంగా ఉంటానని, అయితే అధిష్ఠానం నిర్ణయమే శిరోధార్యమని తరచు చెబుతున్నారు.

# అర్హులంతా ఓటరు జాబితాలో ఉండాల్సిందే

**హైదరాబాద్,మే 26 :** భారత ఎన్నికల సంఘం రాష్ట్రంలో త్వరలో చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భాగంగా రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అలాగే అనర్హులైన ఓటర్ల పేర్లను తొలగించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఐఎఎస్ ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని బిఆర్‌కెఆర్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, ఐఏఎస్, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డి, ఐఏఎస్, ఉప ప్రధాన ఎన్నికల అధికారి (ఎఫ్ఏసీ) జి.ఎస్. చారిలతో కలిసి ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశానికి జిహెచ్ఎంసి కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్, ఐఏఎస్, మేడ్చల్?మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. మను చౌదరి, ఐఏఎస్, సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు హాజరయ్యారు. మ్యాపింగ్ ప్రక్రియ లో బూత్ స్థాయి అధికారులు కీలక పాత్ర పోషిస్తున్నందున వారికి తగిన శిక్షణ ఇవ్వాలని సూచించారు. అలాగే పనివిధానంపై నిరంతరం సమీక్షిస్తూ, మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే అపార్టుమెంట్స్ సముదాయాలు, గేటెడ్ కమ్యూనిటీలపై ప్రత్యేక దృష్టి సారించి సర్ ప్రక్రియ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో, ముఖ్యంగా మురికివాడలలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. ప్రక్రియను మరింత సరళీతరం చేయడానికి ఎన్యూమరేషన్ ఫారాలు ఆంగ్లం, తెలుగు భాషల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. అలాగే ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ సక్రమంగా జరిగేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రక్రియ నిర్వహణలో పాలుపంచుకుంటున్న క్షేత్రస్థాయి సిబ్బందిని ప్రోత్సహించేందుకు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అవార్డు అందజేయనున్నట్లు ప్రధాన ఎన్నికల అధికారి ప్రకటించారు.

# మజ్లిస్ ఒత్తిడితోనే జిహెచ్ఎంసి విభజన

**హైదరాబాద్,మే 26 :** కేసీఆర్ హయాంలో కూడా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో మోసం చేశారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు కూడా హైదరాబాద్‌లోని పేద ప్రజలకు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. మజ్లిస్ ఒత్తిడితో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మూడు ముక్కలు చేశారని రామచందర్‌రావు దుయ్యబట్టారు. హైదరాబాద్‌లో డివిజన్ల ఏర్పాటుపై ఇప్పటికీ అధికారులకు ఒక క్లారిటీ లేదని చెప్పారు.ఇందిరమ్మ ఇళ్లపేరుతో ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తోందని మతీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తోందని ధ్వజమెత్తారు. మంగళవారం కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడారు. హైదరాబాద్ నగరంలో ప్రజలు నీటి సమస్యను ఎదుర్కొంటున్నారని తెలిపారు.

ప్రజలకు నీటి సరఫరా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని మండిపడ్డారు. ప్రజాసమస్యలను కాంగ్రెస్ నేతలు పక్కదారి పట్టిస్తున్నారని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్‌కు మజ్లిస్ ముఖ్యం కానీ, హైదరాబాద్ ప్రజలు ముఖ్యం కాదని చెప్పుకొచ్చారు. భాగ్యనగరంలో కాలుష్య నియంత్రణలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో రియల్ ఎస్టేట్ పేరుతో జేబులు నింపుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలయ్యిందని అన్నారు. భాగ్యనగరంలో చిన్న వాన పడితే.. నగరం మునిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భాగ్యనగరాన్ని విశ్వనగరంగా బీజేపీ మాత్రమే మార్చగలదని వ్యాఖ్యానించారు. రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో మజ్లిస్, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని హెచ్చరించారు. తెలంగాణలో అవినీతి రహితమైన పరిపాలనను బీజేపీ మాత్రమే అందిస్తుందని రామచందర్‌రావు పేర్కొన్నారు.

# మహిళల భద్రత, గౌరవానికి ప్రాధాన్యం



**హైదరాబాద్,మే 26 :** మహిళల భద్రత, వారి గౌరవానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క చెప్పారు. మహిళల ఉన్నతే తెలంగాణ ప్రగతి అని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణ పరిమితి పెంచుతున్నట్లు మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళలను సంపద సృష్టించే శక్తిగా తీర్చిదిద్దుతున్నామని వ్యాఖ్యానించారు. మహిళల ఆదాయం పెరిగితే కుటుంబం బలపడుతుందని పేర్కొన్నారు. మంగళవారం బంజారాహిల్స్‌లో సఖి నివాస్ వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క హాజరై మాట్లాడారు. జూన్ 5వ తేదీన మహిళలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆర్టీసీ బస్సులు అందజేస్తారని తెలిపారు. మహిళా సంఘాల సోలార్ ప్లాంట్లను బుధవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క మధిరలో ప్రారంభిస్తారని పేర్కొన్నారు. వర్కింగ్ ఉమెన్స్ భద్రత తమ ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. గ్రామీణ మహిళలకు హైదరాబాద్‌లో సురక్షిత వసతి కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. సఖి నివాస్‌లో 150 మంది మహిళలకు వసతి సౌకర్యం కల్పిస్తున్నామని వివరించారు. చిన్నపిల్లలతో వచ్చే తల్లులకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధి మహిళల పురోగతితోనే ముడిపడి ఉందని నమ్మిన ప్రభుత్వం తమదని స్పష్టం చేశారు. మహిళలు కేవలం చిన్న చిన్న వ్యాపారాలకే పరిమితం కాకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారని గుర్తు చేశారు. ఇందుకోసం మండలాల్లో రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం 100 ఎకరాల వరకు ప్రభుత్వ భూములను కేటాయించడానికి సిద్ధంగా ఉందన్నారు. కార్పొరేట్ మార్కెట్ రంగంలోకి మహిళలను తీసుకెళ్లేందుకు 'మహిళా శక్తి సూపర్ బాజార్ల'ను ఏర్పాటు చేయబోతున్నట్లు వెల్లడించారు.

# శివరాజ్ సింగ్ అప్నాపన్ పుస్తకావిష్కరణ

(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీలో ఘనంగా జరిగింది. అప్నాపన్ పుస్తకాన్ని మాజీ ప్రధాని హెచ్.డి.దేవెగౌడ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశానికి అప్నాపన్ పుస్తకాన్ని శివరాజ్ సింగ్ అంకితం చేశారు. దేశాభివృద్ధికి నరేంద్ర మోదీ చేస్తున్న కృషి, ఆయనతో తన అనుభవాలను ఈ పుస్తకంలో కేంద్ర మంత్రి పొందుపరిచారు. పుస్తకావిష్కరణ అనంతరం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ప్రసంగించారు.ఆయన మాట్లాడుతూ.. 'రైతు కుటుంబం నుంచి శివరాజ్ సింగ్ చౌహాన్ వచ్చారు. 17 ఏళ్ల పాటు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. దేశంలో ప్రముఖ ముఖ్యమంత్రిగా శివరాజ్ సింగ్ పేరు తెచ్చుకున్నారు. ఉచిత పథకాలకు నేను వ్యతిరేకం. రాష్ట్రాలు తమ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకోవాలి. ప్రజలకు విద్య, ఆరోగ్యం అందించాలి. మోదీ అంటే 'మేకింగ్ ఆఫ్ ఇండియా డెవలప్‌మెంట్' అని పేర్కొన్నారు. ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఏపీ మంత్రి నారా లోకేశ్, పలువురు టీడీపీ ఎంపీలు, ఎన్డీఏ నేతలు హాజరయ్యారు.

# దేశంలో అసహజ జనాభా మార్పు

(మొదటి పేజీ తరువాయి)

ఉంటారని అమిత్‌షా తెలిపారు. కమిటీ మెంబర్‌గా హోం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ ఉంటారని చెప్పారు. దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న జనాభా మార్పులపై కమిటీ సమగ్ర మూల్యాంకనం చేసి పరిష్కారం సూచిస్తుందని అమిత్‌షా తెలిపారు. జనాభా మార్పు సమస్య భారతదేశ సార్వభౌమత్యం, జాతీయ భద్రత, సామాజిక సమతుల్యత, ఆదివాసీ సమాజాల పరిరక్షణకు పెను సవాలుగా మారిందన్నారు. మత, సామాజిక వర్గాల స్థాయిలో జనాభా మార్పుల సరళని కమిటీ విశ్లేషిస్తుందని చెప్పారు.

# ప్రొఫెసర్ నాగేశ్వర్ అంటే నాకిష్టం.. అరెస్ట్ చేయొద్దని చెప్పాను..!

(మొదటి పేజీ తరువాయి)

సామాజిక విశ్లేషకుడు, మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్‌కు ఊరట లభించింది. జనసేన అధ్యక్షుడు, ఏపీ ఉపముఖ్యమంత్రి, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, నాదెండ్ల మనోహర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఆయనను అరెస్ట్ చేస్తారనే వార్తలన్నీ అవాస్తమేనని తేలింది. నాగేశ్వర్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవడాన్ని స్వాగతించిన పవన్ కల్యాణ్ అరెస్ట్ వద్దని పోలీసులకు చెప్పారు.

# వాహనదారులపై మళ్లీ పిడుగు

(మొదటి పేజీ తరువాయి)

రెండుసార్లు ఒక్క రూపాయి చొప్పున కేంద్రం పెంచింది. తాజాగా మరో రూ.2 పెరగడంతో నాలుగోసారి సీఎన్‌జీ ధరలు పెరిగినట్లయ్యింది. గత 11 రోజుల్లో మొత్తం రూ.7 వరకు ధరలు పెరగడంతో వాహనదారులు, ఆటో, క్యాబ్, ట్రాన్స్‌పోర్ట్ రంగాలపై అదనపు భారం పడనుంది. ఎన్నికల ముందు ఇంధన ధరలు పెంచబోమని పదేపదే ప్రకటించిన కేంద్రం.. ఎన్నికలు ముగిశాక వరుసగా ధరలు పెంచుకుంటూ పోతున్నది. తాజాగా మరోసారి ఇంధన ధరలను పెంచింది. సోమవారం నాడు పెట్రోల్‌పై లీటర్‌కు రూ. 2.61, డీజిల్‌పై లీటర్‌కు రూ. 2.71 చొప్పున ధరలు పెరిగాయి. తాజా పెంపుతో మే 15 నుంచి లీటర్‌కు మొత్తం పెంపు రూ.7.5కు చేరింది. గడచిన 11 రోజుల్లో ఇంధన ధరలు పెరుగడం ఇది నాలుగోసారి. ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 99.51 నుంచి రూ. 102.12 చేరుకోగా లీటర్ డీజిల్ ధర రూ. 92.49 నుంచి రూ. 95.20కి పెరిగింది.

# నేడు ఢిల్లీకి తమిళనాడు సిఎం విజయ్

- ప్రధాని మోడీతో భేటీకి అవకాశం



**చెన్నై,మే 26 :** తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ బుధవారం ఢిల్లీ పర్యటన చేయనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ప్రధాని నరేంద్ర మోడీని కలిసే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు వెల్లడించారు. బుధవారం ఉదయం సీనియర్ అధికారులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శితో సహా విజయ్ ఢిల్లీకి చేరుకోనున్నారు. అలాగే ఈ పర్యటనలో కాంగ్రెస్ సీనియర్ నేత సోనియాగాంధీ, రాహుల్ గాంధీని ఆయన కలవనున్నారు. విజయ్ ముఖ్యమంత్రి అయ్యాక ఇదే తొలి పర్యటన కావడం గమనార్హం.

# తెలంగాణలో అవినీతి రాజ్యం

**హైదరాబాద్,మే 26 :** తెలంగాణలో అవినీతి రాజ్యం నడుస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. భూములు ఆక్రమణలు, రెవెన్యూలో వేలకోట్ల స్కామ్‌లు, సింగరేణిలో బొగ్గు ఆక్రమణలు జరుగుతున్నాయని అన్నారు. అడ్డంగా దోచుకుంటున్నారని కాంగ్రెస్‌పై ఆయన విరుచుకు పడ్డారు. శంషాబాద్ సమీపంలోని 180 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. ఈ స్కాంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నిహితుడి పాత్ర ఉందని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సిట్, సీఐడీ విచారణ జరపాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో హరీష్ రావు మాట్లాడుతూ.. ప్రైవేట్ వ్యక్తికి సదరు భూమి అప్ప జెప్పి.. తప్పు చేసిన ఎమ్మార్వోను బదిలీతో సరిపెట్టారన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి తహసీల్దారును వెంటనే డిస్మిస్ చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ స్కాం వెనుక సీసీఎల్ఏ ఉన్నాడా? కలెక్టర్ ఉన్నాడా? అంటూ హరీష్ రావు సందేహం వ్యక్తం చేశారు. ఈ భూమి ప్రభుత్వానిదని ఆర్డీవో చెబుతున్నారని చెప్పారు. పై అధికారి చెప్పినా వినకుండా.. ఎమ్మార్వో మాత్రం ఇది ప్రైవేట్ భూమి అంటున్నారని హరీష్ రావు వివరించారు. ముఖ్యమంత్రికి సన్నిహితుల నుంచి ఒత్తిడి ఉన్నందునే తహసీల్దారును బదిలీ చేసి కాపాడుతున్నారని ఆరోపించారు. సీఎం సన్నిహితుల ఒత్తిడితోనే.. ఎమ్మార్వోపై చర్యలు తీసుకోకుండా ఏసీబీ అధికారులు వెనక్కి వచ్చారని ఆరోపించారు. సింగరేణిలో రూ.16 వందల కోట్ల విలువైన బొగ్గు మాయమైందని ఆందోళన వ్యక్తం చేశారు. టన్నుల బొగ్గు ఎక్కడో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించాలని డిమాండ్ చేశారు. బొగ్గు ఉందో? లేదో? పరిశీలన కోసం అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు స్పష్టం చేశారు. 'కాంగ్రెస్ హఠావో - సింగరేణి బచావో'.. బొగ్గు గని కార్మికుల నినాదం కావాలని హరీష్‌రావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ హయాంలో సింగరేణి స్కాంలకు గనిలా మారిందని అభివర్ణించారు. నైనీ బ్లాక్ బొగ్గు గనుల టెండర్.. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని బయట పెట్టిందన్నారు. త్వరలో సింగరేణిపై కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలు మరిన్ని బయటపెడతానని హరీష్‌రావు స్పష్టం చేశారు. అలాగే రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌పై వేసిన సస్పెన్షన్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ శాఖలో వేల కోట్ల రూపాయిల అవినీతి జరుగుతోందంటూ హరీష్ రావు తీవ్ర ఆరోపణలు గుప్పించారు.

# జిల్లా అభివృద్ధిలో ఆర్‌డీఓ వెంకటేష్ సేవలు ప్రశంసనీయం

- మేడారం మహాజాతర విజయవంతంలో కీలక పాత్ర
- సమర్థవంతమైన సేవలకు ఘన సత్కారం
- జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు











**ములుగు జిల్లా ప్రతినిధి మే 26(పీపుల్స్ న్యూస్)**
ములుగు జిల్లా అభివృద్ధిలో రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ వెంకటేష్ సేవలు ప్రశంసనీయమని, ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ మహాజాతర విజయవంతం కావడంలో ఆయన కీలక పాత్ర పోషించారని జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. ములుగు జిల్లాలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ వెంకటేష్‌కు మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి అధ్యక్షతన ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆర్‌డీఓ వెంకటేష్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్‌డీఓ వెంకటేష్ జిల్లాలో తన విధుల కాలంలో సమర్థవంతమైన పరిపాలన అందించారని ప్రశంసించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపుతూ ప్రజలకు అందుబాటులో ఉండి పని చేశారని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలు, రెవెన్యూ పరిపాలన, మేడారం మహాజాతర నిర్వహణ సమయంలో సమన్వయంతో వ్యవహరించి ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించారని, తన పనితీరుతో సహచర అధికారుల అభిమానాన్ని సంపాదించుకున్నారని అన్నారు. జిల్లా అభివృద్ధికి ఆయన అందించిన సేవలు అభినందనీయమని కొనియాడారు. కొత్త స్థానంలో కూడా ఇదే నిబద్ధత, అంకితభావంతో పనిచేసి మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు లు మాట్లాడుతూ ఆర్‌డీఓ వెంకటేష్ విధి నిర్వహణలో నియమనిబద్ధత, క్రమశిక్షణతో ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వహించారని తెలిపారు. రామచంద్రపూర్ భూముల రీసర్వేలో తనకంటూ ప్రత్యేక ముద్రను సంపాదించుకున్నారని, జూనియర్ అధికారులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని కొనియాడారు. మేడారం మహాజాతరలో ప్రోటోకాల్ విధుల్లో సమర్థవంతంగా పనిచేశారని పేర్కొన్నారు. వివిధ భూ సమస్యలను సత్వరమే పరిష్కరించడంలో తన వంతు పాత్ర పోషించారని తెలిపారు. బదిలీపై వెళ్తున్న ఆర్‌డీఓ వెంకటేష్ మాట్లాడుతూ ములుగు జిల్లాలో పనిచేసిన అనుభవం తనకు ఎంతో ప్రత్యేకమని అన్నారు. జిల్లా అధికారుల సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించే అవకాశం లభించిందని తెలిపారు. అందరి సహకారాన్ని ఎప్పటికీ మరువలేనని పేర్కొన్నారు. జిల్లాలో పనిచేయడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. మేడారం మహాజాతరలో విధులు నిర్వహించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. విధి నిర్వహణలో తనకు సహకరించిన స్థానిక మంత్రి అనసూయ సీతక్కకు, జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లకు, అన్ని మండలాల ఎమ్మార్వోలు, ఎంపీడీఓలకు కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో మళ్లీ అవకాశం లభిస్తే ములుగు జిల్లాలో సేవలందించడానికి సిద్ధంగా ఉంటానని తెలిపారు. అనంతరం ఆర్‌డీఓ వెంకటేష్‌ను జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, జిల్లా అధికారులు శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఆర్‌డీఓ ప్రతాప్, జిల్లా అధికారులు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, జూనియర్ అసిస్టెంట్లు, నాలుగవ తరగతి ఉద్యోగులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు అవగాహన సదస్సు

- అందరి సహకారంతో ములుగు జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి
- జిల్లా సంక్షేమ అధికారిణి ప్రేమలత



**ములుగు జిల్లా ప్రతినిధి మే 26( పీపుల్స్ న్యూస్)**
మహిళాభివృద్ధి శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ములుగు జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో జిల్లాలోని ములుగు, మల్లంపల్లి, వెంకటాపూర్, గోవిందరావుపేట మండలాలకు చెందిన వివాహాలు నిర్వహించే పురోహితులు, ఖాజీలు, పాస్టర్లు, టెంట్ హౌస్ నిర్వాహకులు, ఫోటోగ్రాఫర్లు, బ్యాండ్ మేళం నిర్వాహకులకు బాల్య వివాహ నిరోధక చట్టంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారిణి ప్రేమలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవగాహన కార్యక్రమం బుధవారం, తేదీ 27.05.2026న ఉదయం 11 గంటలకు ములుగు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ములుగు, మల్లంపల్లి, వెంకటాపూర్, గోవిందరావుపేట మండలాలకు చెందిన వివిధ మతాల మత పెద్దలు, వివాహాలు నిర్వహించే వ్యక్తులు, టెంట్ హౌస్ నిర్వాహకులు, ఫోటోగ్రాఫర్లు, బ్యాండ్ మేళం నిర్వాహకులు తదితరులు తప్పనిసరిగా ఈ అవగాహన సదస్సులో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బాల్య వివాహాల వల్ల కలిగే చట్టపరమైన, సామాజిక, ఆరోగ్యపరమైన ప్రభావాలపై పూర్తి అవగాహన పొందడంతో పాటు ములుగు జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా సంక్షేమ అధికారిణి ఆ ప్రకటనలో కోరారు.

# మహిళపై అసభ్య ప్రవర్తన, అల్లరి సృష్టించిన వ్యక్తికి 5 రోజుల జైలు శిక్ష

**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో మే 26 (పీపుల్స్ న్యూస్) :** ఒక మహిళపై అసభ్యంగా ప్రవర్తించి,



దుర్భాషలాడుతూ బహిరంగంగా అల్లరి సృష్టించిన నిందితుడికి న్యాయస్థానం 5 రోజుల జైలు శిక్ష విధించింది. ఈ సంఘటన మలక్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల ప్రకారం..... హైదరాబాద్ శాలివాహన నగర్, మూసారాంబాగ్‌కు చెందిన ప్రసాద్ కుమారుడు ఎన్. సుధీర్ కుమార్ (24) అనే వ్యక్తి బహిరంగ ప్రదేశంలో ఒక మహిళ పట్ల అత్యంత అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు, దుర్భాషలాడుతూ తీవ్ర అలజడి సృష్టించాడు. ఈ ఉల్లంఘనపై మలక్‌పేట్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం. తేజ్యా నాయక్ , కోర్టు డ్యూటీ ఆఫీసర్ రామ్‌సంతోష్ కఠిన చర్యలు చేపట్టారు. నిందితుడిపై సిటీ పోలీస్ చట్టం పెట్టి కేసు నమోదు చేశారు. పోలీసులు సేకరించిన పక్కా ఆధారాలతో నిందితుడిని మంగళవారం ఏడవ ప్రత్యేక జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎమ్. భాస్కర్ ముందు హాజరుపరిచారు. నిందితుడిపై మోపబడిన నేరం రుజువు కావడంతో, మేజిస్ట్రేట్ నిందితుడు ఎన్. సుధీర్ కుమార్‌కు 5 రోజుల జైలు శిక్ష విధిస్తూ సంచలన తీర్పు చెప్పారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ సమాజంలో అల్లరి సృష్టించే వారిపై మలక్‌పేట్ పోలీసులు అత్యంత కఠినంగా వ్యవహరిస్తారని ఎస్.హెచ్.ఓ కె. నరసింహ ఈ సందర్భంగా హెచ్చరించారు.

# "వడ్లు పండించడం ఒక ఎత్తయితే... వాటిని అమ్ముకోవడం మరో యుద్ధంగా మారింది"

- వడ్లు పండించిన రైతుకు గిట్టుబాటు దక్కదా..?
- స్వర్ణ రకం ధాన్యాన్ని కొనక రైతులను కంటతడి పెట్టిస్తున్న ఐకేపీ కేంద్రాలు
- వర్షాకాలం సమీపిస్తున్నా కొనుగోళ్లలో జాప్యం -- రైతుల్లో పెరుగుతున్న ఆందోళన



**ములుగు జిల్లా ప్రతినిధి మే 26( పీపుల్స్ న్యూస్)**
వడ్లు పండించడం ఒక ఎత్తయితే వాటిని అమ్ముకోవడం మరో యుద్ధంగా మారింది" అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతును కదిలిస్తే మాట కంటే ముందు కళ్ళ నుంచి కన్నీరే కనపడుతుంది. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతుగా పడుతున్న ఇబ్బందులను ఇప్పుడు పట్టించుకునే వారే కరువయ్యారు. వెంకటాపురం(రామప్ప) మండలంలో రైతులు పండించిన స్వర్ణ క్రాస్ వరి ధాన్యం కొనుగోలు కాక గోదాములు, ఇళ్ల ముందే పేరుకుపోవడంతో రైతాంగం తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తోంది. నెలల తరబడి అప్పులు చేసి, కష్టనష్టాలు భరించి సాగు చేసిన పంట చేతికొచ్చిన సమయంలో కొనుగోలు కేంద్రాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం రైతుల ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉందని రైతులు వాపోతున్నారు. ముఖ్యంగా స్వర్ణ క్రాస్ రకం వరి ధాన్యాన్ని ఐకేపీ కేంద్రాల్లో కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. "వడ్లు పండించడం ఒక ఎత్తయితే... వాటిని అమ్ముకోవడం మరో యుద్ధంగా మారింది" అంటూ రైతులు తమ గోడును వెల్లగక్కుతున్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు స్పష్టత ఇవ్వకపోవడం, సమస్యపై స్పందించకపోవడం రైతుల్లో మరింత అయోమయాన్ని పెంచుతోంది. ఇప్పటికే వేసంగి సీజన్ ముగిసినా కొనుగోళ్లు పూర్తి కాకపోవడంతో రైతుల ఇళ్ల ముందు, రోడ్ల పక్కన, కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం వరి ధాన్యం రాశులు పెద్దఎత్తున పేరుకుపోయాయి... మరోవైపు వర్షాకాలం సమీపిస్తుండటంతో ఎప్పుడైనా వర్షాలు కురిస్తే ధాన్యం తడిసి నాణ్యత కోల్పోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని వ్యాపారులు కూడా కొనరని, దీంతో పూర్తిగా నష్టపోయే పరిస్థితి వస్తుందని రైతులు చెబుతున్నారు. పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లినా సరైన స్పందన లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి స్వర్ణ రకం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతాంగం డిమాండ్ చేస్తోంది.
లేదంటే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టక తప్పదని రైతులు హెచ్చరిస్తున్నారు.

# నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, మే 26 (పీపుల్స్ న్యూస్):** నాలుగేళ్ల మైనర్ బాలికపై జరిగిన లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ హైదరాబాద్‌లోని 'ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు జడ్జి సంచలన తీర్పు వెలువరించారు. రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోక్సో చట్టం ప్రకారం నిందితుడు రాజేంద్రనగర్ కు చెందిన చిల్కూరు సందీప్ కుమార్ (20) పై నేరం రుజువైంది. ఈ మేరకు నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 50,000 జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. వీటితో పాటు బాధితురాలికి రూ. 3,00,000 పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది. వివరాల ప్రకారం..... 2019 జూన్ 4న మధ్యాహ్నం 1:30 గంటలకు బాధితురాలైన (నరసరీ చదువుతున్న 4 సంవత్సరాల బాలిక) తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. ఉప్పర్ పల్లి సమీపంలోని ఎర్రబోడలో ఉన్న తన నివాసం వద్ద బాలిక ఇతర పిల్లలతో కలిసి ఆడుకుంటోంది. ఈ క్రమంలో పొరుగున ఉండే నిందితుడు సందీప్ కుమార్, బాలికను తన నివాసానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీనిపై రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు దాఖలు చేయగా, అనంతరం బాధితురాలి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయడం కోసం ఈ కేసును 'భరోసా' కేంద్రానికి బదిలీ చేశారు. ఈ క్లిష్ట సమయంలో బాధితురాలికి, ఆమె కుటుంబ సభ్యులకు 'భరోసా' బృందం నిరంతరం కౌన్సిలింగ్ సెషన్స్ నిర్వహిస్తూ అండగా నిలిచింది. వరుస ఫాలో-అప్ సెషన్ల ద్వారా వారికి నైతిక, మానసిక స్థైర్యాన్ని అందించింది. న్యాయస్థానం నిందితుడికి కఠిన శిక్ష విధించడం పట్ల బాధితురాలి కుటుంబ సభ్యులు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. ఈ కేసు విచారణలో రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. సురేష్ (xూ), రాజేంద్రనగర్ డివిజన్ ఏసీపీ కె. అశోక్ చక్రవర్తి, స్పెషల్ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి. వెంకటేశ్వర రెడ్డి, 'భరోసా' లీగల్ కౌన్సిలర్లు ధృతి చౌదరి, చందు అలిమేల, భరోసా బృందం, రాజేంద్రనగర్ పీఎస్ కోర్టు డ్యూటీ ఆఫీసర్ ఎన్. కృష్ణయ్య ఎంతో ప్రతిభ కనబరిచారు. విచారణ ప్రక్రియ వేగవంతంగా ముగిసి, నిందితుడికి శిక్ష పడటంలో వీరి కృషి ఎంతగానో తోడ్పడింది. ఈ కేసు దర్యాప్తును, భరోసా కేంద్రం అధికారుల సమన్వయ ప్రయత్నాలను ఉమెన్ సేఫ్టీ వింగ్ డిసిపి డాక్టర్ లావణ్య, ఉమెన్ సేఫ్టీ ఏసిపి ప్రసన్న లక్ష్మి, భరోసా ఇన్‌స్పెక్టర్ పి. పద్మ , సెంటర్ అడ్మినిస్ట్రేటర్ గాడుసు జ్యోతి నిరంతరం పర్యవేక్షించారు. కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి, నిందితుడికి శిక్ష పడేలా సమన్వయంతో కృషి చేసిన పోలీస్ అధికారులు, భరోసా కేంద్రం సిబ్బంది , ఇతర భాగస్వాములందరినీ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ ప్రత్యేకంగా అభినందించారు.

# రాబోయే గోదావరి పుష్కరాలకు పకడ్బందీ ఏర్పాట్లు

-భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమగ్ర కార్యాచరణ
- దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు







**ములుగు జిల్లా ప్రతినిధి మే 26 (పీపుల్స్ న్యూస్)**
రాబోయే గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు తెలిపారు. మంగళవారం సరస్వతి పుష్కరాల 6వ రోజు సందర్భంగా కాళేశ్వరం మెగా విశ్రాంతి భవనంలో గోదావరి పరివాహక ప్రాంతాలకు చెందిన భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ములుగు జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు, మంచిర్యాల జిల్లా కలెక్టర్ దీపక్ కుమార్, జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ రాబోయే గోదావరి పుష్కరాల నిర్వహణకు సుమారు రూ.1000 కోట్ల నిధులను విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. సరస్వతి పుష్కరాల సందర్భంగా ఎదురైన లోటుపాట్లను గుర్తించి, గోదావరి పుష్కరాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. పుష్కరాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున పారిశుధ్యం, త్రాగునీరు, మరుగుదొడ్లు, పార్కింగ్, విద్యుత్ సరఫరా, భద్రత, వీఐపీ, వివిఐపీ పర్యటనలకు అవసరమైన ఏర్పాట్లు తదితర అంశాలపై జిల్లాల వారీగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే పుష్కర ఘాట్ల అభివృద్ధి, రహదారుల మరమ్మతులు, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సేవలు, అత్యవసర సేవల అందుబాటు వంటి అంశాలపై ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని ఆదేశించారు. అంతకుముందు భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సరస్వతి ఆది, అంత్య పుష్కరాల సందర్భంగా భక్తులకు కల్పించిన సౌకర్యాలు, చేపట్టిన ఏర్పాట్లను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ (పి పి టి) ద్వారా వివరించారు. ఈ సమావేశంలో నిజామాబాద్, నిర్మల్ జిల్లాల అదనపు కలెక్టర్లు బుజంగరావు, వెంకటేశ్వర్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, కాటారం ఆర్డీవో రవీందర్ తదితరులు పాల్గొన్నారు

బుధవారం, మే 27, 2026

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# ఏసీబీ వలలో చిక్కిన షామీర్పేట్ ఎమ్మార్వో సుచరిత.



హైదరాబాద్ : క్రైమ్ బ్యూరో, మే 26 (పీపుల్స్ న్యూస్)

షామీర్పేట్ మండల్ ఎమ్మార్వో సుచరిత మంగళవారం నాడు కార్యాలయం లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. వివరాలు ప్రకారం30.00 ఎకరాల వ్యవసాయ భూమిని నాలాగా మార్చే దరఖాస్తులను పరిశీలించి, ఆమోదించడం" అనే అధికారిక సహాయం చేయడానికి, ఫిర్యాదిదారుడి నుండి 30 లక్షలు డిమాండ్ చేశారు. బాధితుడు ఏసీబీ అధికారులు కు ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు ఎమ్మార్వో సుచరిత ప్రైవేట్ డ్రైవర్ వి. నాగేష్ ద్వారా రూ. 30 లక్షల లంచం డిమాండ్ చేసి, అందులో భాగంగా రూ. 2 లక్షలు తీసుకుంటుండగా పట్టుబడ్డారు.నూా−1 యొక్క ప్రైవేట్ డ్రైవర్ (నూ2) స్వాధీనంలో నుండి రూ. 2,00,000/- కలుషితమైన లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. ఎమ్మార్వో సుచరిత, డ్రైవర్ నాగేష్ లను అరెస్టు చేసి, జ్యుడిషియల్ రిమాండ్ కోసం నాంపల్లిలోని గౌరవనీయులైన ప్రత్యేక న్యాయమూర్తి ముందు హాజరుపరచడం జరిగింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.సెల్ ఫోన్ నంబర్-1064 (టోల్ ఫ్రీ నంబర్)ఏదైనా ప్రభుత్వ అధికారి లంచం డిమాండ్ చేసిన పక్షంలో, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడానికి ప్రజలు ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్, అనగా 1064ను సంప్రదించవలసిందిగా కోరడమైనది. ఏసీబీ తెలంగాణను వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్ (తెలంగాణ ఏసీబీ), మరియు ట్విట్టర్ (ఏతెలంగాణ ఏసీబీ) వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా కూడా సంప్రదించవచ్చు. తెలంగాణ ఏసీబీని సంప్రదించడానికి, అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేస్తున్న ప్రముఖ బహిరంగ ప్రదేశాలలో ఏసీబీ క్యూఆర్ కోడ్ కూడా ప్రదర్శించబడుతుంది. బాధితుడు/ఫిర్యాదుదారుడి పేరు వివరాలు గోప్యంగా ఉంచబడతాయి అని అధికారులకు తెలిపారు.

# చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

-- బాలానగర్‌లో అపస్మారక స్థితిలో లభించిన వ్యక్తి...

-గాంధీ దవాఖానలో కన్నుమూత

-- బాలానగర్ సీఐ టి. నరసింహ రాజు

బాలానగర్ మే 27 ( పీపుల్స్ న్యూస్)

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన స్థానికంగా విషాదాన్ని కలిగించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొద్ది రోజుల క్రితం బాలానగర్ పోలీస్ స్టేషన్ సమీపంలోని గౌతమ్ నగర్ ప్రధాన రహదారిపై సుమారు 50 ఏళ్ల వయస్సు గల ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే బాలానగర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని వెంటనే చికిత్స నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స



అందిస్తుండగా అతని ఆరోగ్య పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై స్పందించిన బాలానగర్ సీఐ నర్సింహా రాజు తెలిపిన వివరాల మృతుడి వివరాలు ఇప్పటివరకు తెలియరాలేదని, మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. మృతుడు ఎవరన్నది గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని చెప్పారు. మృతుడి బంధువులు లేదా అతన్ని గుర్తించే వారు ఎవరైనా ఉంటే వెంటనే బాలానగర్ పోలీసులను సంప్రదించాలని సీఐ కోరారు. సమాచారం అందించేందుకు 87126 63384 లేదా 8712663209 నంబర్లను సంప్రదించాలని సూచించారు. మానవత్వం చాటిన పోలీసులురోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించే ప్రయత్నం చేసిన బాలానగర్ పోలీసులు మానవత్వాన్ని చాటారు. అయితే చివరికి అతను ప్రాణాలు కోల్పోవడం బాధాకరంగా మారింది.

# విద్యుత్ షాక్ తో మేకల మృతి







ములుగు జిల్లా ప్రతినిధి మే 26 (పీపుల్స్ న్యూస్)

మండలంలోని పాలంపేట గ్రామంలో పత్రి సారంగపాణి చెందిన రెండు మేకలు విద్యుత్ షాక్ తో మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. . గ్రామస్తులు, మేకల యజమాని సారంగపాణి తెలిపిన వివరాల ప్రకారం గ్రామ శివారులో మేకలను మంగళవారం ఉదయం మేతకు తీసుకెళ్లగా ట్రాన్స్పారం పక్కన ఉన్న విద్యుత్ స్తంభానికి గల ఎర్త్ వైర్ కు విద్యుత్ సరఫరా కావడం మేకలు విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందినట్లు తెలిపారు. సుమారు 30 వేల రూపాయలు నష్టం వాటిల్లిందని నిరుపేదసారంగపాణిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు

# చైనా నుంచే హైదరాబాద్‌లో ఉన్న రోగికి చికిత్స - ఏఐఎన్‌యూలో సర్జన్ రోబోటిక్ టెలిసర్జరీ



హైదరాబాద్: భారతీయ వైద్య రంగంలో, శస్త్రచికిత్సా ఆవిష్కరణలలో ఒక చారిత్రాత్మక మైలురాయి నమోదైంది. భారతదేశపు అతిపెద్ద సింగిల్-స్పెషాలిటీ యూరో/నెఫ్రో హాస్పిటల్ నెట్‌వర్క్ అయిన ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీకి చెందిన సీనియర్ సర్జన్, దాదాపు 3900 కిలోమీటర్ల (వైమానిక దూరం) దూరంలో ఉన్న రోగికి రిమోట్ రోబోటిక్-అసిస్టెడ్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. భౌగోళిక సరిహద్దులతో సంబంధం లేకుండా నిపుణులైన వైద్య సేవలను అందించడంలో టెలి-సర్జరీ యొక్క అపారమైన సామర్థ్యాన్ని ఈ విజయం నిరూపించింది.

స్థానిక సర్జన్లకు మార్గదర్శకత్వం : రోబోటిక్ శస్త్రచికిత్సలు ఖచ్చితత్వాన్ని పెంచడం, సర్జన్ల నైపుణ్యాన్ని వేగవంతం చేయడం ద్వారా వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చాయి. అయితే, పట్టణ ప్రాంతాలను దాటి నైపుణ్యం కలిగిన నిపుణులను తయారు చేయడం ఇప్పటికీ ఒక సవాలుగా ఉంది. 5+ ఆధారిత కనెక్టివిటీతో భవిష్యత్తు అంతా 'టెలి-ప్రొక్టరింగ్' పైనే ఆధారపడి ఉంటుంది. దీని ద్వారా అనుభవజ్ఞులైన నిపుణులు శస్త్రచికిత్సలోని కీలకమైన దశల్లో సుదూర ప్రాంతాల నుంచి స్థానిక సర్జన్లకు మార్గదర్శకత్వం వహించగలరు. ఈ 'హబ్-అండ్-స్పోక్' మోడల్ రోగుల ప్రయాణ భారాలను తగ్గించి, స్థానిక వైద్యుల నైపుణ్యాలను పెంచుతుంది. అదే సమయంలో రోగి సంరక్షణ, బాధ్యత పూర్తిగా శస్త్రచికిత్స చేస్తున్న స్థానిక సర్జన్ చేతుల్లోనే ఉంటాయి.

చారిత్రాత్మక నిర్వహణ : చైనాలోని వుహాన్‌ను, భారతదేశంలోని హైదరాబాద్‌తో అనుసంధానిస్తూ దాదాపు 3900 కిలోమీటర్ల దూరం నుంచి ఏఐఎన్‌యూ రోబోటిక్ ఒ మినిమల్ యాక్సెస్ యూరాలజికల్ సర్జరీ డైరెక్టర్ డాక్టర్ సయ్యద్ ఎండి.గౌస్ ప్రపంచంలోనే మొట్టమొదటి టెలి-రోబోటిక్ యూరెటెరిక్ రీఇంప్లాంటేషన్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. చైనాలోని టౌంగ్జీ హాస్పిటల్, ఏఐఎన్యూ మధ్య జరిగిన చారిత్రాత్మక సహకారానికి ఈ ప్రక్రియ ఒక నిదర్శనం. హైదరాబాద్‌కు చెందిన 57 ఏళ్ల మహిళా రోగి లోయర్ యూరెటెరిక్ స్ట్రిక్చర్ (మూత్రనాళం ఇరుకుగా మారడం) కారణంగా తరచూ మూత్రనాళ అడ్డంకులతో బాధపడుతున్నారు. గతంలో స్టెంటింగ్ ద్వారా తాత్కాలిక ఉపశమనం లభించినప్పటికీ, మళ్లీ లక్షణాలు పునరావృతమవడంతో పరీక్షలు నిర్వహించి, శాశ్వత అడ్డంకి ఉన్నట్లు నిర్ధారించారు. సాధారణ మూత్ర ప్రవాహాన్ని పునరుద్ధరించడానికి సర్జికల్ బృందం యాంటీ-రిఫ్లక్స్ యూరెటెరిక్ రీఇంప్లాంటేషన్ శస్త్రచికిత్సను చేపట్టింది. అధునాతన రోబోటిక్ సాంకేతికతను ఉపయోగించి, 100 మిల్లీసెకన్ల కంటే తక్కువ లాటెన్సీ (సమయ విలంబన)తో ఈ సర్జరీని అత్యంత ఖచ్చితత్వంతో, రియల్-టైమ్‌లో పూర్తి చేశారు. సరిహద్దులు దాటి ప్రత్యేక వైద్య సేవలను అందించడంలో రోబోటిక్ సర్జరీ సామర్థ్యాన్ని ఈ విజయం చాటి చెప్పింది. ఈ ప్రక్రియను రోగి సమ్మతి, అవసరమైన అన్ని నియంత్రణ అనుమతులతో నిర్వహించారు.5+ సాంకేతికత వృద్ధి : ఈ శస్త్రచికిత్స గురించి ఏఐఎన్‌యూ బంజారాహిల్స్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ ఒ రోబోటిక్ సర్జన్ డాక్టర్ మల్లికార్జున సి మాట్లాడుతూ "రోబోటిక్ సర్జరీ సంక్లిష్టమైన శస్త్రచికిత్సల విధానాన్ని మార్చివేసింది. ఖచ్చితత్వాన్ని పెంచడంతో పాటు సర్జన్లు త్వరగా నైపుణ్యం సాధించేలా చేస్తోంది. సాంకేతికత అందుబాటులోకి వస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో నైపుణ్యాన్ని పెంపొందించడమే అసలైన సవాలు. 5+ సాంకేతికత వృద్ధి చెందుతున్న తరుణంలో, 'టెలి-ప్రొక్టరింగ్' అనేది భవిష్యత్ వైద్య విధానంగా మారుతోంది. ఇది అనుభవజ్ఞులైన సర్జన్లు కీలకమైన సమయాల్లో రిమోట్ ద్వారా స్థానిక బృందాలకు దిశానిర్దేశం చేయడానికి ఉపయోగపడుతుంది. ఈ సమన్వయ నమూనా ద్వారా రోగులకు వారి ఇంటికి దగ్గరలోనే నాణ్యమైన వైద్యం అందుతుంది." అన్నారు."సాంకేతికత వైద్య సంరక్షణ యొక్క సరిహద్దులను ఎలా పునర్నిర్వచిస్తుందో ఈ మైలురాయి నిరూపిస్తుంది. రోబోటిక్ ప్లాట్‌ఫామ్‌లు, బలమైన కనెక్టివిటీ సహాయంతో, మనం శారీరకంగా అక్కడ లేకపోయినా అదే ఖచ్చితత్వంతో ఖండాలు దాటి అత్యంత ప్రత్యేకమైన శస్త్రచికిత్సలను చేయగలుగుతున్నాము. ఇది అధునాతన క్యాన్సర్ సంరక్షణను అందరికీ సమసంరక్షణ యొక్క సరిహద్దులను ఎలా పునర్నిర్వచిస్తుందో ఈ మైలురాయి నిరూపిస్తుంది. రోబోటిక్ వాస్తవంగా చేరువచేయడంలో ఒక కీలకమైన అడుగు" డాక్టర్ సయ్యద్ ఎండి. గౌస్, ఏఐఎన్‌యూ రోబోటిక్ ఒ మినిమల్ యాక్సెస్ యూరాలజికల్ సర్జరీ డైరెక్టర్రియల్-టైమ్ నియంత్రణతో సర్జరీ : ఈ సంక్లిష్టమైన యూరాలజీ ప్రక్రియను అత్యాధునిక రోబోటిక్ సర్జికల్ సిస్టమ్ ద్వారా నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఏఐఎన్‌యూ హాస్పిటల్, చైనాలోని టౌంగ్జీ హాస్పిటల్‌కు చెందిన ఇద్దరు యూరోసర్జన్ల బృందం ఉమ్మడిగా ఈ సర్జరీని పూర్తి చేసింది. హై-స్పీడ్, లో-లాటెన్సీ కనెక్టివిటీ, ప్రెసిషన్ రోబోటిక్స్ సహాయంతో ఎటువంటి ఆలస్యం లేకుండా, రియల్-టైమ్ నియంత్రణతో ఈ సర్జరీ సజావుగా సాగింది. సకాలంలో చికిత్స పొందడంలో ఇబ్బందులు, రవాణా సవాళ్లను ఎదుర్కొనే మారుమూల లేదా వెనుకబడిన ప్రాంతాల ఇటువంటి అత్యాధునిక సాంకేతికత ఎంతగానో మేలు చేస్తుందని ఈ మైలురాయి స్పష్టం చేస్తోంది.

# బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

- సీఐ దయాకర్







గోవిందరావుపేట (పస్రా), ములుగు ప్రతినిధి మే 26 (పీపుల్స్ న్యూస్)

బక్రీద్ పండుగ సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు గోవిందరావుపేట సీఐ దయాకర్ తెలిపారు. పస్రా పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ ఐపీఎస్ ఆదేశాలు, డీఎస్పీ రవీందర్ సూచనలు మేరకు, సీఐ దయాకర్ పర్యవేక్షణలో ఎస్సై తాజుద్దీన్ ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ దయాకర్ మాట్లాడుతూ బక్రీద్ పండుగను కులమతాలకు అతీతంగా, పరస్పర గౌరవ భావాలతో శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. పండుగ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. సామరస్య వాతావరణం నెలకొల్పడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలందరూ సోదరభావంతో పండుగను జరుపుకుంటే సమాజంలో ఐక్యత మరింత బలపడుతుందని తెలిపారు.అలాగే సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులను నమ్మవద్దని, అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు.ఈ సమావేశంలో నర్సాపూర్ ఎస్సై కమలాకర్, తాడ్వాయి ఎస్సై జగదీశ్, ఎస్సైలు అంజనేయులు, ఎర్రయ్య, పోలీస్ స్టేషన్ సిబ్బంది, కాటాపురం, గోవిం దరావుపేట, భూసాపూర్, నార్లపురం, తాడ్వాయి ప్రాంతాల ముస్లిం మత పెద్దలు, బీజేపీ, ఏబీవీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# కమలాపూర్‌లో అగ్నికి ఆహుతైన తాటి వనాలను పరిశీలించిన ఎంపీ ఈటల రాజేందర్;

- గీత కార్మికులను ఆదుకోవాలని డిమాండ్

- కమలాపూర్‌లో అగ్నికి ఆహుతైన తాటి వనాలను పరిశీలించిన ఎంపీ ఈటల రాజేందర్; గీత కార్మికులను ఆదుకోవాలని డిమాండ్







హన్మకొండ/కమలాపూర్, ప్రతినిధి మే 26 (పీపుల్స్ న్యూస్)

హుజూరాబాద్ నియోజకవర్గం కమలాపూర్ మండల పరిధిలో ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైన తాటి వనాలను ఎంపీ ఈటల రాజేందర్ సందర్శించారు. ఈ ఘోర ప్రమాదంలో దాదాపు 1000 తాటి చెట్లు మంటల్లో కాలి బూడిదయ్యాయని, వాటిలో ప్రస్తుతం 100కు పైగా చెట్ల నుండి కల్లు గీస్తూ జీవనం సాగిస్తున్న గీత కార్మికులు తమ జీవనోపాధిని కోల్పోయి రోడ్డున పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.తాటి చెట్లతో పాటు స్థానిక రైతుల మోటర్లు, పైపులు, వైర్లు సైతం పూర్తిగా కాలిపోయి తీవ్ర నష్టం వాటిల్లిందని ఆయన పేర్కొన్నారు. ఇంత పెద్ద ఎత్తున నష్టం వాటిల్లినప్పటికీ, బాధితులను పరామర్శించేందుకు అధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం అత్యంత విచారకరమన్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నష్టపోయిన గీత కార్మికులకు, రైతులకు తగిన ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. పంట పొలాల్లో ఉండే వ్యర్థాలను తగులబెట్టవద్దని, అలా చేయడం వల్ల ఇలాంటి ఘోర ప్రమాదాలు జరిగి ఇతరులకు భారీ నష్టం వాటిల్లడమే కాకుండా, భూసారం కూడా దెబ్బతింటుందని హెచ్చరించారు. రైతులందరూ అప్రమత్తంగా ఉంటూ భవిష్యత్తులో ఇలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఈటల రాజేందర్ కోరారు."

# ఐఐఐటీ జంక్షన్ వద్ద రోడ్డు అభివృద్ధి పనులను పరిశీలించిన సైబరాబాద్ సీపీ







**సైబరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, మే 26 (పీపుల్స్ న్యూస్) :** గచ్చిబౌలి ఐఐఐటీ జంక్షన్ వద్ద కొనసాగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, పరిశీలించారు. ఐటీ కారిడార్ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు నిర్మిస్తున్న మల్టీ లెవల్ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్ పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎంసి ఇంజినీరింగ్ విభాగం అధికారులు, సైబరాబాద్ ట్రాఫిక్ విభాగ అధికారులు నిర్మాణ పనులు జరుగుతున్న తీరును సీపీ కు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంక్షన్ పరిసర ప్రాంతాల్లో ప్రస్తుత ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించిన సీపీ, నిర్మాణ కాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేయాలని సూచించారు. ప్రత్యామ్నాయ రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వాహనాల రాకపోకలు సాఫీగా సాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే ముఖ్య ప్రాంతాల్లో సరైన సూచిక బోర్డులు, బ్యారికేడ్లు, లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ సిబ్బందిని అవసరమైన ప్రాంతాలులో నియమించాలని సూచించారు. ప్రాజెక్టు పనులు నిర్ణీత గడువులో పూర్తి అయ్యేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సీపీ పేర్కొన్నారు. ఈ సందర్భనలో సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిని రెడ్డి, ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంతరావు, సిఎంసి ఇంజినీరింగ్ విభాగ అధికారులు, ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బక్రీద్ పండుగను ప్రశాంతంగా, సామరస్య వాతావరణంలో జరుపుకోవాలి

**- సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్.**


**సైబరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, మే 26 (పీపుల్స్ న్యూస్) :** బక్రీద్ పండుగ సందర్భంగా పండుగను ప్రశాంతంగా, పరిశుభ్రంగా నిర్వహించేందుకు సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ ఆధ్వర్యంలో సీఎంసీ, రెవెన్యూ, వెటర్నరీ శాఖ అధికారులతో మంగళవారం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో సీనియర్ పోలీస్ అధికారులు, ఎస్‌హెచ్‌వోలు , సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా పరిశుభ్రత, ప్రజారోగ్యం, జంతు వ్యర్థాల సక్రమ నిర్వహణపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈద్‌గాహ్‌లు, మసీదులు , నివాస ప్రాంతాల వద్ద జంతు వ్యర్థాల సేకరణ కోసం మందమైన నల్ల పాలిథిన్ కవర్లు అందుబాటులో ఉంచడం, వ్యర్థాల తరలింపుకు తగిన వాహనాలను ఏర్పాటు చేయడం వంటి అంశాలపై అధికారులు చర్చించారు. అలాగే రోడ్లు, ప్రజా ప్రదేశాల శుభ్రత కోసం తగినన్ని వాటర్ ట్యాంకర్లు, పారిశుధ్య సిబ్బందిని నియమించడం, అవసరమైన చోట్ల బ్లీచింగ్ పౌడర్ వినియోగించడం ద్వారా దుర్వాసన నివారణతో పాటు పరిశుభ్రతను కాపాడాలని సూచించారు. సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ బక్రీద్ పండుగను ప్రజలందరూ ప్రశాంతంగా, సామరస్య వాతావరణంలో జరుపుకోవాలని అన్నారు. పండుగ సందర్భంగా పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఈద్‌గాహ్‌లు, మసీదులు, నివాస ప్రాంతాల వద్ద జంతు వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా అధికారులు సూచించిన విధంగా పాలిథిన్ కవర్లలో సేకరించాలని తెలిపారు. వ్యర్థాల తొలగింపు, రోడ్ల శుభ్రత, పారిశుధ్య నిర్వహణ కోసం సీఎంసీ, రెవెన్యూ, వెటర్నరీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పండుగ సమయంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుధ్య సిబ్బంది, వాటర్ ట్యాంకర్లు, వ్యర్థాల తరలింపు వాహనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. అవసరమైన చోట్ల బ్లీచింగ్ పౌడర్ వినియోగించి పరిశుభ్రతను కాపాడాలని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించి సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించాలని ఆదేశించారు. ప్రజలు కూడా పోలీసులకు, సంబంధిత శాఖల అధికారులకు సహకరించి పరిశుభ్రత, ప్రజారోగ్యం, సామరస్య వాతావరణాన్ని కాపాడాలని సీపీ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశం లో ఎస్ బి డీసీపీ సుధీంద్ర, క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి, సైబర్ క్రైమ్స్ డీసీపీ సాయి మనోహర్, సీ ఏ ఆర్ హెడ్ క్వార్టర్ డీసీపీ సంజీవ్ ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్

**- మూడు ఆటోలు, తొమ్మిది బ్యాటరీలు స్వాధీనం.**




**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో మే 26 (పీపుల్స్ న్యూస్) :** వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, పహాడీషరీఫ్ పోలీసులు అరెస్ట్ చేసి రూ.7 లక్షల విలువ గల మూడు ఆటోలు, తొమ్మిది బ్యాటరీలు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ సిటీ కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె. శ్రీనివాసరావు వివరాలను వెల్లడించారు. బహదూర్‌పురా చింతల్‌మెట్ కు చెందిన మహమ్మద్ అక్బర్ (35), కిషన్‌బాగ్ కు చెందిన ఫైజుల్లా ఖాన్ అలియాస్ ఫైజ్ (42), హైదరాబాద్ జిర్రా కు చెందిన మహమ్మద్ హమీదుద్దీన్ అలియాస్ ఇమ్రాన్ (27), (ప్రస్తుతం పరారీలో ఉన్నాడు) నిందితులందరూ హైదరాబాద్‌కు చెందిన పాత నేరస్థులు, స్నేహితులు. సుమారు 6 నెలల క్రితం నిందితులు మహమ్మద్ అక్బర్, మహమ్మద్ హమీదుద్దీన్ అలియాస్ ఇమ్రాన్‌లు ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో బ్యాటరీల దొంగతనం కేసులో అరెస్ట్ అయి చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు వెళ్లారు. అక్కడ వారికి పాత నేరస్థుడైన ఫైజుల్లా ఖాన్ అలియాస్ ఫైజ్‌తో పరిచయం ఏర్పడింది. వీరంతా జైలు నుండి విడుదలైన తర్వాత పెద్ద ఎత్తున దొంగతనాలు చేసి సులభంగా డబ్బు సంపాదించాలని పథకం వేశారు. ఐదు నెలల క్రితం జైలు నుండి విడుదలైన వీరు, తమ ప్లాన్ ప్రకారం జడ్చర్ల, మహబూబ్ నగర్ టౌన్, రూరల్ పరిధిలో మూడు ఆటోలను దొంగిలించారు. ఆ దొంగతనపు ఆటోల్లో హైదరాబాద్ , పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ.. రాత్రి వేళల్లో పార్కింగ్ స్థలాలలో నిలిపి ఉంచిన డీసీఎంలు, ట్రాక్టర్ల బ్యాటరీలను దొంగిలించడం ప్రారంభించారు. మేడ్చల్, తుక్కుగూడ, మహేశ్వరం ప్రాంతాలలో వరుసగా ఈ తరహా దొంగతనాలకు పాల్పడ్డారు. నమ్మదగిన సమాచారం మేరకు శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ బృందం, పహాడీషరీఫ్ పోలీసులతో కలిసి సంయుక్తంగా దాడి చేసి నిందితులు మహమ్మద్ అక్బర్, ఫైజుల్లా ఖాన్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి చోరీ చేసిన రూ. 7 లక్షల విలువ గల బజాజ్ కంపెనీకి చెందిన 03 ప్యాసింజర్ ఆటో రిక్షాలు, ట్రాక్టర్లు, డీసీఎం , వాహనాలకు చెందిన 09 బ్యాటరీలను రికవరీ చేశారు. పరారీలో ఉన్న మరో నిందితుడు మహమ్మద్ హమీదుద్దీన్ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. నిందితులలో అక్బర్‌పై గతంలో 3 కేసులు, ఫైజుల్లా ఖాన్‌పై గతంలో 15 ఆస్తి నష్టం (దొంగతనం) కేసులు ఉన్నట్లు విచారణలో తేలింది. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె. వెంకట్ రెడ్డి, పహాడీషరీఫ్ డీఐ దెబోరా, ఎస్ఐలు కె. నాగరాజు, ఎస్. శేషు మరియు శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

# కాల్చేసే ఎండ, వడగాలులు - రాష్ట్రమంతటా రెడ్, ఆరెంజ్ అలర్ట్



**హైదరాబాద్:** వేసవి రాకతో సూర్యుడు మండుటెండలతో తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఒకవైపు తీవ్రమైన ఎండలు, మరోవైపు వడగాలుల మధ్య నలిగిపోతూ ప్రజలు ప్రతిరోజూ బాధపడుతున్నారు. బయటకు వెళ్లటానికి కూడా భయపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు సైతం ఈ వేడిని తట్టుకోలేక ఇబ్బంది పడుతుంటే, పట్టణవాసుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ : తెలంగాణపై ప్రచండ భానుడు ఉగ్రరూపం ప్రదర్శిస్తున్నాడు. ఒక వైపు తీవ్రమైన ఎండ మరోవైపు అతి తీవ్రమైన వడగాల్పులు, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలపై ఎండల తీవ్రత అధికంగా ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఇవాళ ఎండ తీవ్రత అధికంగా ఉండే ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మంతో పాటు నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబ్‌బాద్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. మిగితా అన్ని జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసింది. రేపు ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మంతో పాటు నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేయగా మిగితా అన్ని జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసింది వాతావరణశాఖ. ఎల్లుండి ఉమ్మడి ఖమ్మంతో పాటు కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్, మహబూబ్ బాద్, సూర్యపేట, నల్గొండ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. మిగితా అన్ని జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను వాతావరణ శాఖ జారీ చేసింది. మూడు రోజుల తరువాత గరిష్ఠ ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఇవాళ, రేపు అతి తీవ్రమైన ఎల్లుండి తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశం ఉన్నట్లు ప్రకటించింది. ఇవాళ అతి తీవ్రమైన వడగాల్పులు కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో వీచే అవకాశం ఉన్నందున, ఈ జిల్లాలకు రెడ్ అలర్ట్‌గా ప్రకటించారు. తీవ్రమైన వడగాల్పులు వీచే కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, మహబూబ్ బాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసింది. గంటకు 50 నుంచి 60 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు : రేపు అతి తీవ్రమైన వడగాల్పులు పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో వీచే అవకాశం ఉన్నందున రెడ్ అలర్ట్, తీవ్ర వడగాల్పులు వీచే ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసింది. క్యూములోనింబస్ మేఘాల ప్రభావంతో ఇవాళ మధ్య, దక్షిణ తెలంగాణ జిల్లాలతో పాటు కొన్ని పశ్చిమ, ఈశాన్య తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు మెరుపులు ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. గంటకు 50 నుంచి 60 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది.

# రూ.1.1 లక్షల కోట్ల డిపాజిట్లు! - క్లెయిమ్ చేసుకునే వారు లేక బ్యాంకుల్లో మూలుగుతున్న నగదు



**హైదరాబాద్:** దేశంలో ఎవరూ పట్టించుకోకుండా మిగిలిపోతున్న ఆర్థిక ఆస్తులు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం సమర్పించిన తాజా గణాంకాల ప్రకారం 2025-26 ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి క్లెయిమ్ చేయని ఆస్తుల విలువ ఏకంగా రూ.1.1 లక్షల కోట్లకు చేరిందంటే నిధుల విషయాన్ని అర్థం చేసుకోవచ్చు. పలు బ్యాంకులు, బీమా సంస్థలు, ఈక్విటీ మార్కెట్లలో యజమానుల జాడలేక ఈ నిధులు అంతకంతకూ పేరుకుపోతున్నాయి. కేంద్ర ప్రభుత్వం 'మీ డబ్బు-మీ హక్కు'వంటి ఎన్నో అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేసినా, క్లెయిమ్?లు మాత్రం ఆశించినంత స్థాయిలో పెరగడం లేదు. ఎక్కడ ఎంతెంత సొమ్ము పేరుకుపోయింది : అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లలో మొత్తం రూ.1.1 లక్షల కోట్లు ఉంటే అందులో అత్యధికంగా రూ.83 వేల కోట్లు వివిధ బ్యాంకుల్లో డిపాజిట్ల రూపంలో ఉన్నాయి. వీటితో పాటు రూ.10,000 కోట్లు ఈక్విటీ పెట్టుబడులు, మరో రూ.14,000 కోట్లు లైఫ్? ఇన్సూరెన్స్ పాలసీల రూపంలో క్లెయిమ్? చేయకుండా ఉన్నాయి. ప్రస్తుతం డిపాజిట్లు వివిధ నియంత్రణ సంస్థల ఆధీనంలో ఉన్నాయి. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా తన పరిధిలోని నిధులను డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్‌లో ఉంచగా, మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ, ఈక్విటీ నిధులను ఇన్వెస్టర్ ప్రొటెక్షన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్ (ఐపీఈఎఫ్)లో పెట్టింది. అసలు సమస్య ఎక్కడ? : ఈ సమస్య ప్రధానంగా 'నో యువర్ కస్టమర్' గురించి తెలుసుకోండి' (కేవైసీ) ప్రక్రియను డిజిటల్‌గా కాకుండా, పత్రాల రూపంలో నిర్వహించిన పాత అకౌంట్లకు సంబంధించింది. పాన్, ఆధార్‌కార్డుల అనుసంధానానికి ముందు, ఖాతాలను చేతిరాతతో ఎంటర్ చేశారు. కొన్ని పేర్లలో అక్షర దోషాలు, తాత్కాలిక అడ్రస్?లు మాత్రమే ఉన్నాయి. ఇప్పుడు లబ్ధిదారులు ఆ నిధులను విత్?డ్రా చేసుకోవడానికి డిజిటల్ కేవైసీని అనుసంధానించాలని చూసినప్పుడు, పాత రికార్డులకు ప్రస్తుత వివరాలకు మధ్య ఉన్న అంతరాలు ప్రస్తుతం సవాల్‌గా మారుతున్నాయి. పాత అకౌంట్లో నామినీ వివరాలు లేకపోవడం వల్ల, యజమాని మరణించాక వారసులు ఆఫీస్?ల చుట్టూ తిరగాల్సి వస్తోంది. నిరూపణ సవాలుగా : ఇది కేవలం నిలిచిపోయిన అకౌంట్ల సమస్య ఒక్కటే కాదు. ఇది అర్హత నిరూపణ సమస్యగా మారుతోందని బ్యాంకింగ్ రంగంలోని నిపుణులు పేర్కొంటున్నారు. వారసులకు హక్కు ఉన్నప్పటికీ, గుర్తింపు కొనసాగింపును, అర్హతను నిరూపించుకునేందుకు రకరకాల అఫిడవిట్లు, ఇండెమ్నిటీ పేపర్లు సమర్పించడం వారికి పెను భారంగా మారుతోంది. ముఖ్యంగా అసలైన ఖాతాదారులే ఉన్నా, వయసు పైబడటం వల్ల సంతకాలు మారడం, వేలిముద్రలు సరిగా పడకపోవడం, మతిమరుపు, నరాల సంబంధిత వ్యాధులు ఈ సమస్యను మరింత జఠిలం చేస్తున్నాయి. వాస్తవ ఖాతాదారులు మరణిస్తే, వారి వారసులకు ఆయా గురించి ఏ మాత్రం తెలియడం లేదని బ్యాంకు సిబ్బంది చెబుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నా లేని ఆశించిన ఫలితం : ప్రభుత్వం పాలసీలను సరళతరం చేస్తూ డిపాజిట్ క్లెయిమ్?లను ప్రోత్సహించేందుకు ఉద్గమ్ వంటి ప్రత్యేక డిజిటల్ ప్లాట్?ఫాంలను అందుబాటులోకి తెచ్చింది. గతేడాది ఆర్‌బీఐ, సెబీ సంయుక్తంగా చేపట్టిన 'మీ డబ్బు-మీ హక్కు' పేరిట దేశ వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాయి. దీనిద్వారా సుమారు రూ.5,777 కోట్ల విలువైన ఆస్తులను లబ్ధిదారులకు తిరిగి ఇచ్చేశారు, క్లెయిమ్? చేయని నిధులను వెలికితీయడం ప్రస్తుతం ఇంకా పెద్ద సవాలుగా మారింది.

# 'ఇండో-పసిఫిక్ భద్రత కోసం కలిసి పనిచేద్దాం'- క్వాడ్ కూటమికి జైశంకర్ పిలుపు



**న్యూ ఢిల్లీ :** భారత్, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్ దేశాల కూటమి అయిన క్వాడ్ () విదేశాంగ మంత్రుల సమావేశం మంగళవారం దిల్లీలో జరిగింది. ఈ సమావేశానికి భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ నేతృత్వం వహించగా, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి పెన్నీ వాంగ్, జపాన్ విదేశాంగ మంత్రి తోషిమిట్సు మొతేగి పాల్గొన్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భద్రత, ఆర్థిక సహకారం, సరఫరా వ్యవస్థల బలోపేతం, కీలక మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలపై ప్రధానంగా చర్చ జరిగింది.సమావేశ ప్రారంభంలో మాట్లాడిన జైశంకర్, ఇండో-పసిఫిక్ ప్రాంతం ప్రపంచ వృద్ధికి, స్థిరత్వానికి ప్రధాన చోదకశక్తిగా కొనసాగాలని ఆకాంక్షిం చారు. సముద్ర భద్రత, ఆర్థిక స్వావలంబన, వ్యూహాత్మక నమ్మకాన్ని పెంపొందించడంలో క్వాడ్ దేశాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సరఫరా వ్యవస్థల్లో స్థిరత్వం, కనెక్టివిటీ అవరోధాలు, తయారీ రంగంలో కేంద్రీకరణ, కీలక మౌలిక సదుపాయాల లోపా లను పరిష్కరించడానికి భాగస్వామ్య దేశాలు మరింత లోతైన సహకారం పెంచుకోవాలని పిలుపునిచ్చారు."ప్రపంచ స్థాయిలో సరఫరా వ్యవస్థల బలోపేతం, కనెక్టివిటీ సమస్యలు, వనరుల కేంద్రీకరణ, మౌలిక సదుపాయాల్లో లోపాల వంటి సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంది. ఈ అంశాలన్నీ కొత్త భాగస్వామ్యా లకు దారి తీస్తాయి" అని జైశంకర్ పేర్కొన్నారు. విశ్వ సనీయ, పారదర్శక భాగస్వా మ్యాల ద్వారానే ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, అభివృద్ధి సాధ్యమ వుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. క్వాడ్ దేశాలు సముద్ర ప్రజాస్వామ్యాలు, బహుళత్వ సమాజాలు, మార్కెట్ ఆర్థిక వ్యవస్థలుగా ఒకే విధమైన బాధ్యతను పంచుకుంటున్నాయని జైశంకర్ అన్నారు. స్వేచ్ఛాయుత, అందరికీ అందుబాటులో ఉండే ఇండో-పసిఫిక్ కోసం కలిసి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గత కొన్ని నెలలుగా సముద్ర భద్రత, కీలక సాంకేతికతలు, ఆర్థిక స్థిరత్వం, విపత్తు సహాయక చర్యల వంటి రంగాల్లో క్వాడ్ దేశాల మధ్య సహకారం మరింత ముందుకు సాగింద న్నారు. కార్యాచరణ దిశగా అడుగులు వేస్తున్న వ్యూహాత్మక భాగస్వామ్యంగా! అమెరికా విదేశా ంగ మంత్రి మార్కో రూబియో మాట్లాడుతూ, క్వాడ్ ఇప్పుడు కేవలం చర్చల వేదికగానే కాకుం డా కార్యాచరణ దిశగా అడుగులు వేస్తున్న వ్యూహాత్మక భాగస్వామ్యంగా మారుతోం దన్నారు. ఇంధన భద్రత, సరఫరా వ్యవస్థలు, కీలక ఖనిజాలు, సముద్ర రవాణా స్వేచ్ఛ వంటి అంశాల్లో క్వాడ్ పాత్ర మరింత కీలకమవు తోందని తెలిపారు. ఇటీవల ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకున్న పరిణామా లు క్వాడ్ ప్రాధాన్యాన్ని మరింత పెంచాయని పేర్కొన్నారు. తాను అమెరికా విదేశాంగ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే పాల్గొన్న తొలి సమావేశం క్వాడ్‌దేనని రూబియో గుర్తుచేశారు. అది ఈ కూటమిపట్ల అమెరికా నిబద్ధతను స్పష్టం చేసిందన్నారు. దిల్లీలో నిర్వహించిన ఈ సమావే శానికి భారత్ ఆతిథ్యం ఇవ్వడాన్ని ఆయన అభినందించారు. ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి పెన్నీ వాంగ్ మాట్లాడుతూ, ఇండో- పసిఫిక్ ప్రాంతంలో దేశాల సార్వభౌమ నిర్ణయాధి కారాన్ని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. స్వేచ్ఛాయుత, స్థిరమైన, సంపన్నమైన ఇండో-పసిఫిక్ కోసం క్వాడ్ దేశాలు కలిసి పనిచేస్తాయని తెలిపారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ ఈ ప్రాంత రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తోందని ప్రశంసించారు. జపాన్ విదేశాంగ మంత్రి తోషిమిట్సు మొతేగి మాట్లాడుతూ, స్వేచ్ఛాయుత ఇండో-పసిఫిక్ లక్ష్య సాధనలో క్వాడ్ ఒక ముఖ్య వేదికగా నిలుస్తోందన్నారు. ఇండో-పసిఫిక్ దేశాలు ఆర్థిక భద్రత, వ్యూహాత్మక సామర్థ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసర ం ఉందన్నారు. క్వాడ్ దేశాల మధ్య సహకాం ాన్ని మరింత వేగవంతం చేయడంపై ఈ సమావేశంలో స్పష్టమైన చర్చలు జరగాలని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సమావేశం గత ఏడాది జూలైలో వాషింగ్టన్‌లో జరిగిన క్వాడ్ సమావేశానికి కొనసాగింపుగా భావిస్తున్నారు. సముద్ర భద్రత, కీలక సాంకేతికతలు, వాతావరణ మార్పుల ప్రభావం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రాంతీయ భద్రతా సవాళ్లపై చర్చలు కొనసాగుతున్నాయి. ఇటీవల ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనా దూకుడు, సముద్ర సరిహద్దుల వివాదాలు, వాణిజ్య ఒత్తిళు పెరుగుతున్న నేపథ్యంలో క్వాడ్ సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రాంతీయ స్థిరత్వం, సరఫరా వ్యవస్థల భద్రత, స్వేచ్ఛాయుత సముద్ర రవాణాపై క్వాడ్ దేశాలు మరింత దృష్టి సారిస్తున్నాయి.

# నాయకత్వ మార్పుపై అధిష్ఠానం సమన్లు.. ఢిల్లీలో సిద్ధరామయ్య, డీకే శివకుమార్



**న్యూఢిల్లీ:** కర్ణాటకలో నాయకత్వ మార్పు అవకాశాలపై ఊహాగానాల నేపథ్యంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య , ఆయన డిప్యూటీ డీకే శివకుమార్ ఢిల్లీ చేరుకున్నారు. పార్టీ అధిష్ఠానం సైతం నాయ కత్వ మార్పుపై ఇంతవరకూ పెదవి విప్పనప్పటికీ దీనిపై చర్చించేందుకు సీనియర్ నేతలిద్దరినీ ఢిల్లీకి రావాల్సిందిగా పిలిచింది. ఈ అంశాన్ని పరిష్కరించి, పార్టీలో ఇరు వర్గాల మధ్య అంతర్గాత పోరుకు తెరదించాలని అధిష్ఠానం భావిస్తున్నట్టు పార్టీ వర్గాల సమాచారం.అధిష్ఠానం పిలుపు మేరకు ఇందిరా భవన్ ప్రధాన కార్యాలయానికి నేతలిద్దరూ మంగళవారంనాడు చేరుకున్నారు. అయితే కార్యాలయం వెలుపల మీడియా ముందు చర్చల అంశంపై నాయకులిరువురూ పెదవి విప్పలేదు. నాయకత్వ మార్పు అవకాశాలపై సిద్ధరామయ్యను అడిగినప్పుడు 'ఆ మాట ఎప్పుడూ వినిపిస్తూనే ఉంది కదా' అంటూ సమాధానం దాటవేశారు. కొద్దికాలంలో కర్ణాటక రాజకీయాల్లో తలెత్తిన ప్రతిష్టంభనకు తెరదించే ందుకు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, పార్టీ ప్రతినిధి రణ్‌దీప్ సూర్జేవాలా ఇందిరా భవన్‌కు చేరుకున్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు సన్నిహితులుగా పేరున్న సతీష్ జార్కిహోలి, జి.పరమేశ్వర, హెచ్‌సీ మహదేవప్ప సహా పలువురు మంత్రులు హస్తినకు చేరుకోవడంతో నాయకత్వ మార్పు అంశం మరోసారి ఊపందుకుంది.కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం మే 20వ తేదీతో మూడేళ్ల పాలన పూర్తి చేసుకోవడంతో నాయకత్వ మార్పు అంశం మరోసారి తెరపైకి వచ్చింది. పార్టీ నాయకత్వం ఢిల్లీకి తనను ఆహ్వానించిందని, అయితే ఎజెండా తెలియదని సిద్ధరామయ్య మీడియాతో మాట్లాడుతూ సోమవారంనాడు ధ్రువీకరించారు. 'మంగళవారం మధ్యాహ్నం 11 గంటలకు సమావేశం ఉంది. సబ్జెక్ట్ ఏమిటనేది తెలియదు. కేసీ వేణుగోపాల్ ఫోను చేసి తేదీ, సమయం చెప్పారు' అని వెల్లడించారు. తనను పిలిస్తే ఢిల్లీ వెళ్తానని తొలుత చెప్పిన డీకే శివకుమార్ సైతం ఆ తర్వాత ఢిల్లీకి వెళ్తున్నట్టు ధ్రువీకరించారు. నాయకత్వ మార్పుపై అడిగినప్పుడు 'దాని గురించి తెలియదు, దానిపై వ్యాఖ్యానించలేను. అది నాపని కాదు' అని ముక్తసరిగా సమాధానం ఇచ్చారు.కాంగ్రెస్ 2023లో కర్ణాటకలో అధికారం చేపట్టినప్పటి నుంచి శివకుమార్‌కు పదోన్నతిపై పలుమార్లు ఆయన వర్గం నేతలు డిమాండ్ చేస్తూ వచ్చారు. అధికారం పంపకాలపై ముఖ్యమంత్రి ఎన్నికకు ముందే ఒక అవగాహన ఉందని నేతలు చెబుతున్నారు. అయితే సిద్ధరామయ్య ఆ వాదనలను తోసిపుచ్చారు.

# స్కూళ్లు, ఆలయాల సమీపంలో మద్యం దుకాణలపై నిషేధం.. సువేందు అధికారి



**కోల్‌కతా:** పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి మంగళవారంనాడు పలు సంక్షేమ, నియంత్రణ చర్యలను ప్రకటించారు. విద్యాసంస్థలు, ఆలయాలకు ఒక కిలోమీటర్ దూరంలోపు మద్యం దుకాణాలపై నిషేధం విధించారు. మహిళలకు ప్రతినెలా ఆర్థిక సాయం, రాష్ట్రవ్యాప్తంగా సబ్సిడీపై చేపలతో కూడిన భోజన సదుపాయాన్ని కల్పిస్తున్నట్టు ప్రకటించారు.రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను సువేందు అధికారి వివరిస్తూ, స్కూళ్లు, కాలేజీలు, ఆలయాలకు కిలోమీటరు దూరంలోపు మద్యం దుకాణాలను అనుమతించమని చెప్పారు. అన్నపూర్ణ యోజన కింద అర్హులైన మహిళలకు రూ.3,000 ఆర్థికసాయం అందించనున్నామని, మే 27 నుంచి అప్లికేషన్లను సెక్రటేరియట్ నుంచి జారీ చేస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది మహిళలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని అంచనా వేస్తున్నారురూ.5కే చేపల కూరతో భోజనంరాష్ట్రవ్యాప్తంగా సబ్సిడీతో క్యాంటిన్లు ఏర్పాటు చేయనున్నామని, రూ.5కే చేపలతో కూడిన భోజనం అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు. ఇందుకోసం 400 క్యాంటిన్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఆరోగ్య శాఖ నుంచి వేరుచేస్తూ ప్రత్యేక ఆయుష్ శాఖను పశ్చిమబెంగాల్ ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. జిల్లాల్లో అభివృద్ధి పనుల పురోగతిపై కూడా ముఖ్యమంత్రి మంగళవారంనాడు అధికారులతో సమీక్షా సమావేశం జరిపారు.

# సంపన్న మిత్రుల కోసం మోదీ ప్రజలను దోచుకుంటున్నారు- సీఎన్‌జీ ధరల పెంపుపై కాంగ్రెస్ ఫైర్

**న్యూ ఢిల్లీ :** దేశ రాజధాని దిల్లీలో సీఎన్‌జీ ధరలను కేంద్రం మరోసారి పెంచడంపై కాంగ్రెస్ మండిపడింది. కేంద్రాన్ని తీవ్రంగా విమర్శించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన సంపన్న స్నేహితులకు ప్రజలను నుంచి దోచిపెడుతున్నారని ఆరోపణలు గుప్పించింది. గత 12 రోజుల్లోనే నాలుగు సార్లు సీఎన్‌జీ ధరలు పెంచారని పేర్కొంటూ ప్రధాని మోదీ 'ఇన్‌ఫ్లేషన్ మ్యాన్' అంటూ వ్యగ్యాస్త్రాలు సంధించింది.15 రోజుల్లో నాలుగసారిదిల్లీలో సీఎన్‌జీ ధరలను మంగళవారం కిలోకు రూ.2 కేంద్ర ప్రభుతం పెంచింది. తాజా పెంపుతో దేశ రాజధానిలో సీఎన్‌జీ ధర రూ.83.09కి చేరింది. గత 15 రోజుల వ్యవధిలో కేంద్ర ప్రభుత్వం నాలుగోసారి ధరలను పెంచింది. మే 15, 26 తేదీల్లో రూ.2 చొప్పున, మే 18, 23 తేదీల్లో రూ.1 చొప్పున ధరలు పెరిగినట్లు కాంగ్రెస్ విమర్శించింది. సీఎన్?జీ ధరల పెంపుపై కాంగ్రెస్ పార్టీ సోషల్? మీడియా వేదిక ఎక్స్‌లో స్పందించింది. "ఇన్‌ఫ్లేషన్ మ్యాన్ మోదీ ప్రజలపై కొరడా ఝులిపించారు. సీఎన్‌జీని మళ్లీ రూ.2 పెంచారు. కేవలం 12 రోజుల్లోనే రూ.6 పెరిగింది" అంటూ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు ఎక్కు పెట్టింది.సామాన్య ప్రయాణికులపై ప్రభావందిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో అత్యధిక సంఖ్యలో క్యాబ్‌లు, ఆటోలు, టాక్సీలు, పబ్లిక్ రవాణా వాహనాలు సీఎన్‌జీపైనే నడుస్తుంటాయి. వరుసగా ధరలు పెరుగుతుండటం వల్ల రవాణా ఖర్చులు పెరిగి, ఆ ప్రభావం సామాన్య ప్రయాణీకులపై పడే అవకాశం ఎక్కువగా ఉంది. ప్రత్యామ్నాయ ఇంధనంగా భావించే సీఎన్‌జీ ధరలు కూడా ఇలా రికార్డు స్థాయికి చేరుతుండటం పట్ల వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతానికి ఈ ఇబ్బంది కేవలం దిల్లీ వాహనదారులకు మాత్రమే. అయితే, అంతర్జాతీయంగా ముడి చమురు, సహజ వాయువు



ధరల పెరుగుదల ఇలాగే కొనసాగితే, రాబోయే రోజుల్లో ఇతర రాష్ట్రాల్లో కూడా ఇంధన కంపెనీలు ధరలను పెంచే అవకాశం ఉంది. ఇదే సమయంలో పెట్రోల్, డీజిల్ ధరలు కూడా వరుసగా పెరుగుతుండటంతో రవాణా, లాజిస్టిక్స్ ఖర్చులు మరింత అధికమయ్యే పరిస్థితి నెలకొంది. విమర్శలను ఖండిం చిన కేంద్రంసీఎన్‌జీ ధరల పెంపుపై వస్తున్న విమర్శలను కేంద్ర ప్రభుత్వం ఖండించింది. పశ్చిమా సియా ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడిచము రు ధరలు పెరగడంతో వినియోగదారులపై భారం తగ్గించేందుకు మార్చి 27న పెట్రోల్, డీజిల్‌పై కేంద్ర ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ.10 చొప్పున తగ్గించినట్లు పెట్రోలియం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ తెలిపారు. ఈ నిర్ణయం వల్ల కేంద్రానికి సుమారు రూ.14 వేల కోట్ల పన్ను ఆదాయం తగ్గిందని పేర్కొన్నారు.గత 12 ఏళ్లలో ఆర్థిక విధ్వంసం : మనీశ్ తివారీకాంగ్రెస్ ఎంపీ మనీశ్? తివారీ కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలను తప్పుపడుతూ, బీజేపీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటోందని ఆరోపించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్? ఇటీవల ప్రస్తావించిన ఇంధనం, ఎరువులు, ఫారిన్ ఎక్స్ఛేంజ్ సంక్షోభాలపై స్పందించిన తివారీ గత 12 ఏళ్లలో జరిగిన ఆర్థిక విధ్వంసమే దీనికి కారణమని పేర్కొన్నా రు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన విమర్శ లు చేశారు. దేశంలో ఇంధన దిగుమతులపై ఆధారపడటం పెరిగిందని తివారీ పేర్కొన్నారు. ప్రస్తుతం దేశ అవసరాల్లో 88 శాతం ముడి చమురును దిగుమతి చేసుకుంటున్నామని తెలిపారు. దిల్లీలో లీటరు పెట్రోల్ ధర రూ.102.12కి చేరడమే ఇందుకు నిదర్శనమన్నారు. అలాగే ఎరువుల దిగుమతుల ఖర్చు 2025-26 ఆర్థిక సంవత్సరానికి 18 బిలియన్ డాలర్లకు చేరిందని, 2013-14లో ఇది కేవలం 6.58 బిలియన్ డాలర్లే అని పేర్కొన్నారు. విదేశీ మారకపు విలువ విషయంలో కూడా రూపాయి బలహీనపడిందని, 2014 మే 16న ఒక డాలర్ విలువ రూ.58.50 ఉండగా ప్రస్తుతం అది రూ.95.32కు చేరిందని వివరించారు.

# భారత్, అమెరికా మధ్య ల్యాండ్‌మార్క్ డీల్



**న్యూ ఢిల్లీ :** వ్యూహాత్మక ఖనిజాలు, అరుదైన లోహాల మైనింగ్, ప్రాసెసింగ్, వాటి సురక్షిత సరఫరాలే లక్ష్యంగా భారత్-అమెరికాలు మంగళవారం చారిత్రాత్మక ద్వైపాక్షిక ఒప్పందంపై సంతకాలు చేశాయి. అంతర్జాతీయంగా తీవ్రమైన పోటీ నెలకొన్న ప్రస్తుత తరుణంలో ఈ ఒప్పందానికి అత్యంత వ్యూహాత్మక ప్రాధాన్యత ఉందని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య జరిగిన ద్వైపాక్షిక చర్చలు, అలాగే క్వాడ్ విదేశాంగ మంత్రుల సమావేశం అనంతరం ఆయన ఈ మైలురాయి లాంటి ఒప్పందాన్ని అధికారికంగా ప్రకటించారు.


ఒప్పందంపై సంతకాలు చేసిన అనంతరం విదేశాంగ మంత్రి జైశంకర్ మాట్లాడుతూ, "వ్యూహాత్మక ఖనిజాలు (క్రిటికల్ మినరల్స్), అరుదైన లోహాలు (రేర్ ఎర్త్ ఎలిమెంట్స్) మైనింగ్, ప్రాసెసింగ్, వాటి సరఫరాలను సురక్షితం చేసేందుకుగాను ఈ రోజు భారత్-అమెరికా ద్వైపాక్షిక ఫ్రేమ్‌వర్క్‌పై సంతకాలు చేస్తున్నాము" అని ప్రకటించారు. క్వాడ్ సమావేశంలోనూ ఈ అంశంపై చర్చించామని ఆయన గుర్తు చేశారు. ఈ అరుదైన వనరులను సురక్షితం చేసుకోవడం అనేది అత్యంత కీలకమైన విషయమని అన్నారు. ఇది ద్వైపాక్షికంగా అయినా, క్వాడ్ వేదిక ద్వారా అయినా లేదా ఒకే రకమైన ఆలోచనలు గల దేశాల విస్తృత కూటమి ద్వారా అయినా సరే, వీటిని సురక్షితం చేయడం అత్యంత ఆవశ్యక మని ఆయన నొక్కి చెప్పారు. అంతేకాదు, ఇరుదేశాల మధ్య కుదిరిన ఈ ఒప్పందం కేవలం మైనింగ్?, ప్రాసెసింగ్ లకే పరిమితం కాకుండా, రీసైక్లింగ్ కు కూడా విస్తరిస్తామని జైశంకర్ వెల్లడించారు. వీటిపై ఇరుదేశాలు పెట్టుబడులను కూడా పెంచుతాయని స్పష్టం చేశారు. "ఈ ఒప్పందం ఒక స్థిరమైన, వైవిధ్యభ రితమైన సప్లై చైన్‌లను బలోపేతం చేస్తుంది. అంతేకాదు ఫైనాన్సింగ్ (ఆర్థిక సాయం), వ్యూహాత్మక ఖనిజాలు, అత్యంత అరుదైన లోహాల విషయంలో పరస్పరం సహకరించుకో వడానికి మాకు సహాయపడుతుంది" అని జైశంకర్ పేర్కొన్నారు. దిల్లీ-వాషింగ్టన్ మధ్య క్రమంగా బలపడుతున్న భాగస్వామ్యానికి ఈ ఒప్పందమే ఒక నిదర్శనమని జైశంకర్ అన్నారు. "ప్రస్తుత ప్రపంచంలో ఎన్నో సవాళ్లు, మరెన్నో అవకాశాలు ఉన్నాయి. ఇలాంటి తరుణంగా మన మధ్య సహకారం ఎంత బలంగా ఉందో చాటిచెప్పడానికి ఇదొక స్పష్టమైన సంకేతం" అని పేర్కొన్నారు.ఇరుదేశాలకు లాభమే! అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మాట్లాడుతూ, యూఎస్?కు భారతదేశం ఎంతో కీలకమైన భాగస్వామి అని అన్నారు. ఈ ఒప్పందం ఇరుదేశాల బంధానికి ఒక ప్రత్యక్ష ఉదాహరణ అని పేర్కొన్నారు. "గడచిన కొద్ది రోజులుగా ఇక్కడ పర్యటిస్తున్న నేను అమెరికా-భారత్? వ్యూహాత్మక కూటమి గురించి, అది అమెరికా జాతీయ ప్రయోజనాలకు ఎంత ముఖ్యమైనదో నిరంతరం చెబుతూనే ఉన్నాను. ఈ రోజు కుదిరిన ఒప్పందమే దానికి ప్రత్యక్ష నిదర్శనం" అని అన్నారు. భారత్?, అమెరికాలు తమ ఆవిష్కరణల ఆర్థిక వ్యవస్థలకు (ఇన్నోవేషన్ ఎకానమీ) అవసరమైన వ్యూహాత్మక ఖనిజాలు, అత్యంత అరుదైన లోహాలను, వాటి సరఫరా గొలుసులను సురక్షితం చేయడం ద్వారా సమాన వ్యూహాత్మక ప్రయోజనాలు కలిగి ఉన్నాయని రూబియో నొక్కి చెప్పారు.

# అన్నాడీఎంకేలో ఆగని తిరుగుబాటు.. మరో ఎమ్మెల్యే రాజీనామా



**చెన్నై:** అన్నాడీఎంకేకు వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఆ పార్టీకి మరో ఎమ్మెల్యే మంగళవారంనాడు రాజీనామా చేశారు. ఇప్పటికే ముగ్గురు ఎమ్మెల్యేలు పార్టీకి రాజీనామా చేయగా, అంబసముద్ర ఎమ్మెల్యే డాక్టర్ ఎసాక్కీ సుబయా తాజాగా తన రాజీనామా పత్రాన్ని అసెంబ్లీ స్పీకర్ ప్రభాకర్‌కు సమర్పించారు. తొలుత నిబంధనలకు అనుగుణంగా లేదని ఆయన రాజీనామాను స్పీకర్ తోసిపుచ్చారు. దాంతో టైపింగ్ చేసిన లేఖకు బదులుగా లిఖిత పూర్వక రాజీనామా పత్రాన్ని స్పీకర్‌కు సుబయా సమర్పించడంతో స్పీకర్ అనుమతించారు. ముఖ్యమంత్రి విజయ్ టీవీకేలో సుబయా చేరే అవకాశం ఉందని తెలుస్తోంది.ఈనెల 13న అసెంబ్లీలో బలపరీక్ష సందర్భంగా మాజీ మంత్రులు సీవీ షణ్ముగం, ఎస్.పి.వేలుమణి సారథ్యంలోని పలువురు తిరుగుబాటు ఎమ్మెల్యేలు పార్టీ విప్‌ను ధిక్కరించి టీవీకే ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేశారు. వీరిలో సుబయా కూడా ఉన్నారు. ఇప్పటికే షణ్ముగం, వేలుమణి వర్గంలోని ముగ్గురు ఎమ్మెల్యేలు మరగతం కుమరవేల్, పి.సత్యభామ, ఎస్.జయకుమార్ అన్నాడీఎంకేకు రాజీనామా చేశారు. ఆ వెంటనే టీవీకే నేత, మంత్రి ఆధవ్ అర్జున్ సమక్షంలో ఆ పార్టీలో చేరిపోయారు. ఇది జరిగిన కొద్ది గంటలకే సుబయా సైతం అన్నాడీఎంకే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. ముందుగా రాజీనామా చేసిన ముగ్గురు అన్నాడీఎంకే ఎమ్మెల్యేలకు వారి నియోజకవర్గాల నుంచే టీవీకే టిక్కెట్ ఇచ్చే అవకాశాలున్నాయని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# అమెరికా డ్రోన్ ఎంక్యూ-9ను కూల్చేశాం



**ఇరాన్:** అమెరికా కు చెందిన ఎంక్యూ-9 రీపర్ డ్రోన్ ను కూల్చివేసినట్లు ఇరాన్ వెల్లడించింది. తమ గగనతలంలోకి ప్రవేశించిన అమెరికా ఆర్‌క్యూ-4 డ్రోన్, ఖీ-35 యుద్ధ విమానంపై కూడా కాల్పులు జరిపినట్లు తెలిపింది. టెహ్రాన్ లోని పలు ప్రాంతాలపై అమెరికా తీవ్రమైన దాడులు చేసిన నేపథ్యంలో ఈ తరహాలో తిప్పికొట్టినట్లు పేర్కొన్నది. అమెరికా చేసే ఏ కాల్పుల విరమణ ఉల్లంఘనకైనా ప్రతీకారం తీర్చుకునే చట్టబద్ధమైన హక్కు తమకు ఉందని ఐఆర్‌జీసీ వెల్లడించింది. ట్రంప్ సైనిక చర్యను తిరిగి ప్రారంభిస్తే.. పశ్చిమాసియా లోని అమెరికా స్థావరాలు, సైనిక బల గాలపై మరిన్ని ఆశ్చర్యకరమైన దాడులు చేస్తామని హెచ్చరించింది.ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ అమెరికాకు తీవ్ర హెచ్చరికలు చేశారు. శాంతి జరుగుతుండగా అమె రికా దాడులు చేయడాన్ని ఏ మాత్రం సహించబోమని అన్నారు. దీనికి ప్రతీకారం తీర్చుకుంటామని, ఇకపై పశ్చిమాసియాలో అమెరికా బేస్‌లకు ఎక్కడా సురక్షిత ప్రదేశం ఉండదని హెచ్చరించారు. అమెరికా, ఇజ్రాయెల్‌లను నాశనం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. .

# ట్రంప్ 'ఇజ్రాయెల్' షరతుకు పాకిస్తాన్ నో!




**ఇస్లామాబాద్/వాషింగ్టన్, మే 26:**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకొచ్చిన సరికొత్త దౌత్యపరమైన ఒత్తిడికి లొంగే ప్రసక్తే లేదని పాకిస్తాన్ తెగేసి చెప్పింది. ఇరాన్ దౌత్యపరమైన శాంతి ఒప్పందంలో భాగంగా.. పాకిస్తాన్ కూడా ఇజ్రాయెల్‌తో అధికారికంగా సంబంధాలను పునరుద్ధరించే 'అబ్రహం అకార్డ్స్' )పై సంతకం చేయాలంటూ ట్రంప్ విధించిన షరతును పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ పూర్తిగా తోసిపుచ్చారు. తమ దేశ మౌలిక సిద్ధాంతాలు, విదేశాంగ విధానంలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు.అసలు ఏం జరిగింది? (ట్రంప్ కొత్త షరతు):ఇరాన్ వివాదానికి ముగింపు పలికేందుకు దౌత్యపరమైన చర్చలు తుది దశకు చేరుకున్న తరుణంలో డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా ఒక అనూహ్యమైన ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. ఈ చర్చల్లో భాగస్వామ్య దేశాలుగా ఉన్న సౌదీ అరేబియా, ఖతార్, టర్కీలతో పాటు పాకిస్తాన్ కూడా 'అబ్రహం అకార్డ్స్' లో చేరడం తప్పనిసరి అని ట్రంప్ పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌ను గుర్తించి, ఆ దేశంతో దౌత్య సంబంధాలు పెట్టుకోవాలనేది ఈ ఒప్పంద ముఖ్య ఉద్దేశం.పాకిస్తాన్ ఎందుకు తిరస్కరించింది?ట్రంప్ ప్రతిపాదనపై పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ స్పందిస్తూ.. 'మా ప్రాథమిక సిద్ధాంతాలతో విభేదించే ఎలాంటి ఒప్పందంలోనూ పాకిస్తాన్ చేరదు. రోజుకో మాట మార్చే (ఇజ్రాయెల్) వాళ్లతో కలిసి కూర్చోవడం మాకు సాధ్యం కాదు' అని వ్యాఖ్యానించారు. కాగా, పాస్‌పోర్ట్ పాలసీ మేరకు పాకిస్తాన్ తన 78 ఏళ్ల చరిత్రలో ఇజ్రాయెల్‌ను ఎప్పుడూ గుర్తించలేదు. పాక్ పౌరులు ఇజ్రాయెల్ వెళ్లకుండా పాస్‌పోర్ట్‌పై ప్రత్యేకంగా నిబంధన కూడా ఉంది. ఈ నేపథ్యంలో 1967 పూర్వపు సరిహద్దుల ప్రకారం స్వతంత్ర పాలస్తీనా దేశం ఏర్పడేంతవరకూ ఇజ్రాయెల్‌ను గుర్తించే ప్రసక్తే లేదని పాక్ విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

# చాపకింద నీరులా ఎబోలా వ్యాప్తి !

ఎబోలా వణికిస్తోంది. కరోనా అంత వేగంగా కాకపోయినా మెల్లగా చాపకింద నీరులా విస్తరిస్తోంది. దీంతో ఇప్పుడు ప్రపంచ దేశాలకు కొత్త తలనొప్పి ప్రారంభం అయ్యింది. ఆఫ్రికా దేశాల నుంచి ఇతర దేశాలకు విస్తరించకుండా కట్టుదిట్టమైన చర్యలకు ఉపక్రమించారు. ఇప్పటికే ప్రపంచ దేశాలు అప్రమత్తం అయ్యాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా అన్ని దేశాలకు హెచ్చరికలు జారీచేసింది. కేవలం వారాల వ్యవధిలోనే మూడు దేశాలకు పాకిన ఎబోలా వందల మందికి సోకింది. భౌగోళికంగా కూడా ఈ వ్యాధి వ్యాపించిన ప్రదేశంలో కట్టడి చేయడం చాలా కష్టమని అంతర్జాతీయ ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మనుషులకు సోకే నాలుగు రకాల ఎబోలా వైరస్‌ల్లో బుండిబుగ్యో ఒకటి. దీనిని ఉగాండాలోని ఓ పర్వత ప్రాంతంలో తొలిసారి కనుగొన్నారు. గతంలో రెండుసార్లు మాత్రమే వ్యాపించడంతో అధికారులు పెద్దగా దృష్టిపెట్టలేదు. ఫలితంగా తాజాగా వ్యాపించిన ప్రదేశంలోని ల్యాబ్ పరీక్షల్లో దీనిని గుర్తించే సౌకర్యం లేకపోవడంతో.. గుర్తించేందుకు జాప్యం జరిగింది. మొదటి దీనిని గుర్తించేందుకు నమూనాను వేల మైళ్ల దూరంలో ఉన్న గవర్నమెంట్ రీసెర్చ్ ల్యాబ్‌కు పంపాల్సి వచ్చింది. ఈశాన్య కాంగోలోని యుద్ధ ప్రభావిత ప్రాంతమైన ఉగాండా సరిహద్దుల్లో తొలి ఎబోలా కేసు నమోదైంది. అక్కడ ఒక హెల్త్ వర్కర్ వాంతులు, జ్వరంతో చికిత్స తీసుకొని కొన్ని రోజుల్లోనే మరణించారు. ఆ తర్వాత ఆ మృతదేహాన్ని అంత్యక్రియల కోసం ఇంటికి తరలించారు. దానిని తాకిన చాలా మందికి కొన్నాళ్లకే ఎబోలా లక్షణాలు బయటపడ్డాయి. వైరస్ సోకిన వారికి కొన్ని వారాలపాటు వ్యాధి లక్షణాలు బయటపడకపోవడంతో ఎక్కువ మందికి సోకే అవకాశం కలుగుతోంది. వ్యాధి వ్యాపించిన ప్రదేశం కాంగోలో ప్రధాన మైనింగ్ కేంద్రం కావడంతో జనాభా రద్దీ అధికంగా ఉంటుంది. దీంతో 2018లో ఎబోలా వ్యాపించిన సమయంలో దానిని కట్టడి చేయడానికి ఏకంగా రెండేళ్ల సమయం పట్టింది.ఎబోలాలో జైర్ అనే స్ట్రెయిన్ అత్యంత వేగంగా వ్యాపిస్తుంది. దీంతో పోలిస్తే బుండిబుగ్యో ఎబోలా వైరస్ కొంచెం నెమ్మదిగానే తన సంఖ్యను పెంచుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. పశ్చిమాఫ్రికా ప్రాంతంలో 2014లో 11,300 మంది ప్రాణాలు తీసింది జైర్ వేరియంట్. ఇది చరిత్రలోనే అతిపెద్ద ఎబోలా వ్యాప్తి. దీంతో పోలిస్తే బుండిబుగ్యో వేరియంట్ సోకిన వారిలో 30 మంది మాత్రమే ప్రాణాలు కోల్పోయారు. కాకపోతే దీనికి ఇప్పటి వరకు ఎలాంటి వ్యాక్సిన్, చికిత్స లేకపోవడం ఇబ్బందికరంగా మారింది.ఈశాన్య కాంగోలోని ఇటూరి ప్రావిన్స్‌లో ఎబోలా వేగంగా వ్యాపిస్తోంది. రోజు రోజుకూ మృతులసంఖ్య పెరుగుతుండటంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ బుండిబుగ్యో ఎబోలాను అంతర్జాతీయ స్థాయిలో ఆందోళనకరమైన పబ్లిక్ హెల్త్ ఎమ్జ్గ౦÷న్సీగా ప్రకటించింది. ప్రస్తుతం కాంగో, ఉగాండ, దక్షిణ సూడాన్‌లలో వ్యాప్తి తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించింది. మరోవైపు భారత ప్రభుత్వం కూడా బుండిబుగ్యో ఎబోలాపై అప్రమత్తమైంది. ప్రజలు అత్యవసరమైతే తప్ప కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాలకు ప్రయాణించవద్దని హెల్త్ అడ్వైజరీ జారీ చేసింది. ఇపపటివరకు కాంగోలో మొత్తం 867 మందికి ఈ వ్యాధి వ్యాపించగా.. 204 మరణాలు నమోదయ్యాయి. ఎబోలా ఎఫెక్ట్ భారత్‌పైనా పడింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో ఈ నెలాఖరులో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగాల్సిన నాల్గవ 'ఇండియా–ఆఫ్రికా ఫోరమ్ సమ్మిట్' వాయిదా పడింది. ఆఫ్రికా ఖండంలోని కొన్ని దేశాల్లో ప్రస్తుతం కలకలం రేపుతున్న ఎబోలా వైరస్ వ్యాప్తి దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు భారత ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. మరోవైపు ముందస్తు జాగ్రత్తగా కేంద్ర ఆరోగ్య శాఖ దేశవ్యాప్తంగా అప్రమత్తత ప్రకటించింది. ముందుగా నిర్దేశిరచిన షెడ్యూల్ ప్రకారం 4వ ఇండియా–ఆఫ్రికా ఫోరమ్ సమ్మిట్ మే 28 నుంచి మే 31 వరకు న్యూఢిల్లీలో జరగాల్సి ఉంది. ఈ క్లిష్ట సమయంలో ఆఫ్రికా దేశాలకు భారత్ తన పూర్తి సంఘీభావాన్ని తెలియజేసిందని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. 'ఆఫ్రికా సీడీసీ' నేతృత్వంలో జరుగుతున్న ప్రజారోగ్య సన్నద్ధత, అత్యవసర పరిస్థితుల నియంత్రణ ప్రయత్నాలకు భారత్ తన వంతు సాంకేతిక, వైద్య సహకారాన్ని అందించడానికి సిద్ధంగా ఉందని స్పష్టం చేసింది. ఎబోలా వ్యాప్తి నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య సేవల డైరెక్టరేట్ జనరల్ అంతర్జాతీయ ప్రయాణికులకు కీలకమైన హెల్త్ అడ్వైజరీ జారీ చేసింది. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చే వారు లేదా ఆయా



దేశాల మీదుగా ప్రయాణించి భారత్‌కు వచ్చే వారు ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్‌కు ముందే తమ ఆరోగ్య పరిస్థితిని అధికారులకు నివేదించాలని ఆదేశించింది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ 'హై–రిస్క్'గా వర్గీకరించిన డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, సౌత్ సూడాన్ దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై ప్రత్యేక నిఘా ఉంచనున్నారు. ఎబోలా లక్షణాలు ఉన్నా లేదా బాధితులతో పరిచయం ఉన్నా ప్రయాణికులు స్వచ్ఛందంగా విమానాశ్రయ ఆరోగ్య అధికారులకు తెలపాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి భారతదేశంలో ఎక్కడా ఒక్క ఎబోలా కేసు కూడా నమోదు కాలేదని అధికారిక వర్గాలు స్పష్టం చేశాయి. డబ్ల్యూహెచ్‌ఓ సూచనల ప్రకారం ప్రభుత్వం అన్ని ముందస్తు నివారణ చర్యలను తీసుకుంటోంది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఎబోలా నివారణకు అవసరమైన సన్నద్ధతతో ఉండాలని కేంద్రం ఆదేశించింది. 'ప్రభుత్వం పూర్తి అప్రమత్తంగా ఉంది. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం.. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈ విషయంలో అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మండని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.


# శుద్ధి యురేనియం అప్పగించాల్సిందే

## ఇరాన్‌తో చర్చలపై తాజాగా ట్రంప్ వెల్లడి



**వాషింగ్టన్,మే26:** అమెరికా–ఇరాన్ మధ్య జరుగుతున్న శాంతి చర్చల్లో అణు కార్యక్రమం కీలకాంశంగా మారింది. శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవాలని అమెరికా కోరుతుండగా, అందుకు ఇరాన్ పూర్తిగా అంగీకరించడం లేదు. తాజాగా ఇరాన్ అణు కార్యక్రమంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ వద్ద ఉన్న అధికంగా శుద్ధి చేసిన యురేనియంను అమెరికాకు అప్పగించాలని, లేదంటే అంతర్జాతీయ పర్యవేక్షణలో పూర్తిగా ధ్వంసం చేయాలని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ అణు కార్యక్రమం ప్రపంచ దేశాలకు ముప్పుగా మారే అవకాశముందని ట్రంప్ హెచ్చరించారు. అధిక శుద్ధి చేసిన యురేనియం ద్వారా అణ్వాయుధాల తయారీ సాధ్యమవుతుందని, అందుకే దీనిపై కఠిన చర్యలు అవసరమని పేర్కొన్నారు. అమెరికా జాతీయ భద్రతను కాపాడేందుకు అవసరమైతే మరింత కఠిన నిర్ణయాలు తీసుకుంటామని కూడా చెప్పారు . కాగా, తమ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవడానికి ఇరాన్ అంగీకరించినట్టు వార్తలు వస్తున్నాయి. తాము అణ్వాయుధం కోసం వెంపర్లాడడం లేదని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఇరాన్ శుద్ధి చేసిన ఆ యురేనియాన్ని అమెరికాకు అప్పగించాలని లేకపోతే నాశనం చేయాలని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ట్రూత్‌లో పోస్ట్ పెట్టారు. శుద్ధి చేసిన యురేనియంను నిర్వీర్యం చేసేందుకు అమెరికాకు అప్పగించాలి. లేకపోతే అటామిక్ ఎనర్జీ కమిషన్ లేక దాని సమానస్థాయి సంస్థ ఇరాన్‌తో సమన్వయం చేసుకొని.. ఒక ఆమోదయోగ్యమైన ప్రదేశంలో దానిని నాశనం చేయాలని ట్రంప్ రాసుకొచ్చారు. తన వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవడానికి ఇరాన్ సూత్రప్రాయంగా అంగీకరించిందని ఇప్పటికే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇదిలాఉంటే.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు చేసింది. 70కి పైగా హెజ్‌బొల్లా స్థావరాలను టా÷–గ్గ౦÷ట్ చేసింది. 10 కమాండ్ సెంటర్లు సహా ఆయుధ డిపోలను ధ్వంసం చేసినట్లు ఆ దేశ సైన్యం వెల్లడించింది.

# ఎండల తీవ్రత మరింత పెరుగుదల



## • రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్,మే26:** ఈ ఏడాది నైరుతి రుతుపవనాల రాక మరింత ఆలస్యమయ్యే పరిస్థితులు ఉన్నట్టు వాతావరణశాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. దీంతో ఎండల తీవ్రత మరింతగా కొనసాగనుంది. వరుసగా రోహిణి రెండోరోజు కూడా ఎండలు మండుతున్నాయి. నిజానికి రుతుపవనాలు ఈనెల 26న కేరళ తీరాన్ని తాకుతాయని అంచనా వేసినప్పటికీ వాతావరణ మార్పులతో, జూన్ 5నుంచి 10 వరకు నైరుతి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉన్నదని తెలిపింది. జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లో ఎల్‌నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదయ్యే సూచనలున్నట్టు హెచ్చరించింది. 20 జిల్లాల్లో 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా దహేగాంలో అత్యధికంగా 46.5 డిగ్రీలు, మంచిర్యాల జిల్లా దండేపల్లిలో 46.4, సూర్యాపేట జిల్లా మద్దిరాలలో 46.4, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో 46.3, ఖమ్మం జిల్లా ఏన్కూర్‌లో 46.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని తెలిపింది. రాష్ట్రంలో మరో నాలుగురోజులపాటు తీవ్రమైన ఎండలు, వడగాలులు ఉంటాయని వాతావరణశాఖ వెల్లడించింది. దీంతో ఆయా జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసినట్టు తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బ మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతు న్నది. ఈ క్రమంలోనే ఆదివారం ఒక్కరోజే దాదాపు 42మంది మృతి చెందారు. ఒక్క వరంగల్‌లోనే అత్యధికంగా 20మంది మృతి చెందగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10మంది, కరీంనగర్‌లో 8 మంది, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మృత్యువాతపడ్డారు. రాబోయే రోజుల్లో కూడా 43 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అధికారులు హెచ్చరించారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్నం వరకు ఎండలు దంచికొట్టగా, సాయంత్రం మాత్రం అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిశాయని వివరించింది. ముఖ్యంగా నల్లగొండ, వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసినట్టు తెలిపింది. కామారెడ్డి, మెదక్, పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో మోస్తరు వాన కురువగా, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్‌లో భారీ వర్షం కురిసినట్టు పేర్కొన్నది.

# మహాసిమెంట్ కార్మికుల ఆందోళన

## జీతాలు పెంచాలంటూ కర్మాగారం ముందు ధర్నా

**అనకాపల్లి,మే26:** ఎన్నాళ్లు చేసిన అదే కూలి అదే స్థాయి, తమ లాభమే కానీ కార్మికుల కష్టం పట్టదా అంటూ కార్మికులు నిరసన చేపట్టారు. యలమంచిలి మండలంలోని ములకలపల్లి గ్రామంలో ఉన్న మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ వద్ద మంగళవారం కార్మికులంతా తమ విధులను ఆపేసి యాజమాన్యం తీరును నిరసిస్తూ మెయిన్ గేట్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సంస్థలో వేరు వేరు కాంట్రాక్టర్ల ద్వారా దాదాపు 500 మంది పైగా రోజు వారి కూలితో పని చేస్తున్నారని కార్మికులు తెలిపారు. తామంతా సంస్థలో చేరి ఎన్ని సంత్సరాలయినా అదే స్థితిలో ఉన్నామని, చేరినప్పుడు ఉన్న కూలీనే ఇప్పటికీ ఇస్తున్నారు తప్ప ఏమాత్రం పెంచలేదని చెప్పారు. ఇప్పటివరకు సంస్థలో స్కిల్డ్ రూ.703, సెమీ స్కిల్డ్ రూ.560, అన్ స్కిల్డ్ రూ.470 మాత్రమే ఇస్తూ ఎలాంటి వారంతాపు సెలవులు లేవు, అనారోగ్య సెలవులు లేవు, ఏరోజు వస్తే ఆరోజు మస్తరు పద్దతిలో నడుపుతున్నారని వివరించారు. ఈ కాంట్రాక్టు కార్మికులు ఏ స్థాయిలో చేరారో, మూడు, ఐదు, ఎనిమిది ఎన్ని సంవత్సరాలు గడిచినా అదే స్థాయిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు సంత్సరాలుగా ఎలాంటి కూలి పెంపు లేకుండా ఇటీవల రోజుకి రూ.9 పెంచుతూ, ఇది జూన్ నెల నుంచి అమలవుతుందని యాజమాన్యం ప్రకటించిందని తెలిపారు. ఈ పద్ధతి నచ్చని కార్మికులు తమ విధులు బహిష్కరించి ఉదయం నుంచి మండుటెండలోనే నిరసనలు తెలుపుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారంతపు సెలవుతో కూడిన నెల వారి జీతం చెల్లించాలి. 2 సంవత్సరాలు దాటి పని చేస్తున్న వారిని తరువాత స్థాయికి పంపాలి. యూనియన్ ఏర్పాటుకి అవకాశం కల్పించాలని కార్మికులు కోరారు.

# రాష్ట్ర ఖజానాకు మద్యమే మార్గమా



తెలంగాణ రాష్ట్ర ఖజానాకు కాసుల వర్షం కురిపిస్తున్న ప్రధాన వనరుల్లో మద్యం ఆదాయం అగ్రస్థానంలో నిలుస్తోంది. ఒకవైపు ప్రభుత్వానికి భారీ ఆదాయం వస్తుండగా, మరోవైపు అదే మద్యం లక్షలాది కుటుంబాల జీవితాల్లో విషాదాన్ని నింపుతోంది. ప్రజల ఆరోగ్యం, కుటుంబ ఆర్థిక స్థితి, సామాజిక భద్రతలు దెబ్బతింటున్నా పాలక వ్యవస్థ మాత్రం మద్యం ద్వారా వచ్చే ఆదాయంపైనే అధికంగా ఆధారపడుతుండడం ఆందోళన కలిగించే అంశంగా మారింది.రాష్ట్రంలో మద్యం విక్రయాలు ప్రతి ఏడాది కొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం 2025--26 ఆర్థిక సంవత్సరంలో ఎక్సైజ్ శాఖ ద్వారా ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం రూ.44,557 కోట్లకు చేరింది. ఇందులో మద్యం అమ్మకాల ద్వారానే రూ.40,209 కోట్లు వచ్చాయి. వైన్స్ దుకాణాల దరఖాస్తు ఫీజుల రూపంలో రూ.2,869 కోట్లు, దుకాణ లైసెన్సుల ఫీజుల రూపంలో రూ.1,771 కోట్లు, బార్ల అనుమతులు, ఇతర మార్గాల ద్వారా రూ.549 కోట్లు ఖజానాకు చేరాయి. గతేడాదితో పోలిస్తే ఈసారి సుమారు ఏడు శాతం ఆదాయం పెరగడం గమనార్హం.ఈ సంఖ్యలు ప్రభుత్వ ఆదాయ వృద్ధిని సూచిస్తున్న ప్పటికీ, మరో కోణంలో చూస్తే రాష్ట్రంలో మద్యం వినియోగం ఎంత తీవ్ర స్థాయికి చేరిందో స్పష్టంగా అర్థమవుతోంది. ప్రభుత్వాలు మద్యం విక్రయాలను నియంత్రించాల్సిన పరిస్థితిలో ఉండగా, ఆదాయం కోసం వాటిని మరింత ప్రోత్సహిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల ఆరోగ్యానికి హాని చేసే వస్తువులపై ఆధారపడి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ నడవడం ప్రమాదకర ధోరణిగా భావించాల్సిన అవసరం ఉంది.

బుధవారం, మే 27, 2026
హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక | 8

# మంగళవారం రాహుకాలంలో దుర్గా పూజ చేస్తే రాహు దోషాలు తొలగుతాయా? - 9 వారాలు చేస్తే రాహు, కుజ దోషాలు దూరం!



హిందూ సంప్రదాయం ప్రకారం మంగళవారం ఆంజనేయ స్వామి, సుబ్రహ్మణ్య స్వామి ఆరాధనకు విశిష్టమైనది. అలాగే అంగారక దోష నివారణ పూజలకు, నాగ సర్ప దోష నివారణ పూజలకు కూడా మంగళవారం ప్రధానమైనది. అయితే దేవి భాగవతం ప్రకారం మంగళవారం ప్రత్యేకమైన సమయంలో దుర్గాదేవిని పూజించడం వలన కూడా గ్రహ దోషాలు తొలగుతాయని తెలుస్తోంది. ఈ సందర్భంగా మంగళవారం దుర్గాదేవిని ఏ సమయంలో పూజించాలి? ఎలా పూజించాలి? అనే వివరాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

**రాహు దోషాలు తొలగించే దుర్గా పూజ**

నవగ్రహాలలో రాహు కేతువులు పాపగ్రహాలని అంటారు. అయితే రాహువుకు శరీరమంతా విషమైతే, తోకలో మాత్రం అమృతం ఉంటుందట! అందుకే సాధారణంగా మంగళ, శుక్రవారాల్లో దుర్గాదేవిని భక్తి శ్రద్ధలతో పూజించి కోరిన కోరికలు నెరవేరాలని సంకల్పించుకుంటారు. వివాహం కాని వారు వివాహ ప్రాప్తి కోసం, వివాహితులైతే దీర్ఘ సుమంగళీ తనం కోసం, సంతానం లేనివారు సంతాన ప్రాప్తి కోసం దుర్గాదేవిని రాహుకాలంలో పూజించాలని దేవీ భాగవతం చెబుతోంది. ముఖ్యంగా దుర్గాదేవి రాహుకాల పూజలకు శీఘ్రంగా అనుగ్రహిస్తుందని అంటారు. వారంలో మంగళవారం, శుక్రవారం ఈ రెండు రోజుల్లో దుర్గా పూజ చేయడం ద్వారా కోరిన కోరికలు నెరవేరుతాయని నమ్మకం.

**మంగళవారం పూజ ప్రత్యేకం ఎందుకంటే?**

దుర్గాదేవి రాహుకాల పూజకు మంగళ, శుక్రవారాలు శ్రేష్ఠమైనప్పటికీ మంగళవారం రాహుకాల పూజకు ప్రత్యేక విశిష్టత ఉంది. ముఖ్యంగా రాహు దోషాలు నివృత్తి కావాలంటే మంగళవారం రోజున రాహుకాలంలో దుర్గాదేవిని స్మరిస్తూ పూజ చేయాలని జ్యోతిష్య శాస్త్ర పండితులు అంటున్నారు.

**దుర్గా పూజకి ఈ రోజులు ప్రత్యేకం**

దుర్గాదేవి శ్రీకృష్ణుడికి సోదరి కావడంతో విష్ణు అవతార తిథులైన అష్టమి, నవమి తిథుల్లోనూ అమ్మవారిని పూజించడం విశేష ఫలితాలను ఇస్తుంది. ఇంకా అమ్మవారిని అమావాస్య, పౌర్ణమి, మంగళ, శుక్ర, ఆదివారాల్లో పూజించడం బాధలు తొలగిపోతాయని అంటారు.

**రాహు దోషం తొలగిపోవాలంటే!**


రాహు గ్రహానికి, దుర్గాదేవికి ఓ సంబంధం ఉంది. రాహు గ్రహానికి అధిదేవత దుర్గాదేవి. అందుచేత రాహు కాలంలోనే దుర్గా పూజ చేయడం శ్రేష్టం. ముఖ్యంగా మంగళవారం రాహుకాల పూజ దుర్గాదేవికి విశిష్టమైనది. మంగళవారం మధ్యాహ్నం 3.00 గంటల నుంచి 4:30 గంటల లోపు దుర్గాదేవిని పూజించినట్లైతే అనుకున్న కార్యాలు దిగ్విజయంగా పూర్తవుతాయని విశ్వాసం.

**రాహుకాల పూజ ఎలా చేయాలి?**

అనారోగ్య సమస్యలు, ఈతి బాధలు, రుణ బాధలు, వివాహంలో ఆటంకాలు, సంతానలేమి వంటి సమస్యల కోసం మంగళవారం దుర్గాదేవికి రాహుకాలం పూజ చేసేవారు సూర్యోదయంతో నిద్రలేచి తలారా స్నానం చేసి ఇంట్లో నిత్యపూజలు యధావిధిగా పూర్తి చేసుకోవాలి. ఈ రోజు సాయంత్రం వరకు ఉపవాసం ఉండాలి. దుర్గాదేవి ఆలయంలో పూజమధ్యాహ్నం 3:00 గంటలకు దుర్గాదేవి ఆలయానికి చేరుకోవాలి. సాధారణంగా దుర్గాదేవి ఆలయాలు ఈ రాహుకాల పూజల కోసమే ఈ సమయంలో తెరచి ఉంటాయని చేసుకుని నమస్కరించుకోవాలి. దుర్గాదేవికి ఎదురుగా ఒక ప్రదేశంలో నీళ్లు చల్లి వరి పిండి, పసుపు, కుంకుమతో ముగ్గు వేయాలి. అనంతరం ముగ్గులో ఎర్రని పువ్వులు ఉంచాలి. ఒక నిమ్మపండు సగంగా కోసి, అందులోని నిమ్మరసాన్ని పిండేసి, నిమ్మపండు తొక్కను వెనుకకు ప్రమిదల్లా తిప్పి, అందులో ఆవు నెయ్యి పోసి ఐదు వత్తులతో దీపం వెలిగించాలి. ఈ విధంగా రెండు నిమ్మకాయ రెండు భాగాల్లోనూ వత్తులు వేసి దీపాలు వెలిగించాలి. ఈ దీపాలు అమ్మవారి వైపుకు ఉండేలా వెలిగించాలి. అనంతరం అక్కడే కూర్చుని దుర్గాదేవి అష్టోత్తరం, దుర్గాస్తుతి పారాయణ చేయాలి. వెలుగుతున్న దీపాలను అమ్మవారి స్వరూపంగా భావించి రెండు అరటిపండ్లు నైవేద్యంగా సమర్పించి ధూపం చూపించి, మంగళ హారతి ఇచ్చి నమస్కరించుకోవాలి.

దుర్గాదేవికి అర్చననిమ్మకాయల దీపారాధన పూర్తయ్యాక దుర్గాదేవికి అర్చన చేయించుకోవాలి. అయితే ఈ అర్చన అమ్మవారి పేరు మీదే చేయించాలి. పూజ పూర్తయ్యాక అమ్మవారికి మూడు సార్లు ప్రదక్షిణ చేసుకుని నమస్కరించుకోవాలి. దుర్గా పూజ తర్వాత నవగ్రహాలకు ప్రదక్షిణలు చేయకూడదు.ఇంట్లో పూజదుర్గాదేవి ఆలయం నుంచి ఇంటికి తిరిగి వచ్చాక పూజగదిలో నెయ్యి దీపం వెలిగించి ఐదు అగరవత్తులు, కర్పూరంతో పూజ చేయాలి. ఇలా తొమ్మిది వారాల పాటు దుర్గాదేవిని పూజిస్తే, రాహు దోషాలు, కుజ దోషాలు పటాపంచలవుతాయని పండితులు చెప్తున్నారు. శాక్తేయ సంప్రదాయం ప్రకారం దుర్గాదేవికి ప్రీతికరమైన ఈ రాహుకాల పూజతో మనం కూడా సకల శుభాలు పొందుదాం. ఓం శ్రీ దుర్గాయై నమఃముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

# శ్రీ చక్రం ఆకారంలో "దేవీ ఆలయం" - మహిళలే "పూజారులు"!



ఏదైనా దేవాలయానికి వెళ్లినా అక్కడ పురుషులే పూజారులుగా ఉంటారు. వాళ్లే అన్ని రకాల పూజలు నిర్వహిస్తారు. కానీ ఇప్పుడు చెప్పుకోబోయే గుడిలో మాత్రం మహిళలు అర్చకులుగా మారి పూజాదికాలు నిర్వహిస్తారు. వీరితో పాటు రైతులూ ఉంటారు. పైగా ఈ దేవాలయాన్ని శ్రీ చక్రం ఆకారంలో నిర్మించడం విశేషం. అంతేకాకుండా ఈ ఆలయం వెనుక మరికొన్ని ఆసక్తికరమైన అంశాలూ ఉన్నాయి. అవేంటో ఈ స్టోరీలో చూద్దాం.

పైన చెప్పిన వివరాలు అన్నీ దేవీపురం క్షేత్రం ప్రత్యేకతలు. త్రిపురసుందరి కోరి మరీ కట్టించుకున్న మహిమాన్వితమైన క్షేత్రం. దాదాపు 10 ఎకరాల్లో నిర్మించిన ఈ ఆలయం ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం దేవీపురంలో ఉంది. ఈ ఆలయాన్ని మహామేరు శ్రీ చక్రం ఆకారంలో నిర్మించారు. అంతేకాకుండా 108 అడుగుల ఎత్తు, 108 అడుగుల వెడల్పు, 9 ఆవరణలతో మూడు అంతస్తుల్లో ఈ గుడి ఉంటుంది. గర్భాలయంలో కొలువైన మూలమూర్తి.. సహస్రాక్షి రాజరాజేశ్వరిగా పూజలు అందుకుంటుంది. రాజరాజేశ్వరి దేవితో పాటు 108 దేవతల విగ్రహాలను ఉపాలయాల్లో ప్రతిష్ఠించారు. కులమతాలకు అతీతంగా ఎవరైనా దర్శించుకునేలా నిర్మించిన ఈ ఆలయం నిర్మాణం వెనుక ఆసక్తికరమైన కథనం ఉందిఎవరు నిర్మించారు: ముంబయిలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌లో అణుశాస్త్రవేత్తగా పని చేసేవారు డా. ప్రహ్లాద శాస్త్రి. అమ్మవారి భక్తుడు కావడంతో నిత్యం ధ్యానం చేసేవారు. అయితే ఇలానే ఓసారి ధ్యానంలో ఉన్నప్పుడు తన కోసం ఓ గుడి నిర్మించమని త్రిపురసుందరీదేవి ఆయన్ని ఆదేశించిందట. దాంతో చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి.. సొంతూరు వైజాగ్?కు చేరుకుని అమ్మవారి ఉపాసకుడిగా,మృతానంద స్వామిగా మారారు. అలా మొదటగా 1985లో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారట. అయితే అది పూర్తి కావడానికి దాదాపు 10 సంవత్సరాల సమయం పట్టిందంట. ఆలయ నిర్మాణానికి తగిన చోటును వెతుకుతూ ఇక్కడ తవ్విన సమయంలో అగ్నిలో కాల్చిన గుర్తులున్న పంచలోహ శ్రీచక్ర మహామేరువు కనిపించిందట. దీని గతచరిత్ర పరిశోధిస్తే.. ఈ ప్రాంతంలో దాదాపు 250 సంవత్సరాల క్రితం గొప్ప యాగం జరిగినట్లుగా, అది పూర్తికాగానే ఆ శ్రీచక్ర మహామేరువును భూమిలో నిక్షిప్తం చేసినట్లుగా తెలిసిందట. దీంతో ఆ శ్రీచక్రాన్ని ఆధారంగా చేసుకునే ఇక్కడ ఆలయాన్ని రూపొందించారని ప్రశస్తి.కులమతాలకు అతీతంగా: ఇక్కడ పూజారులు ఎవరూ ఉండరు. స్థానిక రైతులు, మహిళలు మాత్రమే శ్రీ కూర్చుని పూజలు చేసుకునేలా శివలింగాలూ ఉంటాయి. చండీహోమం, నవావరణ అర్చన, రుద్రాభిషేకంతో పాటు నిత్యం విశేష పూజలు నిర్వహిస్తారు. ఇక్కడ అమ్మవారిని పూజించి, ఏదయినా మొక్కుకుంటే త్వరగా నెరవేరుతుందనివిద్యా పూజా విధానాన్ని నేర్చుకుని ఇక్కడ అర్చకులుగా వ్యవహరిస్తున్నారు. రైతులకు తొలి ప్రాధాన్యం ఇచ్చే ఈ ఆలయంలో ఎవరైనా పూజారులుగా పనిచేయొచ్చని అంటారు ఆలయ నిర్వాహకులు. ఇంకా.. శివాలయంలో ఒకేసారి 1000 మంది కూర్చుని పూజలు చేసుకునేలా శివలింగాలూ ఉంటాయి. చండీహోమం, నవావరణ అర్చన, రుద్రాభిషేకంతో పాటు నిత్యం విశేష పూజలు నిర్వహిస్తారు. ఇక్కడ అమ్మవారిని పూజించి, ఏదయినా మొక్కుకుంటే త్వరగా నెరవేరుతుందని భక్తుల నమ్మకం. ఇక మహాశివరాత్రి, కార్తికమాసం, దేవీనవరాత్రుల సమయంలో జరిగే విశేష పూజా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచీ భక్తులు ఈ క్షేత్రానికి వస్తుంటారు.

అమ్మాయిల కోసం గురుకుల పాఠశాల: కేవలం ఆలయం మాత్రమే కాకుండా శ్రీ విద్యా ట్రస్టు నేతృత్వంలో అమ్మాయిల కోసం "అమృతకన్య" అనే గురుకుల పాఠశాలను ఏర్పాటు చేశారు. ఔత్సాహికులకు చదువుతోపాటు అమ్మవారి సాధనపట్ల కూడా అవగాహన కల్పిస్తారు. అదే విధంగా మహిళలకు పలు అంశాల్లో శిక్షణ కార్యక్రమాలు అందించి, ఆదాయబాట పట్టేలానూ ప్రోత్సహిస్తున్నారు.

ఎలా చేరుకోవాలి: ఈ ఆలయం అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలంలోని దేవీపురంలో ఉంది. కాబట్టి రైలు ద్వారా రావాలనుకునే భక్తులు అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో దిగి అక్కడి నుంచి బస్సులు, ప్రైవేట్? వాహనాల ద్వారా గుడి వద్దకు చేరుకోవచ్చు. రైల్వే స్టేషన్? నుంచి దేవాలయానికి 12 కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంటుంది.

# ప్రపంచ నవ్వుల దినోత్సవం" - నవ్వకపోవడంతో ఏం కోల్పోతున్నారో తెలుసా?



"నవ్వడం యోగమో కాదో తెలియదుగానీ.. నవ్వకపోవడం మాత్రం ఖచ్చితంగా రోగమే"! అవును మరి, మనస్ఫూర్తిగా నవ్వితే మెదడులో మన మనసుకు నచ్చిన దోస్తులాంటి బీటా-ఎండార్ఫిన్స్ రిలీజ్ అవుతాయి. బ్రెయిన్?ను ప్రెషర్?లోకి నెట్టే కార్టిసాల్, ఎపినెఫ్రిన్ వంటి ఎనిమీ హార్మోన్స్ తగ్గిపోతాయి. ఫస్ట్ ఇవి రెండూ జరిగితే చాలు, రోజంతా మనస్సు హాయిగా ఉంటుంది. ఇక ఆ తర్వాత అన్నీ లాభాలే అంటే నమ్మాల్సిందే.మరి, ఇంతకీ మీలోని ఆ మనిషి "మర మనిషి"లా ఎందుకు మారిపోతున్నాడట? కేవలం టాస్క్? యాక్సెప్టెడ్?, టాస్క్? కంప్లీటెడ్ అని పలకడానికి మాత్రమే పెదాలను వాడుతూ.. ఎలాంటి ఫీలింగ్స్ లేని రోబో వెర్షన్?లా ఎందుకు బిహేవ్? చేస్తున్నాడట? ఈ పరిస్థితి లాంగ్? టైమ్?లో ఎలాంటి సమస్యలను.. కాదు కాదు, ఎంతటి ముప్పును తెచ్చి పెడుతుందో ఆ మనిషి కాస్తైనా ఐడియా ఉందా?? మనసులోకి బందిపోట్ల తీరుగా చొరబడే నెగెటివ్ థాట్స్?ను.. ఒఆ మనిషికి తెలుసంటనా..? లేదంటనా?? సరే, ఇప్పటిదాకా జరిగిందేదో జరిగిపోయింది. ఇవాళ "ప్రపంచ నవ్వుల దినోత్సవం". ప్రతి ఏటా మే ఫస్ట్ సండేను ఇలా స్నేంత వరకూ టాస్క్ ఉంటుంది. ఇంకా చెప్పాలంటే జీవించి ఉన్నంత వరకూ ఏదో ఒక టాస్క్? రన్? అవుతూనే ఉంటుంది. దానికి నవ్వడాన్ని ఆపడం ఎందుకు? ఇవి రెండూ వేర్వేరు విషయాలు కదా! మీకు తెలుసా? సీరియస్?గా, మానసిక ఒత్తిడితో పనిచేయడం కన్నా, ఆహ్లాదకర వాతావరణంలో పనిచేస్తే ఔట్? పుట్? క్వాలిటీగా వస్తుందని రీసెర్చ్?లు చెబుతున్నాయి. సంతోషంగా పనిచేసే ఉద్యోగులు ఇతరులకన్నా 13% ఎక్కువ రిజల్ట్? తెస్తున్నారని ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి చెందిన "సైద్ బిజినెస్ స్కూల్" రీసెర్చ్ వెల్లడించింది. సో.. నీ టాస్క్? పర్ఫెక్ట్?గా కంప్లీట్? కావడానికి కూడా నువ్వు నవ్వాలంట గురూ!చైన్ లింక్..ఇక నీ పర్సనల్?, ఫ్యామిలీ, రిలేషన్స్.. వీటన్నింటినీ బలంగా లింక్? చేసే అత్యంత బలమైన గొలుసు ఏదైనా ఉందంటే, చెబితే నమ్మవుగానీ అది నీ నవ్వేనట! ముఖంలో చిరునవ్వుతో కనిపించే వారిని చూస్తే ఎదుటివారికి ఒక రిలాక్సేషన్? ఫీల్? కలుగుతుందట. అప్రయత్నంగా వారి పెదాలపైనా ఒక స్పార్క్? జనరేట్? అవుతుందట. కాలిఫోర్నియా యూనివర్సిటీ పరిశోధకులు దాదాపు 30 ఏళ్ల పాటు నిర్వహించిన లాంగిట్యూడినల్ అధ్యయనం ప్రకారం.. మనస్ఫూర్తిగా నవ్వుతూ కనిపించే వారు ఇతరులతో పోలిస్తే మెరుగైన మానసిక ఆరోగ్యాన్ని కలిగి ఉంటారని తేల్చింది. నవ్వేవారు అందరికీ నచ్చేస్తారు. అందరికీ లవబుల్? అయిపోతారట. అంతే మరి.. ఎక్కడ చూసినా రాళ్లు కుప్పలు తెప్పలు. రత్నాలు మాత్రమే అక్కడక్కడా! పక్కవాళ్లు కూడా పట్టుకుంటారు.. కాస్త జారనివ్వు బాసూ!

# చదువుల్లో అద్భుతంగా రాణించాలా? పరిహారాలు చేసుకోండిలా!




'ఏకాగ్రత, జ్ఞాపకశక్తి' తగ్గిపోతోందా – ఈ పనులతో మీ బ్రెయిన్ షార్ప్‌గా పనిచేస్తుందట!

జ్ఞాపకాలు పదేపదే గుర్తుకొస్తూ మనల్ని ఉక్కిరిబిక్కిరి చేసే అరుదైన ఆప్తులు. జ్ఞాపకశక్తిని కలిగి ఉండటం ఓ అరుదైన వరం. అదే లేకుంటే మన జీవితానికి ఎలాంటి విలువ లేదు. వ్యక్తి సామాజిక, భావోద్వేగ స్పందనల్లో, అర్థవంతమై పనితీరుల్లో జ్ఞాపకశక్తి కీలక పాత్ర పోషిస్తుంది. మరి ఇంతటి శక్తి సాధనం మన బ్రెయిన్?లో ఎలా పనిచేస్తుంది? ఎప్పుడో జరిగిన సంఘటనల్ని సైతం ఇప్పటికీ ఎలా గుర్తుంచుకుంటుంది? లాంటి విషయాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం!జ్ఞాపకాలు 3 రకాలు :సెన్సువల్ మెమొరీ : దీన్నే ఇంద్రియ జ్ఞానం లేదా షార్ట్ టర్మ్ మెమొరీ అని కూడా అనొచ్చు. కొన్ని మిల్లీసెకన్లు మాత్రం ఇది ఉంటుంది. వాసన, శబ్దాలు, దృశ్యాలు లాంటి వాటిని అర్థం చేసుకునేంత సేపు మాత్రమే ఈ జ్ఞాపకం పనిచేస్తుంది. కళ్లు, ముక్కు, నాలుక, చెవులు, చర్మం నుంచి వచ్చే సమాచారాన్ని మెదడులోని ఐదు ఇంద్రియా జ్ఞాన ప్రాంతాలు ప్రాసెస్ చేయడానికి ఇది ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు.వర్కింగ్ మెమొరీ : మెదడులోని సమాచారాన్ని కొద్ది సేపు మాత్రమే తాత్కాలికంగా గుర్తుంచుకుని, దాన్ని ఉపయోగించడానికి సహాయపడే మానసిక వ్యవస్థ ఇది. ఎలాగంటే, ఓ వ్యక్తి చెప్పిన మొబైల్ నంబరు లేదా చిరుమానాను రాసే వరకు గుర్తుంచుకుంటంది. ఇది బలహీనంగా ఉంటే చదవడం, నేర్చుకోవడం, దృష్టి కేంద్రీకరించడంలో ఇబ్బందులు రావొచ్చని నిపుణులు చెబుతున్నారు.లాంగ్ టర్మ్ మెమొరీ : జీవితంలో చోటు చేసుకున్న సంఘటనలు, అలవాట్లు, నైపుణ్యాలు, సమాచారం, అనుభవాలు, వాస్తవాలు, భావోద్వేగ అనుబంధాలు లాంటి వాటిని బ్రెయిన్?లో సుదీర్ఘకాలం నిక్షిప్తం చేసే సామర్థ్యం దీనిది. అపరిమితమైన సమాచారాన్ని ఇది భద్రపరుస్తుందంటున్నారు నిపుణులు. జ్ఞాపకాల్ని స్టోరేజ్ చేయడం, అవసరమైనప్పుడు రీకాల్ చేసుకోవడం దీని విధులని పేర్కొంటున్నారు.మీ పిల్లల్లో ఈ లక్షణాలు ఉన్నాయా? – అయితో పోషకాహర లోపం ఉన్నట్టేనట!వర్కింగ్ మెమొరీ పరిమితం : మనం ఎంత సమర్థంగా చదవగలం, గుర్తుంచు కోగలం అన్న దానిని వర్కింగ్ మెమొరీ నిర్ధారిస్తుందని నిపుణులు చెబుతున్నారు. మన అలవాట్లను మార్చుకోవడం, కొన్ని రకాల సులభతర పద్ధతుల్ని అలవరచుకోవడం ద్వారా వర్కింగ్, దీర్ఘకాల జ్ఞాపకాల సామర్థ్యాన్ని పెంచుకోవచ్చని అంటున్నారు.ఫోన్లకు దూరంగా జరగండి : స్మార్ట్?ఫోన్లు మీ వర్కింగ్ మెమొరీ సామర్థ్యాన్ని తగ్గిస్తాయని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. ముఖ్యంగా, లక్ష్యాన్ని నిర్దేశించుకుని పనిచేస్తున్నప్పుడు ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుందట. చివరికి ఫోన్ మీకు దగ్గరలో ఉన్నా, సైలెంట్ మోడ్?లో పెట్టినా, జ్ఞాపకశక్తిని అందుకునే సామర్థ్యాన్ని హరిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే, మనకు తెలియకుండానే మెదడు స్మార్ట్?ఫోన్లు వైపు లాగుతుంటుంది. కనీసం నోటిఫికేషన్లు అయినా చూద్దామనే భావన మనసులో కలుగుతూ ఉంటుంది. కాబట్టి, ఒక అంశంపై దృష్టి సారించాలనుకున్నప్పుడు ఫోన్?ను దగ్గరలో లేకుండా చూసుకోవాలి.మెదడుతో పరుగులు వద్దు : చదువు, ఉద్యోగం, ఉద్వేగాల ఒత్తిడి మన బ్రెయిన్?లోని జ్ఞాపకశక్తి జాగాను చాలా వరకు కబ్జా చేస్తాయి. ఏ విషయంలోనైనా మీరు ఆందోళన చెందుతున్నా, పరుగులు తీసే ఆలోచనలతో పక్కదోవ పడుతున్నా, వర్కింగ్ మెమొరీని చాలా వరకు ఖర్చు అవుతుందని నిపుణులు చెబుతున్నారు. మెదడు ఆలోచనల్ని అదుపులో పెట్టుకోవడం, సేదతీరడం లాంటి సాధనాల ద్వారా క్రియాశీలక జ్ఞాపకశక్తిని పెంచుకోవచ్చని, ఒత్తిడిని తగ్గించుకోవచ్చంటున్నారు. యోగా, ధ్యానం, బ్రీతింగ్ టెక్నిక్?లు దీనికి సహాయపడతాయట. ముక్కు ద్వారా లోతైనా శ్వాస తీసుకొని, కొద్ది సేపు ఆపి, నోటి ద్వారా నెమ్మదిగా గాలి వదలడం లాంటి సాధనాలు చేయొచ్చు. ఇలా 5 నిమిషాల పాటు పునరావృతం చేసినట్లయితే నాడీ వ్యవస్థపై ఒత్తిడి తగ్గి, అభ్యసన అవకాశాలు మెరుగుపడతాయని పలు అధ్యయనాల్లో తేలింది.

చంకింగ్?ను (విభజన) పాటించండి : పెద్ద సమాచారం లేదా డేటాను చిన్నచిన్న అర్థవంతమైన ముక్కలుగా విభజించి సులభంగా గుర్తు పెట్టుకునే, ప్రాసెస్ చేసే ప్రక్రియను అలవాటు చేసుకోమంటున్నారు నిపుణులు. ఎలాగంటే, కొన్ని ఫోన్ నంబర్లు లేదా జాబితాలు/పదాల్ని గుర్తు పెట్టుకోవాలనుకోండి. వాటిని చిన్న చిన్న ముక్కలుగా విడగొట్టి గ్రూపులుగా మెదడులో భద్రపరచుకుంటే, వాటిని జ్ఞప్తికి తెచ్చుకోవడం ఈజీ అవుతుంది. ఈ క్రమంలో స్టేజీ ఎక్కి ఒక ప్రజంటేషన్ ఇవ్వాలన్నా ఇదే పద్ధతిని పాటిస్తే, మీరు చెప్పే ముఖ్యమైన పాయింట్లు వినే వారికి చక్కగా అర్థమవుతాయి. అర్థవంతమైన సమాచారాన్ని ఒక క్రమ పద్ధతిలో విభజించే విధానాన్ని అలవరచుకోవడం ఇక్కడ చాలా కీలకం. దీనివల్ల బ్రెయిన్?పై భారం తగ్గి సునాయసంగా జ్ఞాపకం చేసుకోగలుగుతామట.తిరిగి పొందడం అలవరుచుకోండి : ఒక విషయాన్ని నేర్చుకున్న తర్వాత దాన్ని ఎంత త్వరగా మరిచిపోతామో 19వ శతాబ్దంలో జర్మనీ మానసిక శాస్త్రవేత్త హెర్మన్ ఎబింగాస్ (ఆధారాలతో రుజువు చేశారు. మనం నేర్చుకున్న విషయాల్లో కొన్నింటిని కనీసం 30 నిముషాల్లోపే, దాదాపు సగభాగం వరకు మరిచిపోతామని ఆయన శాస్త్రీయంగా నిరూపించారు. మిగిలిన వాటిని మరుసటి రోజుకు మరిచిపోతామని పేర్కొన్నారు. స్వల్ప సమయంలో ఎక్కువ విషయాన్ని నేర్చుకోవాలనుకున్నప్పుడు ఒకసారి విన్న, చూసిన, నేర్చుకున్న దానిని తిరిగి పొందడం ద్వారా సాధన చేయాలన్నారు. నోట్స్?ను మళ్లీ రివిజన్ చేయడానికి బదులుగా వాటిని పక్కనబెట్టి, ముఖ్యమైన భావనల్ని మననం చేసుకోవడానికి ప్రయత్నించాలంటున్నారు నిపుణులు. నోట్స్ చూడకుండా, మీరు ఒక విషయాన్ని వేరొకరికి బోధిస్తున్నట్లుగా, చురుకుగా బిగ్గరగా అంటూ ఉండమని సూచిస్తున్నారుమధ్యలో విరామం తీసుకోండి : ఒకేసారి మొత్తం చదవకండి. విషయాన్ని దీర్ఘకాలికంగా గుర్తుంచుకోవడం కోసం, మధ్యనోట్స్?ను మళ్లీ రివిజన్ చేయడానికి మధ్యలో విరామం తీసుకుంటూ రివిజన్ చేయండి. దీనివల్ల జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందంటున్నారు నిపుణులు. కొత్త విషయాన్ని నేర్చుకున్న 2 రోజులు, 7 రోజులు, చివరగా 30 రోజుల తర్వాత రివిజన్ చేయండి. ఈ రోజు, రేపు, ఎల్లుండి చదివి, 7వ రోజున ఆ విషయం గుర్తుందో లేదా తనిఖీ చేయడానికి పేపర్ లేదా కంప్యూటర్?పై రాయండి.సరిగా నిద్రపోండి : గాఢ నిద్రలో జ్ఞాపకాలు స్థిరపడతాయంటున్నారు నిపుణులు. క్రమబద్ధమైన నిద్రవేళలు జ్ఞాపక శక్తి పెరుగుదలకు దోహదపడతాయని సూచిస్తున్నారు.వ్యాయామం : ఏరోబిక్ వ్యాయామం మెదడుకు రక్త ప్రసరణను పెంచి జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుందని పేర్కొంటున్నారు.జ్ఞాపకం అనేది కేవలం మేధస్సుకు సంబంధించిన విషయం ఒక్కటే కాదని, అది వ్యూహానికి సంబంధించిందని తెలియజేస్తున్నారు. మన జీవన విధానంలో, చదువులో, పనిలో చిన్న చిన్న మార్పులు చేసుకుంటే జ్ఞాపక శక్తిని గణనీయంగా మెరుగుపరచుకోవచ్చునని సలహా ఇస్తున్నారు.

ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# శ్రీకాకుళం గాంధీ మందిరంలో ఈనెల 27న కందుకూరి వీరేశలింగం పంతులు విగ్రహావిష్కరణ



**శ్రీకాకుళం :**గాంధీ మందిరం, స్వాతంత్ర్య సమరయోధుల, సంఘ సంస్కర్తల, తేజోమూర్తుల స్మృతి వనంలో కొలువు తీరిన మహనీయుల చెంత నవయుగ వైతాళికుడు, సంఘ సంస్కర్త, సాహితీ వేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరి వీరేశలింగం పంతులుగారి విగ్రహం కొలువు తీరనుంది. శ్రీకాకుళం తెలుగు రచయితుల వేదిక సభ్యులు నెలకొల్పిన కందుకూరి వీరేశలింగం పంతులు విగ్రహాన్ని ఈనెల 27న ఆయన వర్ధంతి సందర్భంగా ఆవిష్కరిం చనున్నట్లు శ్రీకాకుళం తెలుగు రచయితుల వేదిక అధ్యక్షుడు ఉత్తరావిల్లి నాగేశ్వరరావు,ప్రధాన కార్యదర్శి రఘుపాత్రుని వెంకట రమణమూర్తి తెలిపారు. రెండు దశాబ్దాల క్రితం భారత ప్రభుత్వ ఆర్థికశాఖ హిందీ సలహామండలి సభ్యులు కోనే శ్రీధర్ స్థాపించిన తమ సంస్థ వందమంది తెలుగు కవులు, రచయితలు సభ్యులుగా కొనసాగుతూ ప్రతీ నెల మొదటి ఆదివారం సాహితీ సదస్సును నిర్వహిస్తామని, జూన్ నెల తొలి ఆదివారం 117వ సాహితీ సదస్సు జరుగనుందని వీరు తెలిపారు. కందుకూరి వీరేశలింగం పంతులు విగ్రహావిష్కరణ సందర్భంగా ఆయన జీవిత విశేషాలను మా పాఠకులకు అందజేస్తున్నాం.

తెలుగు ప్రజల ప్రాతఃస్మరణీయుడైన కందుకూరి వీరేశలింగం పంతులు పరిచయం అవసరంలేని నవయుగ వైతాళికుడు, సంఘ సంస్కర్త, సాహితీవేత్త, రావు బహదూర్ బిరుదాంకితుడు. కళలకు కాణాచియైన రాజమహేంద్రవరం లో 1848 ఏప్రిల్ 16న అగ్రవర్ణానికి చెందిన సుబ్బారాయుడు, పున్నమ్మ పుణ్య దంపతులకు జన్మించిన కందుకూరి వీరేశలింగం చిన్ననాటి నుండే ప్రతిభాపాటవాలను ప్రదర్శించేవాడు. చిన్నతనంలో తండ్రి మరణించడంతో బంధువులు చేరదీసి రాజమహేంద్రవరం, చెన్నై వంటి ప్రదేశాల్లో ఉన్నత చదువులు చదివించారు.

బాల్యంలోనే సామాజిక పోకడలను, బాల్య వివాహాలు, బాలికా విద్య పట్ల అనాసక్తి, అంటరానితనం పేరుతో వారిని విద్యావకాశాలు లేకుండా చేయడం, వితంతు వివాహాల నిషేధం వంటి సామాజిక రుగ్మతలను నిర్భయంగా ప్రశ్నించేవాడు. అవినీతి, లంచగొండితనాలను చూస్తూ సమాజం మౌనం వహించడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోయారు. బాల్యంలో వేధించిన ఈ ప్రశ్నలన్నింటికీ జవాబులు వెతుక్కుంటూ సాగిన జీవన పయనమే సమాజానికి ఆయన బహూకరించిన సంస్కరణలు.లంచమివ్వనిదే రాదని ప్రభుత్వ ఉద్యోగాన్ని, అబద్ధాలు చెప్పించవలసి వస్తుందని న్యాయవాది వృత్తిని కాదనుకొని ప్రశాంతమైన ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగిడిన కందుకూరి రాజమహేంద్రవరం లో 25 సంవత్సరాలు తెలుగు పండితునిగా, మద్రాస్ ప్రెసిడెన్సీ కళాశాల, చెన్నైలో తెలుగు అధ్యాపకునిగా ఐదేండ్లు పనిచేసారు. సమకాలీన సామాజిక ఆచారాలు, సాంప్రదాయాల ప్రకారం వీరేశలింగం కు పదమూడవ ఏట ఎనిమిదేళ్ళ బాపమ్మ( రాజ్యలక్ష్మి)తో వివాహం జరిగింది. బాల్య వివాహాల దుష్పరిణామాలు ప్రత్యక్షంగా చూసి, అనుభవించిన వీరేశలింగం బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ఉద్యమించారు. ఈ దిశగా ప్రజల్లో అవగాహన, చైతన్యం కల్పించేందుకు సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి,భావ సారూప్యం గల మేధావులను, యువతను కలుపుకు పోయారు. దెయ్యాలు, చేతబడులు కేవలం భ్రాంతియని ప్రజలకు చాటిచెప్పి వారిని చైతన్యవంతులను చేసారు.

వీరేశలింగం పంతులు స్వంతంగా పాఠశాల ప్రారంభించారు. ఈ పాఠశాలలో బాలబాలికలను ఒకేచోట చదువు, సంస్కారం నేర్పడమే గాక అంటరాని కులాలుగా పిలువబడే పిల్లలను కూడా వీరితోపాటు చేర్చుకుని చదువునేర్పి ఒకే చర్య ద్వారా బాలికా విద్య, సహ విద్య, విద్యకు దూరమైన అస్పృశ్యులకు విద్య అనే మూడు సమస్యలకు పరిష్కారం కనుగొన్నారు. తొలుత ఈ చర్యను వ్యతిరేకించిన వర్గాలు ఆ తరువాత ఆమోదించారు.

బాల్య వివాహాల కారణంగా చిన్నవయసులోనే వితంతువులు జీవితాంతం వితంతువులాగానే ఉండాలనే సామాజిక కట్టుబాట్లను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. పూర్వ విద్యార్థులు, మిత్రులు, సతీమణి రాజ్యలక్ష్మిల సహకారంతో వితంతు వివాహాలను ప్రోత్సహించడమే గాక తన ఇంటివద్ద 1881డిశెంబరు 11న తొలి వితంతు వివాహం జరిపించిన మహనీయుడు కందుకూరి వీరేశలింగం పంతులు. సమాజం నుండే గాక బంధువర్గం నుండి కూడా తీవ్ర వ్యతిరేకత, విమర్శలు వెల్లువెత్తినా, వంట చేసేవారు, బట్టలుతికేవారు సామాజిక బహిష్కరణ గాలించినా చలించని ఆయన తన లక్ష్య సాధనలో ముందుకు దూసుకుపోయారు. ఈ సమయంలో ఇంటి పనినంతా తానే చేసుకుని భర్తకు సహకరించారు రామలక్ష్మి. ఎన్నో అడ్డంకులను అధిగమించి 40 వితంతు వివాహాలను జరిపించిన సాహసికుడు వీరేశలింగం పంతులు.

ఆంధ్రప్రదేశ్ లో బ్రహ్మ సమాజ్ ను స్థాపించి హిందూ మతములో గల అనైక్యతను రూపుమాపడానికి ప్రయత్నించారు. నిరాశ , నిస్పృహలతో కొట్టిమిట్టాడుతున్న యువతను సంఘటితపరచి చైతన్యవంతులను చేసి సామాజిక రుగ్మతలపై పోరాటానికి సిద్ధం చేయడానికి యువజన సంఘాల నేర్పాటుచేసారు. 1905 లో హిత కారిణి సమాజం పేరుతో సేవాసంస్థ నెలకొల్పి తన యావదాస్తిని ఆ సంస్థకు దానం చేసిన దానశీలి కందుకూరి.

తెలుగు భాషలోనే గాక సంస్కృతం, ఆంగ్ల భాషలలో కందుకూరి వీరేశలింగం పంతులు ప్రావీణ్యం గలవారు. బాల్యంలోనే శతకాలను రాసిన ఆయన తన జీవిత కాలంలో 130 గ్రంథాలు రచించారు. రాజశేఖర చరిత్ర పేరుతో నవల, పిల్లలకు వాచకాలు, స్వీయ చరిత్ర, ఆంధ్ర కవుల చరిత్ర, సంగ్రహ వ్యాకరణం, ప్రహసనం పేరుతో హాస్య, వ్యంగ్య రచనలు చేయడమే కాకుండా పరవస్తు చిన్నయ సూరి విష్ణుశర్మ గారి పంచతంత్ర వ్యాకరణం లో విడిచిన భాగాన్ని పూర్తి చేసారు. బ్రిటిష్ ప్రభుత్వం 1893లో ఆయనను రావు బహదూర్ బిరుదుతో సత్కరించింది. కాగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాటక రంగం లో ప్రతి ఏడాది కందుకూరి పురస్కారం పేరుతో నాటకరంగ ప్రముఖులను సత్కరిస్తున్నారు. వివేక వర్ధిని పత్రిక స్థాపించి లంచగొండితనం, వేశ్య వృత్తి, సమాజంలోగల దురాచారాలను తీవ్రంగా ఎండగట్టేవారు. 1919 మే 27 న తన 71వ ఏట తనువు చాలించారు. జీవితాంతం సమాజంలోని దురాచారాలపై రాజీలేని పోరాటం చేసి విజయం సాధించారు. రాజమహేంద్రవరంలో ఆయన నివాసం ప్రస్తుతం పర్యాటక శాఖ ఆధీనంలో మ్యూజియంగా రూపుదిద్దుకొని కందుకూరి వీరేశలింగం సంస్కరణోద్యమానికి సాక్షీభూతంగా నిలిచింది. ఆయన తన రచనల ద్వారా తెలుగు తల్లికి ఎనలేని సేవ చేసారు. తెలుగు జాతికి ఆయన జీవితం ఆదర్శనీయం. అటువంటి మహనీయుని విగ్రహం ఈరోజు శ్రీకాకుళం గాంధీ మందిరం లో ఆవిష్కరించడం ఆనందదాయకం. ఆయన విగ్రహం నెలకొల్పిన శ్రీకాకుళం తెలుగు రచయితుల వేదిక సభ్యులు నిజంగా తెలుగు వీరులే...వ్యాసకర్త : చౌధరి రాధాకృష్ణ, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, శ్రీకాకుళం జిల్లా

# పెరుగుతున్న పెట్రోల్ డీజిల్ రేట్లు వెంటనే తగ్గించాలని సిపిఎం పార్టీ బూర్గంపాడు మండల కమిటీ డిమాండ్



**బూర్గంపహాడ్, మే 26:** సారపాక బస్టాండ్ సెంటర్లో పెట్రోల్ డీజిల్ రేట్లు తగ్గించాలని నిరసన ఆందోళన ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బాల నర్సారెడ్డి పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం విచ్చలవిడిగా రెచ్చిపోయి ప్రజల పైన భారాలు మోపుతు న్నారని అన్నారు అంతేకాదు ప్రజల్ని మతాల పేరుతో కులాల పేరుతో పక్కదారి పట్టిస్తూ మోడీ ప్రభుత్వం ఇష్ట రాజ్యాంగ ధరలు పెంచుతున్నారని ప్రజలకి ధరలు పెరుగుతున్న కూడా ప్రభుత్వంపై దృష్టి లేకుండా పక్కదారి పట్టిస్తున్న మోడీ ప్రభుత్వం అందుకు ఇవ్వాలా దేశవ్యాప్తంగా సామాన్య ప్రజలు నిత్యవసర సరుకులు కొనుక్కొని తినలేని చితికి తెచ్చిన మోడీ పెట్రోల్ డీజిల్ గ్యాస్ రేట్లు పై ధరలు పెంచితే సామాన్యుడు కొనుక్కొని తినలేని దౌర్భాగ్యానికి తీసుకొస్తున్న మోడీ ప్రభుత్వం ఉప్పు దగ్గర నుండి పప్పు మంచి నూనె ఇతర ప్రజలు ఉపయోగపడే నిత్యవసర సరుకులపై భారాలు మోపుతున్న కార్పొరేట్ శక్తులు దేశంలో ఉన్న సంపద మొత్తం అదాని అంబనీకే కట్టపెడుతున్నారని తెలిపారు

సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చిన కానుంచి ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు నిరుద్యోగం బజారున పడుతున్నారు చదువుకున్న విద్యార్థులు అనేకమైన తప్పుడు మార్గాలలో నడుస్తున్నారు ఉద్యోగాలు లేక చదువుకున్న విద్యార్థులకు రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తానని మభ్యపెట్టి అధికారంలోకి వస్తున్న మోడీ కానీ ఎక్కడ ఉద్యోగాలు ఇవ్వలేదు అందుకు ప్రభుత్వానికి యువత బుద్ధి చెప్పాలని గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందని మోటార్ సైకిల్ వెహికల్స్ కూడా నడపలేని పరిస్థితిలో ఇవాళ పెట్రోల్ డీజిల్ విపరీతంగా రేట్లు పెంచుతున్నారు మోడీ ప్రభుత్వం ఐదు రాష్ట్రాలు ఎన్నికలు అయిన వెంటనే ఇప్పటికీ పది రోజుల్లో నాలుగుసార్లు పెట్రోల్ డీజిల్ పెంచి పది రూపాయల దాకా పెంచారు ఇప్పుడు సుమారు ఒక లీటరు పెట్రోలు 117కు పెరిగింది అంటే 60 రూపాయలు పెట్రోలు ఉన్న గతంలో ఈ రోజున ఇంత పెద్ద ఎత్తున ధరలు పెంచడం దారుణమైన విషయమని అన్నారు గత వారం రోజుల్లో క్రూడ్ ఆయిల్ ధర 110 డాలర్ల నుంచి 92 డాలర్ల కంటే కిందుకు పడిపోయింది కానీ మనకు మాత్రం నాలుగుసార్లు పెట్రోల్ డీజిల్ ధరలు పెంచారు ఎందుకిలా జరుగుతుంది అంటే ఈ దేశంలో సామాన్యుడు బతికే పరిస్థితి లేకుండా ధరల మీద ధరలు పెంచుతున్న మోడీ ప్రభుత్వానికి ప్రజలు అర్థం చేసుకోవాలి ఈ యొక్క పెంపుదల ఇంతటితో ఆగదు రోజు రోజు పెరుగుతూనే ఉంటది కాబట్టి ప్రజలందరూ కూడా పోరాటాలు ఉద్యమంలోకి రావాలని డిమాండ్ చేశారు

ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పాపినేని సరోజన,

ఎస్ కె అబిద, భయ్యా రాము, గుంటుక కృష్ణ ,పాండవుల రామనాథం, కనకం వెంకటేష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్లక్ష్యం, అక్రమ వసూళ్లపై ఆగ్రహం : డా మారెల్లి విజయకుమార్


**– ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ అసోసియేట్ జనరల్ సెక్రెటరీ వినతిపత్రం**



**భద్రాద్రి కొత్తగూడెం మే 26:**భద్రాచలం, మణుగూరు మరియు కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయని ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారికి వినతిపత్రం సమర్పించినట్లు ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ అసోసియేట్ జిల్లా అధ్యక్షుడు డా. మారెల్లి విజయకుమార్ తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యవసర సమయాల్లో డాక్టర్లు అందుబాటులో లేక రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని, కొంతమంది నర్సులు మరియు సిబ్బంది రోగులతో అమానుషంగా ప్రవర్తిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. అలాగే ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కొంతమంది కాంట్రాక్ట్ కార్మికులు ప్రతి చిన్న పనికీ డబ్బులు డిమాండ్ చేస్తూ పేద రోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా మణుగూరు ఏరియా హాస్పిటల్ లో "మామూల్" ఇవ్వకపోతే యూరిన్ పైపు కూడా పెట్టరని, ఆపరేషన్ థియేటర్ వరకు తీసుకెళ్లేందుకు డబ్బులు అడుగుతు న్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఆపరేషన్ థియేటర్లలో అక్రమ వసూళ్లు జరుగుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఆసుపత్రులలో పరిశుభ్రత దయనీయంగా మారిందని, వార్డులు, మరుగుదొడ్లు శుభ్రంగా లేక రోగులకు ఇన్ఫెక్షన్ల ముప్పు పెరుగుతోందని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందించే ఆహారం నాణ్యతలేనిదిగా ఉందని, అవసరమైన మందులు అందుబాటులో లేక పేద రోగులు బయట మెడికల్ షాపులపై ఆధారపడాల్సి వస్తోందని తెలిపారు. మణుగూరు ఏరియా హాస్పిటల్‌లో ప్రభుత్వ ఆధ్వర్యంలో జనరిక్ మెడికల్ షాప్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మరణించిన వారి భౌతిక కాయాలను తరలించేందుకు సరైన అంబులెన్స్ సదుపాయం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భద్రాచలం, మణుగూరు, కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, అక్రమ వసూళ్లపై విజిలెన్స్ విచారణ జరపాలని, రోగులతో దురుసుగా ప్రవర్తించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డా. మారెల్లి విజయకుమార్ డిమాండ్ చేశారు. అలాగే ఆసుపత్రుల్లో పరిశుభ్రత, ఆహార నాణ్యత, మందుల లభ్యతపై ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేసి పేద ప్రజలకు గౌరవప్రదమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# పిల్లలను ఫోన్‌ల నుంచి దూరంగా ఉంచేందుకు ఈ చిన్న సూచనలు పాటించండి..



ప్రస్తుతం పిల్లల చేతిలో మొబైల్ ఫోన్ కనిపించడం చాలా సాధారణంగా మారిపోయింది. అయితే పిల్లలు ఫోన్ వైపు ఆకర్షితులు కావడం వాళ్లు అలసత్వంగా ఉండటం వల్ల కాదని తక్షణ వినోదం, వెంటనే దృష్టి మళ్లించే సాధనం, తక్కువ శ్రమతో ఎక్కువ ఉత్సాహం ఇచ్చే మార్గం కావడంతో స్క్రీన్‌లకు పిల్లలు త్వరగా అలవాటు పడుతున్నారని నిపుణులు చెబుతున్నారు. క్రమంగా ఈ అలవాటు పెరిగితే నిజ జీవిత ఆటలు, నెమ్మదిగా జరిగే కార్యకలాపాలు పిల్లలకు ఆసక్తికరంగా అనిపించవని నిపుణులు చెబుతున్నారు. అయితే పిల్లలను ఫోన్‌కు దూరంగా ఉంచేందుకు ఖరీదైన ఆట వస్తువులు అవసరం లేదని, చిన్న చిన్న అలవాట్లే సరిపోతాయని సూచిస్తున్నారు. పిల్లలను ఫోన్ కు దూరంగా ఉంచే కొన్ని అలవాట్ల గురించి వారు వివరిస్తున్నారు. ఏదైనా తయారు చేయించాలి..పిల్లలకు తమ చేతులతో ఏదైనా తయారు చేసే అవకాశం ఇవ్వడం చాలా మంచిదని నిపుణులు చెబుతున్నారు. కాగితాలు, రంగు పెన్సిళ్లు, మట్టి, కార్డ్‌బోర్డ్ ముక్కలు లేదా ఇంట్లో ఉండే సాధారణ వస్తువులతోనే పిల్లలు కొత్త కొత్త వస్తువులు తయారు చేయగలుగుతారు. పేపర్ విమానం, చిన్న ఇల్లు, మట్టి బొమ్మ లేదా బ్లాక్స్‌తో నిర్మాణాలు చేయడం వంటి పనులు పిల్లల్లో సృజనాత్మకతను పెంచుతాయి. ఇలా ఏదైనా స్వయంగా తయారు చేసినప్పుడు వారికి కలిగే ఆనందం స్క్రీన్‌ల కంటే ఎక్కువకాలం నిలుస్తుంది. పిల్లల్లో ఉన్న శక్తిని బయటకు తీసుకురావడానికి శారీరక కదలికలు చాలా అవసరం. చిన్న నడక, బంతి ఆటలు, సంగీతానికి డ్యాన్స్ చేయడం లేదా ఇంట్లోనే చిన్న అడ్డంకుల ఆటలు నిర్వహించడం వల్ల పిల్లల్లో ఉత్సాహం పెరుగుతుంది. శరీరాన్ని కదిలించడం వల్ల ఒత్తిడి తగ్గి, ఏకాగ్రత మెరుగుపడుతుంది. ఎక్కువసేపు స్క్రీన్ ముందు కూర్చున్న పిల్లలతో పోలిస్తే పరుగులు తీసిన పిల్లలు మరింత చురుకుగా ఉంటారని పేర్కొంటున్నారు. ఇంట్లో బాధ్యతలు అప్పగించాలి..ఇంట్లో చిన్న చిన్న బాధ్యతలు అప్పగించడం కూడా పిల్లలకు ఎంతో ఉపయోగకరమని నిపుణులు చెబుతున్నారు. కూరగాయలు సర్దడం, మొక్కలకు నీళ్లు పోయడం, పుస్తకాలు అమర్చడం, టేబుల్ సెట్ చేయడం వంటి పనులు పిల్లల్లో బాధ్యతాభావాన్ని పెంచుతాయి. పెద్దలకు ఇవి చిన్న పనుల్లా అనిపించినా పిల్లలకు మాత్రం తాము కుటుంబంలో భాగమన్న భావన కలుగుతుంది. పిల్లలతో కలిసి చదవడం కూడా మంచి అలవాటుగా చెప్పవచ్చు. కథలు వినిపించడం, పుస్తకాలు కలిసి చదవడం లేదా పిల్లలతో మారుమారుగా చదవించడం వల్ల వారిలో ఊహాశక్తి పెరుగుతుంది. స్క్రీన్‌లతో పోలిస్తే పుస్తకాలు పిల్లలను ఆలోచింపజేస్తాయని, కథల ప్రపంచంలోకి తీసుకెళ్తాయని నిపుణులు చెబుతున్నారు. వంటగదిలో పిల్లలను భాగస్వామ్యం చేయడం కూడా మంచి మార్గం. పండ్లు కడగడం, పిండి కలపడం, తేలికపాటి వంట పనుల్లో సహాయం చేయడం వంటి పనులు పిల్లలకు ఆసక్తిని కలిగిస్తాయి. చేతులతో ఏదైనా చేసి చివర్లో తాము తయారీలో భాగమైన ఆహారం చూడటం పిల్లలకు సంతృప్తిని ఇస్తుంది. ప్రకృతిలో గడపనివ్వాలి..ప్రకృతికి దగ్గరగా తీసుకెళ్లడం కూడా పిల్లల్లో మార్పు తీసుకురాగలదని నిపుణులు చెబుతున్నారు. పార్కులకు తీసుకెళ్లడం, మొక్కలు నాటించడం, ఆకులు సేకరించడం లేదా పక్షులను గమనించడం వంటి పనులు పిల్లల్లో ప్రశాంతతను పెంచుతాయి. ప్రకృతి పిల్లలను నెమ్మదిగా ఆలోచించేలా చేసి చుట్టూ ఉన్న ప్రపంచాన్ని గమనించే అలవాటు పెంచుతుంది. పిల్లలతో సరదాగా మాట్లాడటం కూడా ఒక మంచి వినోదంగా మారుతుంది. ఈ రోజు ఏం కొత్తగా చూశావు?, నీకు ఏదైనా కనిపెట్టే అవకాశం వస్తే ఏం కనిపెడతావు? వంటి ప్రశ్నలు అడగడం ద్వారా పిల్లలు తమ ఆలోచనలు పంచుకుంటారు.

# మంత్రి పొంగులేటి ఆదేశాలతోనే పాల్వంచలో భూసమస్యలకు పరిష్కారం

**– డీసీసీబీ/డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల**



**పాల్వంచ, మే 26:**కాంగ్రెస్ పార్టీ డివిజన్ల సమావేశాల్లో కొత్వాల రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలతోనే పాల్వంచలోని భూసమస్యలకు పరిష్కారం లభిస్తోందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ ప్రాంతానికి చెందిన 2వ డివిజన్ (ప్రశాంతినగర్), 45వ డివిజన్ (కొమ్ముగూడెం), 31వ డివిజన్ (పాలకొయ్య తండా), 32వ డివిజన్ (గాంధీనగర్, నవభారత్) లలో మంగళవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ డివిజన్ స్థాయి సమావేశాల్లో కొత్వాల ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ.. భూసమస్యల పరిష్కారానికై ప్రభుత్వం ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉందన్నారు. పాల్వంచ ప్రజలను దీర్ఘకాలంగా ఆవేదనకు గురిచేస్తున్న 999, 817, 727, 444 సర్వే నెంబర్ల సమస్యల పరిష్కారానికి మంత్రి పొంగులేటి ప్రత్యేక చొరవ చూపుతున్నారని ఆయన తెలిపారు. పేద ప్రజల సమస్యల పరిష్కారం ఒక్క కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ, పార్టీకి అండగా నిలవాలని కొత్వాల కోరారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ మేయర్ సిరిపురపు లలితకుమారి, కార్పొరేటర్లు మాలంపాటి భవిత, దంతెబోయిన నరేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జాలే జానకిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న గౌడ్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శులు నూకల రంగారావు, పి. నరహరి, కాంగ్రెస్ నాయకులు మాలోత్ కోటి నాయక్, మాలంపాటి కిరణ్, చంటి, భరత్, డప్పు రాము తదితరులు పాల్గొన్నారు.

# మీసేవ సేవలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా ప్రజలకు సులభతరంగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు: జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్

**భద్రాద్రి కొత్తగూడెం, మే 26 :**మీసేవ సేవల ధృవీకరణకు ప్రజల నుండి ఎలాంటి భౌతిక పత్రాలు అవసరం లేదని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. "ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన పత్రాలనే అధికారులు పరిశీలించాలి. దరఖాస్తుల పరిశీలన కోసం ప్రజల నుండి ఎలాంటి భౌతిక పత్రాలను స్వీకరించరాదు" అని ఆయన స్పష్టం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మీసేవ సేవలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా, ప్రజలకు సులభతరంగా అందించేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆదాయ, కుల, నివాస, కుటుంబ సభ్యుల ధృవపత్రాలు, ఇబీసీ, ఓబీసీ తదితర సేవల ధృవీకరణ కోసం ఈఎస్‌డీ అభివృద్ధి చేసిన "జి.పి.ఓ, ఎం.ఆర్.ఐ వెరిఫికేషన్ మొబైల్ అప్లికేషన్" అందుబాటులో ఉందని తెలిపారు. ఈ యాప్ ద్వారా సంబంధిత అధికారులు మీసేవ దరఖాస్తు వివరాలను, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన పత్రాలను మాత్రమే పరిశీలించి, అర్హత ఆధారంగా ఆమోదం లేదా తిరస్కరణ నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

ఈ నేపథ్యంలో, మీసేవ దరఖాస్తుల పరిశీలన కోసం ప్రజల నుండి ఎలాంటి భౌతిక పత్రాలను స్వీకరించరాదని స్పష్టం చేశారు. మండల, గ్రామ స్థాయిలో విధులు నిర్వహిస్తున్న అధికారులు కూడా భౌతిక పత్రాలను కోరరాదని సీసీఎల్ఏ కార్యాలయం ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. కాబట్టి, ప్రజలు మీసేవ దరఖాస్తులకు సంబంధించిన పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన అనంతరం, ఎలాంటి భౌతిక పత్రాలను అధికారులకు లేదా సిబ్బందికి అందజేయవద్దని సూచించారు. జిల్లా పరిపాలనా యంత్రాంగం ఈ ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, ఇబ్బందుల్లేని సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. సమస్యలు ఉంటే సంప్రదించాల్సిన నంబర్లు:మీసేవ సేవలకు సంబంధించిన సమస్యలు ఎదురైనట్లయితే సంబంధిత మండల అధికారులను లేదా జిల్లా మీసేవ మేనేజర్లను సంప్రదించాలని సూచించారు.

జిల్లా మీసేవ అధికారులు: కృష్ణమూర్తి -- 9133122022, రాకేష్ -- 9000420792

ఇ-డిస్ట్రిక్ట్ మేనేజర్: సైదేశ్వర రావు -- 7337340825

## ధాన్యం తరలింపును త్వరగా పూర్తి చేయాలి

- తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తాం.
- రైతులకు కలెక్టర్ గారి భరోసా



**జనగామ జిల్లా,** జనగామ జిల్లా ఘనపూర్ (స్టేషన్)లో ఉన్న (మెప్మా) ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో కలెక్టర్ గారి ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గారు అన్నారు. మంగళవారం, జిల్లాలోని ఘనపూర్ (స్టేషన్)లో ఉన్న (మెప్మా) ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న ధాన్యం కొనుగోలు కేంద్రం, నమిలిగొండ గ్రామ పంచాయతీ పరిధిలో గల ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం, అలాగే జఫర్గడ్ మండలంలోని కూనూరు గ్రామంలో గల పీఏసీఎస్ ధ్యానం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గారు సందర్శించి, రైతులకు ఇబ్బందులు లేకుండా వేగంగా కొనుగోళ్లు చేపట్టాలి అని, హమాలీలను పెంచి లోడింగ్, అన్లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి అని, టోకెన్ల వారీగా కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించాలి అని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రిజిస్టర్లు, ట్రక్ షీట్, ఓపీఎంఎస్ నమోదులను పరిశీలించారు.

## ప్రజా పాలన -ప్రగతి ప్రణాళికపై క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం



**హైదరాబాద్, :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర చివాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారి అధ్యక్షతన మంగళవారం క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణతో పాటు "ఇందిరమ్మ కుటుంబ జీవన భీమా" పథకం అమలుపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. సబ్ కమిటీ సభ్యులు, మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారు సమావేశంలో పాల్గొని పలు కీలక సూచనలు చేశారు.

ప్రజా పాలన – ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా జూన్ 2వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న కార్యక్రమాల రూపకల్పన, అమలు విధానం, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించే అంశాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ప్రతి పేద కుటుంబానికి భరోసా కల్పించే దిశగా "ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా" పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని నిర్ణయించారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, డీజీపీ సి.వి. ఆనంద్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలిగా గుంటోజు పావని



**ములుగు జిల్లా :** అఖిల భారత విశ్వకర్మ మహాసభ రాష్ట్ర మహిళ కమిటీ ఉపాధ్యక్షులుగా శ్రీమతి గుంటోజు పావని నిరంజన్ చారి గారిని నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షులు నౌండ్ల సంతోష్ చారి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీమతి గుంటోజు పావని నిరంజన్ చారి గారు ఎన్నో సంవత్సరాలుగా సంఘ సేవ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ, ఆపదలో ఉన్న ఎంతోమందికి సహాయ సహకారాలు అందించి మంచి పేరు సంపాదించారని పేర్కొన్నారు. వారు మరింతగా సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించాలని భావించి ఈ సముచితమైన బాధ్యతను అప్పగించినట్లు తెలిపారు. నూతనంగా ఎంపికైన వారికి పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షులు డాక్టర్ అశ్విని కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి బ్రహ్మశ్రీ సుభాష్ చంద్రబోస్, జాతీయ వ్యవహారాల అధ్యక్షులు బ్రహ్మశ్రీ రామ్ రాజ్, జాతీయ యువజన విభాగం అధ్యక్షులు బ్రహ్మశ్రీ దిలీప్ కుమార్ శర్మ, జాతీయ అడ్వైజరీ కమిటీ సభ్యులు బ్రహ్మశ్రీ చిన్మయ చారి తదితరులు అభినందనలు తెలిపారు. తన నియామకం పట్ల జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి పావని కృతజ్ఞతలు తెలిపారు.

## చట్టబద్ధమైన విధానంలో దత్తత తీసుకోవాలి

- దత్తత ఉత్తర్వులు అందించిన జిల్లా కలెక్టర్



**కరీంనగర్ :** హైదరాబాద్‌కు చెందిన దంపతులకు తోబుట్టువులైన పిల్లల దత్తతకు సంబంధించిన చట్టబద్ధమైన ఉత్తర్వులను గౌరవ జిల్లా కలెక్టర్ శ్రీమతి చిత్రా మిశ్రా గారు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గారు మాట్లాడుతూ, పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన విధానంలో దత్తత తీసుకోవాలని సూచించారు. దత్తత తీసుకోవాలనుకునే వారు పూర్తి సమాచారం కోసం జిల్లా పరిషత్‌లోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి ఎం. సరస్వతి గారు, శిశుగృహ ఇన్‌చార్జ్ అపూర్వ, ఐసీపీఎస్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# బెల్లి లలితను అగ్రవర్ణాలే హత్య చేశాయి

- బెల్లి లలిత వర్ధంతి సభకు హాజరైన టీఆర్పీ నాయకులు..
- సామాజిక తెలంగాణ ను సాధించడమే బెల్లి లలితకు నిజమైన నివాళి.
- టిఆర్పి వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజని కుమార్ యాదవ్.
- ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్.



**యాదాద్రి భువనగిరి జిల్లా, :** తెలంగాణ తొలిదశ మలిదశ ఉద్యమాలకు తన గొంతుకతో ప్రాణం పోసిన సబ్బండ వర్గాల సాంస్కృతిక సారథి, తెలంగాణ గానకోకిల బెల్లి లలితక్క వర్ధంతి వేడుకలకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ ముఖ్య నాయకులు హాజరయ్యారు. లలితక్క చిత్రపటానికి పూలమా లలు వేసి, అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ నాయకులు, కార్యకర్తలు నివాళులు అర్పించారు. అనంతరం భువనగిరి పట్టణంలోని ప్రైవేట్ హోటల్లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజనీ కుమార్ యాదవ్ అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో సామాజిక న్యాయం కోసం ఎలుగెత్తి చాటిన వారందరినీ అగ్రవర్ణాలు హత్య చేశారని ఆరోపించారు.. బెల్లి లలిత హత్య వెనకాల కూడా ఈ అగ్రవర్ణాలే ఉన్నాయని అన్నారు భువనగిరి పరిసర ప్రాంతాల్లోని అమరవీరుల స్ఫూర్తితో తెలంగాణలో అట్టడుగు వర్గాలకు అధికారాన్ని అందించే లక్ష్యంతో తెలంగాణ రాజ్యాధికార పార్టీ పురుడు పోసుకుందన్నారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ మాట్లాడుతూ, నాటి పాలకుల అరాచకాలపై, భూస్వామ్య శక్తులపై నిప్పులు చెరిగారు. ఒక బెల్లి లలితని హత్య చేస్తే తెలంగాణ ఉద్యమ పాట ఆగిపోతుందని భ్రమపడ్డ నాటి అరాచక పాలకులు, హంతక ముఠాలు ఇవాళ కాలగర్భంలో కలిసిపోయాయయని అన్నారు. కానీ లలితక్క పాడిన ప్రతి పాట కోట్ల మంది బహుజనుల గుండెల్లో విప్లవ జ్వాలగా ఎగసిపడుతోందని తెలిపారు..ఆమె శరీరాన్ని 17 ముక్కలుగా చేసిన భయపడకుండా, వేలాది మంది ఉద్యమకారులు పుట్టుకొచ్చి తెలంగాణ జెండా ఎత్తారు" అని అన్నారు.

లలితక్క కలలుగన్న సామాజిక తెలంగాణ, సబ్బండ వర్గాల రాజ్యాధికారం సాధించే వరకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ విశ్రమించదని, బహుజనుల హక్కులను కాలరాస్తున్న ద్రోహుల గుండెల్లో నిద్రపోతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, మహిళా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నేతలు, జిల్లా, మండల స్థాయి ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

- పాల్గొన్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



**ఖమ్మం జిల్లా,** రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారే ఆదినారాయణ గారు స్పష్టం చేశారు, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని, పంట దిగుబడుల్లో నేల ఆరో గ్యం కీలకపాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు, రాష్ట్రవ్యాప్తంగా రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంతో పాటు భూసార ఆరోగ్య పరిరక్షణ, రసాయన ఎరువుల వినియోగం తగ్గింపు లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను అందిస్తోందని ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ వెల్లడించింది. ఇందులో భాగంగా అశ్వారావుపేట నియోజకవర్గం, దమ్మపేట మండల హెడ్‌క్వార్టర్స్‌లో వ్యవసాయ శాఖ మరియు సహకార శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గారు ముఖ్య అతిథిగా హాజరై, ఆయన చేతుల మీదుగా రైతులకు రాయితీపై పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం పచ్చిరొట్ట పంటల సాగు ద్వారా భూసార ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, భూమిలో సేంద్రియ కర్బనాన్ని పెంపొందించడంతో పాటు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించడంలో పచ్చిరొట్ట పంటలు ఎంతో దోహదపడతాయన్నారు. రైతులందరూ భూసార పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచిస్తూ జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట విత్తనాలను ప్రభుత్వం అందిస్తున్న 50 శాతం సబ్సిడీని ఉపయోగించుకుని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికా రులు రైతులకు ఈ పచ్చిరొట్ట విత్తనాల ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కల్పించి, విత్తనాల పంపిణీని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గారు అధికారులను ఆదేశించారు.

# హైదరాబాద్ లో మరో కొత్త జిసిసి కేంద్రం

- ముందుకొచ్చిన రీజెనరాన్
- అత్యున్నత స్థాయి మౌలిక సదుపాయాలు



**హైదరాబాద్,** ప్రతిభావంతులతో కూడి ట్యాలెంట్ పూల్ అందుబాటులో ఉండటం వల్ల ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు తమ గ్లోబల్ సామర్థ్య కేంద్రాల (జిసిసి) ఏర్పాటుకు హైదరాబాద్ ను ఎంపిక చేసుకుంటున్నాయిని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. జిసిసిల రాకతో మన ఐటి ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని ఆయన అన్నారు. న్యూయార్క్ లోని ట్యారిటౌన్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న బయోటెక్ దిగ్గజం రీజెనరాన్ అమెరికా వెలుపల మొదటి జిసిసిని ఏర్పాటు చేయడానికి తెలంగాణా రాష్ట్రాన్ని ఎంపిక చేసుకోవడం మన ప్రతిష్ఠను మరింత పెంచుతుందని ఆయన సంతోషం వ్యక్తం చేసారు. రీజనరాన్ సీనియర్ వైస్ ప్రెసిడెండ్ బ్యారీ కోవల్ ఆధ్వర్యంలో ఓ ప్రతినిధి బృందం మంగళవారం నాడు డా. బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో బేటీ అయింది. ఈ సందర్భంగా మంత్రి సమక్షంలో జిసిసి ఏర్పాటుకు సంబంధించి బ్యారీ కోవల్. తెలంగాణా లైఫ్ సైన్సెస్ సిఇఓ సర్వేశ్ సింగ్ లు అవగాహన పత్రాల (ఎంఓయు)ను మార్చుకున్నారు. అనంతరం శ్రీధర్ బాబు మాట్లాడుతూ రెజెనరాన్‌కు ఐర్లాండ్, యూకే, జర్మనీ, నెదర్లాండ్స్ వంటి దేశాల్లో కార్యాలయాలు, ఉత్పత్తి కేంద్రాలు ఉన్నప్పటికీ, హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నజిసిసి ప్రత్యేకమైన గ్లోబల్ హబ్‌గా పనిచేస్తుందని తెలిపారు.. ఇది ప్రపంచవ్యాప్తంగా సంస్థ కార్యకలాపాలను సమన్వయం చేస్తూ క్లినికల్ ట్రయల్స్ నిర్వహణ, అధునాతన డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇంజినీరింగ్, కమర్షియల్ అనలిటిక్స్ వంటి అత్యున్నత స్థాయి డిజిటల్ సేవలను అందిస్తుందని చెప్పారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో దాదాపు 450 గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు పనిచేస్తుండగా, మరిన్ని అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులకు ముందుకు వస్తున్నాయని శ్రీధర్ బాబు తెలిపారు. జిసిసి ల కేంద్రంగా ముంబయి, ఢిల్లీ, చెన్నైలను అధిగమించి హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచిందని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, డిజిటల్ టెక్నాలజీల రంగాల్లో ఉన్న బలమైన ఎకోసిస్టం ప్రపంచ కంపెనీలను ఆకర్షిస్తోందన్నారు. ఈ సమావేశంలో రెజెనెరాన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బ్యారి కోవాల్, రెజెనెరాన్ జీసీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజీవ్ ఓనాట్, సంస్థ ప్రతినిధులు, పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# వర్కింగ్ ఉమెన్స్ భద్రత ప్రభుత్వ బాధ్యత

- బంజారాహిల్స్‌లో వర్కింగ్ ఉమెన్ హాస్టల్, సఖి కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి సీతక్క



**హైదరాబాద్, :** మహిళా వారోత్సవాల్లో భాగంగా హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నెంబర్-12లో నిర్మించిన వర్కింగ్ ఉమెన్ హాస్టల్ "సఖి నివాస్", వన్ స్టాప్ సెంటర్ "సఖి కేంద్రం"ను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం హైదరాబాద్‌కు వచ్చే మహిళలకు సురక్షిత వసతి కల్పించేందుకు ప్రభుత్వం వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లను ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ హాస్టల్‌లో సుమారు 150 మంది మహిళలకు వసతి సౌకర్యం కల్పించామని తెలిపారు. చిన్న పిల్లలతో వచ్చే తల్లులు కూడా ఇక్కడే బస చేసే విధంగా ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మహిళల భద్రత, గౌరవం, ఆత్మవిశ్వాసం, ఆర్థిక స్వావలంబన కోసం తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. మహిళలు ఎదుగుతుంటే కొందరు సహించలేక విమర్శలు చేస్తున్నారని, కానీ మహిళల శక్తి ముందు అలాంటి విమర్శలు నిలవవని అన్నారు. మహిళా అభ్యున్నతిని ఓర్చుకోలేని విపక్షాలకు మహిళలే తగిన బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, చైల్డ్ కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, చైల్డ్ రైట్స్ కమిషన్ సభ్యులు బండి అపర్ణ, వందన గౌడ్ మరిపల్లి చందన, సరిత, ప్రేమ్ లత అగర్వాల్, ఉమెన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

# సౌకర్యాల లేమితో బాలికలుచదువును మానేయకూడదు

- శానిటరీ న్యాప్ కిన్లు, ప్రత్యేక మరుగుదొడ్ల కొరతపై సుప్రీంకోర్టు ఆందోళన
- ఆదేశాల అమలుపై ప్రతి మూడు నెలలకొకసారి పర్యవేక్షణ
- ఆగస్టు 15లోగా రిపోర్టులు ఇవ్వాలని రాష్ట్రాలకు డెడ్లైన్‌లి

**హైదరాబాద్, :** పాఠశాలల్లో శానిటరీ న్యాప్కిన్లు, నీటి సదుపాయం ఉన్న ప్రత్యేక మరుగుదొడ్లు అందుబాటులో లేవనే కారణంతో బాలికలు తమ చదువును మధ్యలోనే ఆపేయకూడదని సుప్రీంకో ర్టు స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో తాము గతంలో ఇచ్చిన ఆదేశాలను కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో అమ లయ్యేలా చూడాలని ఆదేశించింది. పాఠశాలల్లో బాలికలకు ఉచితంగా శానిటరీ న్యాప్కిన్లు, ప్రత్యేక మరుగుదొడ్లు అందుబాటులో ఉంచాలని ఈ ఏడాది జనవరి 30న సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పు రాష్ట్రాల్లో ఎంతవ రకు అమలవుతుందో సమీక్షించడానికి సోమవారం కోర్టు విచారణ చేపట్టిం ది. ఈ సందర్భంగా కేంద్రప్రభుత్వం కేవలం గత రెండు, రెండున్నర నెలల డేటాను మాత్రమే సేకరించామని చెప్పడంతో, కోర్టు ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించింది. ఈ సందర్భంగా జస్టిస్ జేబీ పార్టీవా లా, జస్టిస్ ఆర్. మహాదేవన్తో కూడిన ధర్మాసనం సోమవారం కేంద్రానికి పలు సూచనలు చేసింది. "ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి. ఈ తీర్పు బాలికల శ్రేయస్సు కోసమే. కేవలం ఈ సౌకర్యాలు లేవనే కారణంతో బాలికలు చదువు మానేసి, ఇండ్లకే పరిమితమై గృహ పనుల్లో మునిగిపోకూ డదు. మా తీర్పు ద్వారా లభించే ప్రయోజనాలు వీలైనంత వరకు అందరికీ అందేలా చూడటం మీ బాధ్యత. రాష్ట్రాల నుంచి క్రమం తప్పకుండా అవస రమైన డేటాను సేకరిస్తూ, వారికి తగిన గైడెన్స్ అందించడి" అని పేర్కొంది.

### - నోడల్ డిపార్ట్మెంట్ గా కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ

ఈ ఆదేశాల అమలును తాము ప్రతి మూడు నెలలకొకసారి స్వయంగా పర్యవే క్షిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. అందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం ప్రతి మూడునెలలకొకసారి దీనిపై రిపోర్టును సమర్పించాల్సి ఉంటుంది. ఈ వ్యవహా రంలో తదుపరి నివేదికల సమర్పణకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖను నోడల్ డిపార్ట్మెంట్ గా కోర్టు ప్రకటించింది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమ తాజా రిపోర్టులను ఆగస్టు 15 లోగా కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాలని కోర్టు ఆదేశించింది.



నివేదికల సమర్పణలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని హెచ్చరించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 1 కి వాయిదా వేసింది.

### - మెన్ స్ట్రువల్ హెల్త్ జీవించే హక్కులో భాగం

రాజ్యాంగంలోని ఆర్టికల్ -21 ప్రకారం ప్రతి ఒక్కరికి ఆరోగ్యంగా జీవించే హక్కు ఉందని సుప్రీంకోర్టు తెలిపింది. బాలికలకు మెన్స్ట్రువల్ హెల్త్, పరిశు భ్రత కల్పించడం కూడా ఇందులో భాగమేనని స్పష్టం చేసింది. ఈ వసతులు లేకపోవడం వల్ల బాలికలు చదువులో వెనుకబడిపోతున్నారని, భవిష్యత్తులో వారు అన్ని రంగాలలో వెనుకబడిపోయే ప్రమాదం ఉందని కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది.

# కోహ్లీ సరికొత్త రికార్డు..



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్, రన్ మెషిన్ విరాట్ కోహ్లీ ఖాతాలో మరో అద్భుతమైన మైలురాయి చేరింది. ఐపీఎల్ ప్రారంభమైన 2008 సీజన్ నుంచి ఆర్‌సీబీ జట్టుకు నమ్మకమైన పిల్లర్‌గా నిలిచిన కోహ్లీ, ఐపీఎల్ 2026 క్వాలిఫైయర్ 1 మ్యాచ్ ద్వారా సరికొత్త చరిత్ర సృష్టించాడు. మే 26న ధర్మశాల వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరుగుతున్న ఈ కీలక పోరులో బరిలోకి దిగడం ద్వారా, ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ప్లేఆఫ్స్ మ్యాచ్‌లు ఆడిన దిగ్గజాల సరసన కోహ్లీ చోటు సంపాదించుకున్నాడు.ఐపీఎల్ చరిత్రను తిరగేస్తే విరాట్ కోహ్లీ పేరిట లేని రికార్డు అంటూ లేదు. ఈ మెగా టోర్నీలో ఇప్పటివరకు అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా కోహ్లీనే అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అతను మొత్తం 9218 పరుగులు చేసి ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచాడు. అంతేకాదు, ఐపీఎల్‌లో అత్యధిక హాఫ్ సెంచరీలు (76 హాఫ్ సెంచరీలు) చేసిన రికార్డు కూడా కోహ్లీ పేరిటే ఉంది. అతని తర్వాత డేవిడ్ వార్నర్ ఉండగా, ప్రస్తుతం ఆడుతున్న యాక్టివ్ ప్లేయర్లలో కేఎల్ రాహుల్ 51 హాఫ్ సెంచరీలతో రెండో స్థానంలో ఉన్నాడు. ఈ గణాంకాలే ఐపీఎల్‌లో కోహ్లీ సృష్టించిన సామ్రాజ్యానికి అద్దం పడుతున్నాయి.తాజాగా గుజరాత్ టైటాన్స్‌తో జరుగుతున్న క్వాలిఫైయర్ 1 మ్యాచ్‌తో కలిపి విరాట్ కోహ్లీ తన కెరీర్‌లో 18వ ఐపీఎల్ ప్లేఆఫ్ మ్యాచ్ ఆడుతున్నాడు. దీనితో అతను శిఖర్ ధావన్, దినేష్ కార్తీక్, కీరన్ పొలార్డ్ వంటి దిగ్గజాల రికార్డును సమం చేశాడు. ఐపీఎల్ ప్లేఆఫ్స్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా చెన్నై సూపర్ కింగ్స్ మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ 28 మ్యాచ్‌లతో టాప్‌లో ఉన్నాడు. ఆ తర్వాతి స్థానాల్లో రవిచంద్రన్ అశ్విన్ (24 మ్యాచ్‌లు), సురేష్ రైనా (24 మ్యాచ్‌లు), రోహిత్ శర్మ (23 మ్యాచ్‌లు), అంబటి రాయుడు (23 మ్యాచ్‌లు), రవీంద్ర జడేజా (23 మ్యాచ్‌లు), డ్వేన్ బ్రావో (19 మ్యాచ్‌లు) ఉన్నారు. ఇప్పుడు వారి వెనుకే విరాట్ కోహ్లీ కూడా చేరిపోయాడు. ఐపీఎల్ నాకౌట్ స్టేజ్‌లో విరాట్ కోహ్లీ ప్రదర్శనపై భిన్నమైన రికార్డులు ఉన్నాయి. ఆర్‌సీబీ తరఫున అతను ఇప్పటివరకు 4 ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌లు ఆడాడు. ఫైనల్స్ లో కోహ్లీ 34.75 సగటుతో, 126.36 స్ట్రైక్ రేట్‌తో పర్వాలేదనిపించేలా రాణించాడు. అయితే ఎలిమినేటర్ మ్యాచ్‌ల విషయానికి వస్తే మాత్రం కోహ్లీ ట్రాక్ రికార్డు అంత ఆశాజనకంగా లేదు. ఆడిన 5 ఎలిమినేటర్ మ్యాచ్‌లలో అతను కేవలం 23.00 సగటు, 108.49 పేలవమైన స్ట్రైక్ రేట్‌తో పరుగులు చేశాడు. ఈ స్లో బ్యాటింగ్ కారణంగా గతంలో ఆర్‌సీబీ కొన్ని కీలక మ్యాచ్‌లలో ఓటమి పాలుకావాల్సి వచ్చింది. పాత రికార్డులు ఎలా ఉన్నప్పటికీ, ప్రస్తుత ఐపీఎల్ 2026 సీజన్‌లో మాత్రం విరాట్ కోహ్లీ వీరవిహారం చేస్తున్నాడు. ఈ సీజన్‌లో ఆడిన 14 లీగ్ మ్యాచ్‌లలో అతను 50కి పైగా అద్భుతమైన సగటుతో, 162.03 స్కై-హై స్ట్రైక్ రేట్‌తో పరుగుల వరద పారించాడు. ఆర్‌సీబీ జట్టు వరుస విజయాలతో ప్లేఆఫ్స్ క్వాలిఫైయర్ 1 కి చేరుకోవడంలో కోహ్లీ బ్యాటింగే ప్రధాన బలమైంది. ఇదే ఫామ్‌ను గుజరాత్‌పై కూడా కొనసాగించి, ఆర్‌సీబీని ఫైనల్‌కు చేర్చడమే లక్ష్యంగా కింగ్ కోహ్లీ బరిలోకి

# రియాన్ పరాగ్, వైభవ్ సూర్యవంశీ మధ్య కోల్డ్ వార్..



ఐపీఎల్ 2026 ప్లేఆఫ్స్ ఉత్కంఠ రేపుతున్న వేళ రాజస్థాన్ రాయల్స్ క్యాంప్‌లో తీవ్ర కలకలం రేగింది. మైదానంలో పరుగుల వరద పారిస్తున్న సంచలన బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ, జట్టు కెప్టెన్ రియాన్ పరాగ్ మధ్య విభేదాలు భగ్గుమన్నట్లు సోషల్ మీడియాలో ఒక వీడియో వైరల్‌గా మారింది. ముంబై విమానాశ్రయంలో ఇద్దరు ఆటగాళ్ల మధ్య జరిగిన ఈ ఆసక్తికర ఘటనే ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్, గుజరాత్ టైటాన్స్ తర్వాత ఈ ఏడాది ప్లేఆఫ్స్ చేరిన నాలుగో జట్టుగా రాజస్థాన్ రాయల్స్ నిలిచింది. బుధవారం న్యూ చండీగఢ్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరగబోయే ఎలిమినేటర్ మ్యాచ్ కోసం జట్టు ముంబై నుంచి చండీగఢ్‌కు విమానంలో ప్రయాణమైంది. లీగ్ దశ చివరి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌ను ఓడించిన ఉత్సాహంలో ఉన్న రాయల్స్ ఆటగాళ్లు విమానాశ్రయానికి చేరుకున్నప్పుడు ఈ వివాదం చోటుచేసుకుంది. ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆటగాళ్ల ఫోటోలను తీసేందుకు మీడియా ప్రతినిధులు, ఫోటోగ్రాఫర్లు ఎగబడ్డారు. ఈ క్రమంలో ఒక ఫోటోగ్రాఫర్ కెప్టెన్ రియాన్ పరాగ్, యువ సంచలనం వైభవ్ సూర్యవంశీలను కలిసి ఒక ఫోటో ఇవ్వాల్సిందిగా కోరాడు. దీనికి పరాగ్ తనదైన శైలిలో స్పందిస్తూ, “మేమేమీ సినిమా స్టార్లం కాదు” అంటూ ఫోటో ఇవ్వడానికి నిరాకరించాడు. పరాగ్ చేసిన ఈ వ్యాఖ్య పక్కనే ఉన్న 15 ఏళ్ల వైభవ్‌కు నచ్చలేదు. దాంతో ఆయన తన కెప్టెన్‌ను ఎంతో సీరియస్‌గా, కోపంగా చూస్తూ ఉండిపోయాడు.

# పంజాబ్ కింగ్స్‌కు శ్రేయస్ అయ్యర్ గుడ్ బై..



ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ ప్రయాణం విచిత్రంగా ముగిసింది. తిరుగులేని ఆధిపత్యంతో ఆరంభంలో వరుసగా 7 మ్యాచ్‌ల్లో 6 విజయాలు సాధించి సరికొత్త చరిత్రను లిఖించిన పంజాబ్.. ఆ తర్వాత వరుసగా 6 మ్యాచ్‌ల్లో ఓడి ప్లే ఆఫ్స్ చేరకుండానే ఇంటిదారి పట్టింది.ఆఖరి లీగ్ మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌పై అద్వితీయమైన విజయాన్ని అందుకున్నా.. ప్లేఆఫ్స్ బెర్త్‌ను దక్కించుకోలేకపోయింది. పంజాబ్ ఆశలను ముంబై ఇండియన్స్ చిదిమేసింది. రాజస్థాన్ రాయల్స్ చేతిలో ముంబై ఓడిపోవడంతో పంజాబ్ ఇంటిబాట పట్టింది.అయితే ఈ సీజన్ వైఫల్యం నేపథ్యంలో పంజాబ్ కింగ్స్‌కు శ్రేయస్ అయ్యర్ గుడ్‌బై చెబుతాడనే ప్రచారం జోరు అందుకుంది. ఈ సీజన్‌ను ఉద్దేశించి అయ్యర్ చేసిన ట్వీట్ ఈ ప్రచారానికి బలం చేకూర్చుతుంది. ఈ సీజన్‌లో అయ్యర్ అటు బ్యాటర్‌గా.. ఇటు కెప్టెన్‌గా సత్తా చాటాడు. కానీ ఆశించిన ఫలితాన్నిఅందించలేకపోయాడు. మూడు రోజుల తర్వాత పంజాబ్ నిష్క్రమణపై శ్రేయస్ అయ్యర్ స్పందించాడు.'ప్రతీ పరుగు.. ప్రతీ క్షణం.. ప్రతీ పోరాట.. ఈ అధ్యాయం కృతజ్ఞతతో ముగిసింది. ఆకలి, కసితో తదుపరి అధ్యాయం మొదలవుతుంది.' శ్రేయస్ అయ్యర్ ట్వీట్ చేశాడు. అధ్యాయం ముగిసిందని పేర్కొనడంతో పంజాబ్‌కు వీడ్కోలు పలుకుతున్నాడా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.అయితే అలాంటిది ఏం లేదని, తదుపరి సీజన్‌కు రెట్టించిన ఉత్సాహం, ఆత్మవిశ్వాసంతో తిరిగి వస్తామని అయ్యర్ చెప్పకనే చెప్పాడని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కాగా ఈ సీజన్‌లో 14 మ్యాచ్‌లు ఆడిన అయ్యర్ 498 పరుగులు చేశాడు. తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో అజేయ శతకంతో చెలరేగాడు. ఐపీఎల్ 2025 మెగా వేలంలో పంజాబ్ కింగ్స్ రూ.26.75 కోట్ల భారీ ధరకు శ్రేయస్ అయ్యర్‌ను కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. అందుకు తగ్గట్లుగానే అయ్యర్ సత్తా చాటాడు. దశాబ్దకాలం తర్వాత పంజాబ్ కింగ్స్‌ను ఫైనల్ చేర్చాడు. ఫైనల్లో ఆర్‌సీబీ చేతిలో ఓడి తృటిలో టైటిల్ చేజార్చుకున్నాడు. పంజాబ్ కింగ్స్‌ను వెనక్కి నెట్టి ప్లే ఆఫ్స్ చేరిన రాజస్థాన్ రాయల్స్.. మంగళవారం సన్‌రైజర్స్ హైదరాబాద్ ఎలిమినేటర్ మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు క్వాలిఫయర్-2కు అర్హత సాధించనుంది.

# నేడు సన్‌రైజర్స్, రాజస్థాన్ మధ్య పోరు



ఇక తప్పులు చేయడానికి అస్సలు ఛాన్స్ లేదు. ఓడిపోతే లగేజ్ సర్దుకుని ఇంటికి వెళ్లడమే. ఐపీఎల్ 2026 సీజన్ అత్యంత ఉత్కంఠభరితమైన ముగింపు దశకు చేరుకుంది. లీగ్ దశలో అద్భుత ప్రదర్శన చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ జట్లు ఇప్పుడు ఎలిమినేటర్ పోరులో ముఖాముఖి తలపడేందుకు సిద్ధమయ్యాయి. లీగ్ పట్టికలో మూడో స్థానంలో నిలిచిన పాట్ కమిన్స్ సారథ్యంలోని సన్‌రైజర్స్ హైదరాబాద్, నాలుగో స్థానాన్ని దక్కించుకున్న రియాన్ పరాగ్ నేతృత్వంలోని రాజస్థాన్ రాయల్స్ మధ్య ఈ హై-వోల్టేజ్ ఎలిమినేటర్ మ్యాచ్ నేటి రాత్రి జరగనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు క్వాలిఫైయర్ 2కు అర్హత సాధిస్తుంది. ఓడిన జట్టు టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. ఈ సీజన్ లీగ్ దశలో రాజస్థాన్‌పై సన్‌రైజర్స్ పూర్తి ఆధిక్యాన్ని ప్రదర్శించింది. ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ హైదరాబాద్ జట్టు విజయం సాధించడంతో మానసికంగా సన్‌రైజర్స్ బలంగా ఉంది. అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్ వంటి విధ్వంసకర బ్యాటర్లతో హైదరాబాద్ బ్యాటింగ్ లైన్ అప్ పటిష్టంగా కనిపిస్తోంది. మరోవైపు యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్ ఫామ్‌లోకి రావడం రాజస్థాన్ రాయల్స్‌కు కలిసొచ్చే అంశం. అయితే, ముల్లన్‌పూర్ మైదానంలో రాజస్థాన్ జట్టుకు మంచి రికార్డు ఉంది. ఈ సీజన్‌లో ఇక్కడ ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ రాజస్థాన్ విజయం సాధించడం విశేషం. ఈ హై-వోల్టేజ్ మ్యాచ్‌కు వేదికైన మహారాజా యాదవీంద్ర సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం (ముల్లన్‌పూర్) బ్యాటింగ్‌కు స్వర్గధామంగా పేరుగాంచింది. ఈ సీజన్‌లో ఇక్కడ జరిగిన మ్యాచ్‌లలో బ్యాటర్లు పరుగుల వరద పారించారు. చిన్న బౌండరీలు, వేగవంతమైన ఔట్‌ఫీల్డ్ కారణంగా బంతి క్షణాల్లో సరిహద్దులు దాటుతోంది. ఇప్పటికే ఈ మైదానంలో 220కి పైగా భారీ స్కోర్లు కూడా ఎంతో సులువుగా ఛేజ్ అయ్యాయి. మ్యాచ్ ప్రారంభంలో పేస్ బౌలర్లకు కాస్త స్వింగ్ లభించినప్పటికీ, సమయం గడిచేకొద్దీ పిచ్ పూర్తిగా బ్యాటింగ్‌కు అనుకూలిస్తుంది. ఇక్కడ టాస్ గెలిచిన జట్టు మొదట బౌలింగ్ ఎంచుకుని, రాత్రి వేళ చేజింగ్ వైపు మొగ్గు చూపే అవకాశం స్పష్టంగా ఉంది. ఐపీఎల్ చరిత్రలో ఈ రెండు జట్ల మధ్య రికార్డులను పరిశీలిస్తే సన్‌రైజర్స్ హైదరాబాద్ స్పష్టమైన ఆధిక్యంలో కనిపిస్తోంది. ఇరు జట్లు ఇప్పటివరకు 23 మ్యాచ్‌ల్లో ముఖాముఖి తలపడగా, అందులో సన్‌రైజర్స్ ఏకంగా 14 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. రాజస్థాన్ రాయల్స్ కేవలం 9 మ్యాచ్‌ల్లో మాత్రమే గెలుపొందింది. అంతేకాదు, ఈ 2026 సీజన్ లీగ్ దశలో జరిగిన రెండు మ్యాచ్‌ల్లోనూ పాట్ కమిన్స్ నేతృత్వంలోని హైదరాబాద్ జట్టు రాజస్థాన్‌ను చిత్తు చేయడం విశేషం. హైదరాబాద్‌లో జరిగిన మ్యాచ్‌లో 57 పరుగుల తేడాతో, జైపూర్‌లో జరిగిన మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో సన్‌రైజర్స్ ఘనవిజయం సాధించి మానసికంగా బలంగా ఉంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు ఓపెనర్లు అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ లతో పాటు ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్ రూపంలో విధ్వంసకర బ్యాటింగ్ లైన్ అప్ ఉంది. ముఖ్యంగా క్లాసెన్ ఈ సీజన్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. బౌలింగ్‌లో ఇషాన్ మలింగ వికెట్ల వేట కొనసాగిస్తున్నాడు. మరోవైపు రాజస్థాన్ రాయల్స్ జట్టు 15 ఏళ్ల సంచలన కుర్రాడు వైభవ్ సూర్యవంశీపై భారీగా ఆశలు పెట్టుకుంది. జైపూర్‌లో హైదరాబాద్‌పై కేవలం 36 బంతుల్లోనే శతకం బాదిన సూర్యవంశీ ఈ మ్యాచ్‌లోనూ కీలకం కానున్నాడు. అతనికి తోడుగా యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్, రియాన్ పరాగ్ లతో రాజస్థాన్ బ్యాటింగ్ బలంగా ఉంది. బౌలింగ్‌లో జోఫ్రా ఆర్చర్ పవర్‌ప్లేలో వికెట్లు తీయడంపైనే రాజస్థాన్ గెలుపు అవకాశాలు ఆధారపడి ఉన్నాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ దూకుడుకు, రాజస్థాన్ రాయల్స్ వ్యూహాత్మక ఆటతీరుకు మధ్య జరగబోయే ఈ పోరు క్రికెట్ ప్రేమికులకు కంటిమీద కునుకు లేకుండా చేయడం ఖాయం. పంజాబ్ పిచ్‌పై మొదట్లో పేసర్లకు స్వింగ్ లభించే అవకాశం ఉన్నందున టాస్ గెలిచిన జట్టు మొదట బౌలింగ్ ఎంచుకునే అవకాశం ఉంది.

# అర్ష్‌దీప్ సింగ్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఊహించని పరిణామం!



భారత క్రికెట్ జట్టు యువ పేసర్, పంజాబ్ కింగ్స్ ఆటగాడు అర్ష్‌దీప్ సింగ్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో జరిగిన ఒక ఊహించని పరిణామం ఇప్పుడు క్రీడా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మైదానంలోనే కాకుండా సామాజిక మాధ్యమాల్లోనూ ఎంతో చురుగ్గా ఉంటూ అభిమానులను అలరించే ఈ స్పీడ్‌స్టర్, తాజాగా తన ఖాతా నుంచి ఏకంగా 200కు పైగా పోస్టులను తొలగించి అందరికీ పెద్ద షాక్ ఇచ్చాడు. క్రికెట్ ప్రపంచంలో అర్ష్‌దీప్ సింగ్ ఆటతీరుతో పాటు ఆయన చేసే వినోదాత్మక వీడియోలకు, రీల్స్‌కు విపరీతమైన ఆదరణ ఉంది. తీరిక సమయం దొరికినప్పుడల్లా తోటి ఆటగాళ్లతో కలిసి సరదాగా వీడియోలు చేస్తూ అభిమానులతో పంచుకోవడం ఆయనకు అలవాటు. అయితే, తాజాగా ఆయన తన ఇన్‌స్టాగ్రామ్ పేజీని పూర్తిగా ప్రక్షాళన చేశాడు. ప్రస్తుతం ఆయన ఖాతాలో కేవలం 44 పోస్టులు మాత్రమే మిగిలాయి. అందులోనూ ఎక్కువ భాగం వివిధ వ్యాపార ప్రకటనలకు సంబంధించినవే కావడం గమనార్హం. గత ఏడాది డిసెంబర్ నెలలో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీతో కలిసి అర్ష్‌దీప్ చేసిన ఒక ప్రత్యేక వీడియో సామాజిక మాధ్యమాల్లో సంచలనం సృష్టించింది. దాదాపు 15 మిలియన్లకు పైగా వీక్షణలు (వ్యూస్) సాధించిన ఆ అరుదైన వీడియోను సైతం అర్ష్‌దీప్ ఇప్పుడు తొలగించాడు. దీంతో ఆరాధ్య ఆటగాడికి అసలు ఏమైంది ఎందుకిలా పాత జ్ఞాపకాలన్నింటినీ చెరిపేస్తున్నాడంటూ అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీని వెనుక బలమైన కారణాలే ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. గత కొన్ని రోజులుగా అర్ష్‌దీప్ సోషల్ మీడియాలో ఏ పోస్ట్ పెట్టినా అది కాస్తా వివాదాలకు దారితీస్తోంది. కొద్దిరోజుల క్రితం ఆయన విమాన ప్రయాణంలో ఉన్నప్పుడు తీసిన ఒక వీడియో తీవ్ర దుమారం రేపింది. ఆ వీడియోలో తోటి ఆటగాడు యుజ్వేంద్ర చాహల్ ఈ-సిగరెట్ (వేపింగ్) కాలుస్తూ కెమెరాకు దొరికిపోయాడు. ఈ సంఘటన క్రీడా వర్గాల్లో తీవ్ర విమర్శలకు దారితీయడంతో, భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తీవ్రంగా స్పందించింది. లీగ్ మ్యాచ్‌లు ముగిసేవరకు సోషల్ మీడియాలో ఎలాంటి వీడియోలు చేయకూడదంటూ అర్ష్‌దీప్‌ను గట్టిగా హెచ్చరించినట్లు సమాచారం. ఇదిలా ఉండగానే, ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌కు ముందు అర్ష్‌దీప్ పంచుకున్న మరో వీడియో వివాదాన్ని మరింత పెద్దది చేసింది.

# ఐపీఎల్ 2016 మ్యాజిక్ రిపీట్ అవుతుందా..?

ఐపీఎల్ 2026 లీగ్ స్టేజ్ మ్యాచ్‌లు ముగిసి ప్లేఆఫ్స్ సమరానికి తెరలేవడంతో క్రికెట్ లవర్స్ ఫైనల్ పోరు కోసం మరింత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో నిలిచి ఎలిమినేటర్ మ్యాచ్ ఆడేందుకు సిద్ధమైంది. ఈ సందర్భంలో ప్రతి ఒక్కరికీ పదేళ్ల కిందట ఆరెంజ్ ఆర్మీ సృష్టించిన ఒక అద్భుతమైన రికార్డు గుర్తుకు వస్తోంది. ఐపీఎల్ చరిత్రలో ఎలిమినేటర్ నుంచి వచ్చి కప్ కొట్టిన ఏకైక జట్టుగా హైదరాబాద్‌కు ఒక ప్రత్యేకమైన రికార్డు ఉంది. అయితే ఆ సీజన్‌లో హైదరాబాద్ ఎవరితో గెలిచింది, అసలు ఆ ప్లేఆఫ్స్ లెక్కలు ఏంటి, ఎవరెవరిని ఓడించుకుంటూ వచ్చి ఛాంపియన్‌గా నిలిచింది . ఐపీఎల్ 2016లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టును ఆస్ట్రేలియా స్టార్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ తన అద్భుత కెప్టెన్సీతో ముందుండి నడిపించాడు. కేవలం కెప్టెన్‌గానే కాకుండా ఆ సీజన్‌లో బ్యాట్‌తోనూ రికార్డు స్థాయి పరుగులతో వార్నర్ చెలరేగిపోయాడు. ఆ ఏడాది లీగ్ దశ ముగిసేసరికి హైదరాబాద్ జట్టు పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో నిలిచింది. దీంతో ఫైనల్‌కు వెళ్లడానికి కేవలం ఒకే ఒక్క అవకాశం ఉండే అత్యంత కష్టమైన ఎలిమినేటర్ దారిలో సన్‌రైజర్స్ ప్రయాణం మొదలైంది.2016 ప్లేఆఫ్స్‌లో భాగంగా హైదరాబాద్ జట్టు తన మొదటి మ్యాచ్‌ను దిల్లీ వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో ఆడింది. ఈ చావో రేవో ఎలిమినేటర్ పోరులో మొదట బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 162 పరుగులు చేసింది. యువరాజ్ సింగ్ వేగంగా 44 పరుగులు చేసి జట్టుకు మంచి స్కోరు అందించాడు. ఆ తర్వాత లక్ష్య ఛేదనలో కోల్‌కతాను భువనేశ్వర్ కుమార్, హెన్రిక్స్‌ల బౌలింగ్‌తో కట్టడి చేసిన హైదరాబాద్ జట్టు, కేకేఆర్‌ను 140 పరుగులకే పరిమితం చేసింది. 22 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి క్వాలిఫైయర్-2లోకి అడుగు పెట్టింది.కోల్‌కతాను ఓడించిన జోష్‌లో ఉన్న హైదరాబాద్‌కు క్వాలిఫైయర్-2లో సురేష్ రైనా నేతృత్వంలోని గుజరాత్ లయన్స్ జట్టు ఎదురైంది. దిల్లీలోనే జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ లయన్స్ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లకు 162 పరుగులు చేసింది. ఆ తర్వాత 163 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్ జట్టు ఒక దశలో 117 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి తీవ్రమైన ఒత్తిడిలో పడింది. కానీ కెప్టెన్ డేవిడ్ వార్నర్ ఒంటి పోరాటం చేస్తూ 58 బంతుల్లోనే 93 పరుగులు చేసి, మరో 4 బంతులు మిగిలి ఉండగానే జట్టును గెలిపించి ఫైనల్ బెర్త్ ఖరారు చేశాడు.ఇక 2016 మే 29న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన ఫైనల్ మ్యాచ్ ఐపీఎల్ చరిత్రలోనే ఒక క్లాసిక్‌గా నిలిచిపోయింది. విరాట్ కోహ్లీ భీకరమైన ఫామ్‌లో ఉన్న ఆర్సీబీని వారి సొంత మైదానంలో ఢీకొట్టడం అంటే అప్పట్లో మామూలు విషయం కాదు.

ఈ హైవోల్టేజ్ ఫైనల్ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు డేవిడ్ వార్నర్, బెన్ కటింగ్‌ల మెరుపులతో ఏకంగా 208 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఉత్కంఠ పోరులో చివరకు భువనేశ్వర్ కుమార్ అద్భుత బౌలింగ్‌తో ఆర్సీబీని కట్టడి చేసి 8 పరుగుల తేడాతో చరిత్రాత్మక విజయాన్ని, మొదటి ఐపీఎల్ ట్రోఫీని అందించాడు.అయితే పదేళ్ల తరువాత మళ్ళీ హైదరాబాద్ జట్టు అలాంటి పరిస్థితుల్లోనే ఫైనల్ సమరానికి సిద్ధమవ్వడం విశేషం.

బుధవారం,
మే 27, 2026
పీపుల్స్ న్యూస్ దినపత్రిక





# 'యల్లమ్మ'కు అందుకే ఓకే చెప్పా..

## దేవి శ్రీ ప్రసాద్ స్పెషల్ వీడియో

ప్రముఖ సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ నటుడిగా అరంగేట్రం చేయనున్న సంగతి తెలిసిందే. వేణు యెల్దండి దర్శకత్వంలో 'యల్లమ్మ' అనే చిత్రంలో ఆయన హీరోగా నటిస్తున్నారు. అయితే, ఒక అగ్ర సంగీత దర్శకుడిగా ఉండి నటన వైపు ఎందుకు అడుగులు వేశారనే దానిపై డీఎస్పీ స్వయంగా స్పందించారు. తను ఈ సినిమా చేయడానికి అంగీకరించడం వెనుక ఉన్న అసలు కారణాన్ని మంగళవారం వెల్లడించారు.

ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఓ ప్రత్యేక వీడియోను పంచుకున్నారు. తన తండ్రి స్వగ్రామమైన వెదురుపాకలో తాను పర్యటించిన దృశ్యాలను అందులో చూపించారు. "చిన్నప్పటి నుంచి జానపద కళల పట్ల నాలో ఆసక్తిని నింపిన అద్భుతమైన సంప్రదాయాలు, సంస్కృతి ఇదే. మా ఊరిలో జరిగే 'అమ్మోరు జాతర' వేడుకలు నాపై తీవ్ర ప్రభావం చూపాయి. 'యల్లమ్మ'కు నేను ఎందుకు ఓకే చెప్పానో ఇదే కారణం" అని డీఎస్పీ పోస్ట్‌లో పేర్కొన్నారు. చిన్నప్పుడు తన తండ్రి తమను చెన్నై నుంచి తరచూ ఈ గ్రామానికి తీసుకొచ్చేవారని, ఇక్కడి ప్రకృతి స్వచ్ఛతను ఆస్వాదించేలా చేశారని డీఎస్పీ గుర్తుచేసుకున్నారు. "మా మూలాలతో, మా వాళ్లతో సంబంధం కొనసాగేందుకు మేం ఇక్కడ అందమైన ఇల్లు కట్టుకున్నాం. సంస్కృతి, జానపద కళలు, దైవత్వం వంటి గొప్ప విషయాలను ఈ ఊరే నాకు నేర్పింది. అదే నాకు స్ఫూర్తినిచ్చింది" అని వీడియోలో వివరించారు. ఈ అనుబంధం కారణంగానే 'యల్లమ్మ' కథకు వెంటనే కనెక్ట్ అయినట్లు తెలిపారు. దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వేణు యెల్దండి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా కోసం దర్శకుడు వేణు, డీఎస్పీ మధ్య తొలి సమావేశం ఏకంగా 8 గంటల పాటు సాగడం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఈ చిత్రంలో డీఎస్పీ 'పర్శి' అనే పాత్రలో కనిపించనుండగా, సంగీతాన్ని కూడా ఆయనే అందిస్తున్నారు.

# 'పెద్ది' ప్రమోషన్స్... 'దేశీ ప్రిన్సెస్'లా జాన్వీ!

బాలీవుడ్ యువ నటి జాన్వీ కపూర్ తన ఫ్యాషన్ సెన్స్‌తో మరోసారి అందరినీ ఆశ్చర్యపరిచారు. బెంగళూరులో తన తాజా చిత్రం 'పెద్ది' ప్రమోషన్లలో భాగంగా ఆమె ధరించిన ఒక ప్రత్యేకమైన డ్రెస్ ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. సాంప్రదాయ బెనారసీ వస్త్రానికి ఆధునిక హంగులు జోడించి రూపొందించిన గౌనులో జాన్వీ అచ్చం 'దేశీ ప్రిన్సెస్' (భారతీయ యువరాణి)లా మెరిసిపోయారు. సాధారణంగా బెనారసీ అంటే చీరనే గుర్తుకువస్తుంది. కానీ, జాన్వీ దానికి భిన్నంగా స్ట్రాప్‌లెస్ గౌనును ఎంచుకున్నారు. కార్సెట్ తరహా బాడీస్‌తో, ఫిట్‌గా ఉండే ఈ గౌను ఆమె అందాన్ని మరింత పెంచింది. లేత గులాబీ, మింట్, ఐవరీ వంటి పాస్టెల్ రంగుల కలయిక, బంగారు వర్ణంతో నేసిన పూల డిజైన్లు ఈ డ్రెస్‌కు ప్రత్యేక ఆకర్షణను తెచ్చిపెట్టాయి. దీనికి జతగా చేతులపై కప్పుకున్న షీర్ పాస్టెల్ దుపట్టా రాజసమైన లుక్‌ను ఇచ్చింది. ఈ డ్రెస్‌కు తగ్గట్టుగా ఆక్సీడైజ్డ్ సిల్వర్ జుంకాలు, స్టేట్‌మెంట్ ఇయర్ కఫ్ వంటి మినిమల్ యాక్సెసరీస్ ధరించారు. నుదుట పాపిడితో వేసిన స్లీక్ బన్, గ్లోయీ మేకప్‌తో తన లుక్‌ను పూర్తిచేశారు. ఇటీవలే పర్పుల్ లెహంగాతో వైరల్ అయిన జాన్వీ, ఇప్పుడు ఈ బెనారసీ గౌనుతో సంప్రదాయ వస్త్రకళకు, ఆధునిక ఫ్యాషన్‌కు మధ్య అద్భుతమైన బ్యాలెన్స్ ఎలా సాధించవచ్చో నిరూపించారు.



# చెన్నై లవ్‌స్టోరీ నుంచి నిను వదలనే ..సెకండ్ సింగిల్ విడుదల




నిమిషమైనా నిను వదలనే.. అంటూ తన మ్యూజిక్‌తో మ్యాజిక్ క్రియేట్ చేశారు మణిశర్మ. కిరణ్ అబ్బవరం ప్రధానపాత్రలో రవి నంబూరి దర్శకత్వంలో రానున్న చిత్రం 'చెన్నై లవ్‌స్టోరీ'. తాజాగా ఈసినిమా నుంచి సెకండ్ సింగిల్‌ను టీమ్ విడుదల చేసింది. 'నను నేను వదిలినా.. నిను వదలనే..' అంటూ సాగే లిరిక్స్ అనంత్ శ్రీరామ్ అందించగా.. జావెద్ అలీ తన గాత్రంతో మరోస్థాయికి తీసుకెళ్లారు. యూత్‌కు కనెక్ట్ అయ్యేలా ఉన్న ఈ పాటను తీర్చిదిద్దారు. తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటున్న యువ నటి శ్రీ గౌరి ప్రియ. వరుసగా విభిన్న పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈ తెలుగమ్మాయి ప్రస్తుతం హీరో కిరణ్ అబ్బవరంతో కలిసి 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రంలో నటిస్తోంది. తాజాగా ఈ సినిమా నుంచి విడుదలైన 'వదలనే' పాట లాంచ్ ఈవెంట్‌లో శ్రీ గౌరి ప్రియ చేసిన వ్యాఖ్యలు అందరినీ భావోద్వేగానికి గురి చేశాయి. ఈ పాటలోని లిరిక్స్‌ను ఎవరికి అంకితం చేస్తారని ప్రశ్నించగా, శ్రీ గౌరి ప్రియ సమాధానం ఇస్తూ ఒక్కసారిగా భావోద్వేగానికి లోనైంది. నిజంగా చెప్పాలంటే మా అమ్మ నన్ను వదిలేసి మూడేళ్లు అయింది. కానీ తను నన్ను అసలు వదల్లేదు. నేను కూడా తనను ఎప్పటికీ వదలను. ఈ విషయం తనకు తెలుసు, నాకు తెలుసు. ఈ పాటలోని లైన్స్‌ను మా అమ్మకే అంకితం చేస్తున్నాను' అని చెప్పింది. ఆమె మాటలు విన్న వెంటనే కార్యక్రమంలో ఉన్నవారు కొద్దిసేపు నిశ్శబ్దంగా మారిపోయారు. సోషల్ మీడియాలో ఈ వీడియో వేగంగా వైరల్ అవుతోంది. మూడేళ్ల క్రితం శ్రీ గౌరి ప్రియ తల్లి వసుంధర క్యాన్సర్ కారణంగా మరణించారు. తల్లితో తనకు చాలా ఆత్మీయ అనుబంధం ఉండేదని గౌరి ప్రియ పలు సందర్భాల్లో వెల్లడించింది. ఆమెను కేవలం తల్లిగానే కాకుండా ఒక మంచి స్నేహితురాలిగా భావించేదని చెప్పింది. తల్లి మరణంతో కొంతకాలం తీవ్ర మానసిక వేదనకు గురైన ఆమె, ఆ తర్వాత మళ్లీ తన కెరీర్‌పై దృష్టి పెట్టింది. హీరో కిరణ్ అబ్బవరం ప్రధాన పాత్రలో నటిస్తున్న 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. సంగీత దర్శకుడు మణిశర్మ స్వరాలు అందిస్తున్నారు.

# ముదిరిన డాన్-3 వివాదం

## రణ్‌వీర్‌పై సినీ ఎంప్లాయిస్ నిషేధం

'ధురంధర్' రెండు భాగాలతో సూపర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకుని కొన్ని రోజులుగా టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారారు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు రణ్‌వీర్. ఇప్పుడు ఆయన మరోసారి వార్తల్లో నిలిచారు. కొన్ని రోజులుగా చర్చనీయాంశమైన 'డాన్ 3' వివాదం ఇప్పుడు ముదిరింది. ఏకంగా ఈ అగ్ర హీరోపై బ్యాన్ విధించే పరిస్థితికి వచ్చింది. అమితాబ్ బచ్చన్, షారుఖ్ ఖాన్ తర్వాత డాన్ పాత్రను పోషించాల్సిన రణ్‌వీర్‌పై 'ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్'(ఎఫ్‌డబ్ల్యూఐసీఈ) మూడేళ్ల పాటు నిషేధం విధించింది. దీంతో ఆయన హాట్ టాపిక్‌గా మారారు. 2023లో ఫర్హాన్ అక్తర్ ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ రణ్‌వీర్ సింగ్ హీరోగా 'డాన్ 3'ని అధికారికంగా ప్రకటించింది. అప్పుడే ప్రమోషనల్ వీడియోను విడుదల చేసి పెద్ద సంచలనం సృష్టించింది. అయితే సినిమా తీయడంలో కొంత ఆలస్యం కావడం.. స్క్రిప్ట్‌లో సమస్యలు తలెత్తడంతో రణ్‌వీర్ ఈ చిత్రం నుంచి వైదొలిగినట్లు వార్తలు వచ్చాయి. రణ్‌వీర్ తన డాన్ పాత్రను మరింత డార్క్, హింసాత్మకంగా చూపించాలని కోరుకున్నట్టు బాలీవుడ్ మీడియాలో వార్తలు వచ్చాయి. అయితే ఫర్హాన్ అక్తర్ పాత్రను మార్చడానికి నిరాకరించడంతో ఇద్దరి మధ్య విభేదాలు వచ్చాయి. షూటింగ్ షెడ్యూల్ ఆలస్యం కావడంతో రణ్‌వీర్ అసహనం వ్యక్తంచేస్తూ ఈ ప్రాజెక్ట్ నుంచి వైదొలిగినట్లు



బాలీవుడ్ కథనాలు పేర్కొన్నాయి. 'డాన్ 3' నుంచి తాను వైదొలిగిన తర్వాత దర్శకుడు ఫర్హాన్ అక్తర్‌కు రణ్‌వీర్ రూ.10కోట్లు ఆఫర్ చేసినట్లు వార్తలు వచ్చాయి. అలాగే తన తదుపరి చిత్రం 'ప్రళయ్'లో అక్తర్ నిర్మాణసంస్థకు వాటా ఇవ్వడానికి కూడా ఈ హీరో అంగీకరించారని టాక్ వినిపించింది. అయితే దీనిపై ఎవరూ అధికారికంగా స్పందించలేదు. ఒకవైపు ఈ వార్తలు వస్తోన్న తరుణంలోనే ఈ వివాదంపై ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ రణ్‌వీర్ సింగ్‌పై రూ.45 కోట్ల నష్టపరిహారం కోరుతూ లీగల్ నోటీసు జారీ చేసింది. దీంతో 'ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్'(ఎఫ్‌డబ్ల్యూఐసీఈ) రణ్‌వీర్‌పై మూడేళ్ల నిషేధం విధించింది. రణ్‌వీర్ చర్చలకు సహకరించలేదని, నిర్మాతలు నష్టపోయిన రూ.45 కోట్ల ప్రీ ప్రొడక్షన్ నష్టపరిహారం విషయంలో నిర్మాణ సంస్థతో ఉన్న వివాదాన్ని పరిష్కరించుకునే వరకు ఆయనతో కలిసి పనిచేయవద్దని పరిశ్రమని ఆదేశిస్తూ 'ఎఫ్‌డబ్ల్యూఐసీఈ' ప్రకటన జారీ చేసింది. సినిమాలు కీలక దశలో ఉన్నప్పుడు సీనియర్‌లు, స్టార్‌లు ప్రాజెక్ట్‌ల నుంచి వైదొలగడం వినోద పరిశ్రమ స్థిరత్వానికి.. పని వాతావరణానికి తీవ్ర ముప్పును కలిగిస్తుందని ఎఫ్‌డబ్ల్యూఐసీఈ పేర్కొంది. అయితే, ఇది ప్రభుత్వం విధించిన నిషేధం కాకపోవడంతో రణ్‌వీర్‌పై పెద్దగా ప్రభావం పడదని సినీవర్గాలు భావిస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారంపై రణ్‌వీర్ టీమ్ స్పందించింది. 'ఆయన తన వృత్తిని ఎంతో గౌరవిస్తారు. 'డాన్ 3' విషయంలో జరుగుతోన్న పరిణామాలపై ఆయన స్పందించకపోవడానికి కారణం ఇదే. ఊహాగానాలకు ఆజ్యం పోయడం ఆయనకు ఇష్టం లేదు' అని టీమ్ పేర్కొంది. డాన్ 3లో భాగమైన ప్రతిఒక్కరినీ ఆయన ఎంతో గౌరవిస్తారని తెలిపింది. ఈ బ్యాన్ ఆయన భవిష్యత్ ప్రాజెక్టులపై ఎంత ప్రభావం చూపుతుందనేది ఆసక్తిగా మారింది.




# ఎపిక్ నుంచి ప్రియసఖి సాంగ్ విడుదల

'జీవితాన్ని మార్చేశావే బుజ్జి నెమలి.. స్వర్గంలోతు చూపించావే పూల కడలి' అంటూ వైష్ణవీ చైతన్యపై పొగడ్తలు కురిపిస్తున్నారు హీరో ఆనంద్ దేవరకొండ. వీరిద్దరూ ప్రధానపాత్రల్లో నటిస్తోన్న చిత్రం 'ఎపిక్- ఫస్ట్ సెమిస్టర్'. మిడిల్‌క్లాస్ బయోపిక్' ఫేమ్ ఆదిత్య హాసన్ తెరకెక్కిస్తున్న చిత్రమిది. తాజాగా ఈ సినిమా నుంచి 'ప్రియసఖి..' అంటూ సాగే పాటను టీమ్ విడుదల చేసింది. సురేశ్ బానిశెట్టి లిరిక్స్ రాయగా.. కేఎస్ హరిశంకర్ ఆలపించారు.

# సిఎం విజయ్‌తో లోకేశ్ కనగరాజ్ భేటీ





తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తూ, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చారిత్రాత్మక విజయం సాధించి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తమిళగ వెట్రి కజగం అధినేత, దళపతి విజయ్‌ను ప్రముఖ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన విజయ్‌కు ఆయన స్వయంగా కలిసి తన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా విజయ్‌తో దిగిన ఫొటోను షేర్ చేసిన లోకేష్ తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన విజయ్ అన్నా నీకు శుభాకాంక్షలు అంటూ లోకేష్ రాసుకోచ్చాడు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'మాస్టర్', 'లియో' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ హిట్‌లుగా నిలిచిన సంగతి తెలిసిందే. కేవలం దర్శకుడిగానే కాకుండా విజయ్‌తో లోకేష్‌కు ఎంతో కాలంగా మంచి ఆత్మీయ అనుబంధం ఉంది.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com